Prajalakshyam Telugu Daily

# ప్రజాలక్ష్యం

తెలుగు దిన పత్రిక

ఎడిటర్ : గోలి సమ్మిరెడ్డి

సంపుటి: 16 | సంచిక: 353 | కరీంనగర్ | బుధవారం 13 మే 2026 | పేజీలు: 12 | వెల: 2.00

## అన్నా డిఎంకెలో లుకలుకలు

**- పళనిస్వామి నాయకత్వంపై తిరుగుబాటు**

**- టివికెకు మద్దతు ప్రకటించిన షణ్ముగం వర్గం**

(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)

చెన్నై, మే 12 : తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం అన్నాడీఎంకే లో లుకలుకలు బయటపడ్డాయి. పళని స్వామి నాయకత్వంపై తిరుగుబాటు మొదలయ్యింది. తాజాగా ఆ పార్టీలోని సీవీ షణ్ముగం వర్గం కీలక నిర్ణయం తీసుకుంది. ముఖ్యమంత్రి విజయ్ సారధ్యంలోని తమిళగ వెట్రి కళగంకు మద్దతు ప్రకటించింది. ఆయన

11లో

## తమిళనాడు అసెంబ్లీ స్పీకర్‌గా జెసిడి ప్రభాకర్

**- డిప్యూటి స్పీకర్‌గా రవిశంకర్ ఎన్నిక**



(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)

చెన్నై, మే 12 : తమిళనాడు అసెంబ్లీ స్పీకర్‌గా

11లో





## ధాన్యం సేకరణలో

# నిర్లక్ష్యం సహించం



**- సజావుగా వరి, మొక్కజొన్న కొనుగోళ్లు**

**- ధాన్యం వెంటనే లారీల్లో తరలించాల్సిందే**

**- అవసరమైతే పోలీస్ సాయంతో ధాన్యం సేకరణ**

**- లారీలు పంపకుంటే క్రిమినల్ కేసులు పెట్టండి**

**- కలెక్టర్లకు సిఎం రేవంత్ రెడ్డి స్పష్టమైన ఆదేశాలు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మే 12 : ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్ల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ధాన్యం లోడ్ తరలించేందుకు ఒప్పందం మేరకు సరిపడా లారీలను అందుబాటులో ఉంచని కాంట్రాక్టర్లను ఉపేక్షించొద్దని.. అవసరమైతే అలాంటి వారిపై క్రిమినల్ కేసులకు వెనకాడవద్దని ముఖ్యమంత్రి ఆదేశించారు.

11లో

## జూన్ 2న ఇందిరమ్మ ఇళ్ల

# రెండో విడత పంపిణీ



**- రెండోవిడతపై 21న కేబినేట్‌లో ఖరారు చేస్తాం - స్పెషల్ డ్రైవ్ ద్వారా డబుల్ ఇళ్లు పంపిణీ - అధికారులతో సమీక్షించిన మంత్రి పొంగులేటి**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మే 12 : రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జూన్ 2న ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత పంపిణీ ప్రారంభించనున్నట్లు తెలంగాణ గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని ఆదిలాబాద్‌లో ప్రారంభిస్తామని చెప్పారు. మంగళవారం గృహనిర్మాణశాఖ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల విధివిధానాలను ఈనెల 21న జరిగే మంత్రివర్గ సమావేశంలో ఖరారు చేస్తామని పొంగులేటి చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం స్థలాలు గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను లబ్ధిదారులకు ఇచ్చేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. హైదరాబాద్‌లో స్థలాలు ఉన్నవారికి ఈ నెలాఖరులోపు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని చెప్పారు. ప్రభుత్వ భూముల అన్యాక్రాంతంపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. రాష్ట్రంలో పేదల సొంత ఇంటి కలను సాకారం చేయడానికి సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అమలు చేస్తోందని పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మొదటి విడత ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కొలిక్కి వచ్చిన నేపథ్యంలో సీఎం రేవంత్ సూచన మేరకు రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవమైన జూన్ 2 వ తేదీన ఆదిలాబాద్ జిల్లాలో రెండో విడతను లాంఛనంగా ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. ఇందుకు సంబంధించిన విధివిధానాలపై ఈ నెల 21 వ తేదీన జరిగే మంత్రివర్గ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు చెందిన ఇన్ ఛార్జి మంత్రులు, జిల్లా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్లు, సైబరాబాద్, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ల కమిషనర్లు, హౌసింగ్, రెవెన్యూ, ఫారెస్టు అధికారులతో మంత్రి సమీక్ష

11లో

## అసోం సిఎంగా హిమంత బిశ్వశర్మ

**- ప్రమాణ కార్యక్రమానికి ప్రధాని హాజరు**

**- ఎన్‌డి ముఖ్యమంత్రుల్లో చంద్రబాబు రాక**




(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)

గౌహతి, మే 12 : అస్సాం ముఖ్యమంత్రిగా హిమంత బిశ్వశర్మ ప్రమాణస్వీకారం చేశారు. అస్సాంలో వరుసగా రెండోసారి సీఎం పదవిని చేపట్టిన తొలి భాజపా నేతగా హిమంత నిలిచారు. ఆయనతో పాటు మరో నలుగురు మంత్రులు ప్రమాణం చేశారు. ఉదయం 11.40 గంటలకు గువాహటిలోని వెటర్నరీ కాలేజీ ఫీల్డ్‌లో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్య ఆయనతో ప్రమాణస్వీకారం చేయించారు.

11లో



## పోక్సో కేసులో కుల ప్రసక్తి ఉండదు

**- చట్టం అందరికీ ఒకేలా ఉంటుంది**

**- పొన్నం వ్యాఖ్యలు ఆయన వ్యక్తిగతమన్న పిసిసి చీఫ్**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మే 12 : తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ వాఖ్యలను టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఖండించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్ కేసు వ్యవహారంలో మంత్రి పొన్నం చేసిన వ్యాఖ్యలు ఆయన వ్యక్తిగతమని స్పష్టం చేశా రు. కాంగ్రెస్ పార్టీకి లేదా ప్రభుత్వానికి పొన్నం వ్యాఖ్యలతో ఎలాంటి సంబంధం లేదని తేల్చిచెప్పారు. మంగళవారం గాంధీభవన్‌లో మహేశ్ గౌడ్ మీడియాతో మాట్లాడారు. కులసంఘం మధ్యవర్తిత్వం, వివాహం ద్వారా ఇలాంటి తీవ్రమైన కేసులను పరిష్కరించుకోవాలని పొన్నం అన్నారని తెలిపారు. పొన్నం సూచనలను కాంగ్రెస్ ఖండిస్తోం దని మహేశ్ గౌడ్ వ్యాఖ్యానించారు. మైనర్ల విషయంలో చట్టపరంగా ఇబ్బందులు తప్పవని చెప్పుకొచ్చారు. పోక్సో

11లో

## "కేసీఆర్‌ను గద్దె దించడంలో

# టీజేఎస్ కీలక పాత్ర పోషించింది"

**- తెలంగాణ జన సమితి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ప్రొఫెషర్ కోదండరాం.**

**- హైదరాబాద్ లో ఘనంగా టీజేఎస్ టీజేఎస్ 4వ ప్లీనరీ.**

**- మరోసారి కోదండరాం అధ్యక్షుడిగా ఎన్నిక.**

**- "ఇదే నాకు చివరి అధ్యక్ష పదవి.. కొత్త నాయకత్వానికి అవకాశం ఇస్తా"**



(ప్రజాలక్ష్యం ప్రత్యేక ప్రతినిధి)

హైదరాబాద్, మే 12 : కేసీఆర్‌ను గద్దె దించడంలో టీజేఎస్ కీలక పాత్ర పోషించిందని తెలంగాణ జన సమితి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ప్రొఫెషర్ కోదండరాం అన్నారు. తెలంగాణ జన సమితి (టీజేఎస్) 4వ ప్లీనరీ సమావేశాలు మంగళవారం హైదరాబాద్‌లోని నెక్లెస్‌రోడ్ జలవిహార్‌లో ఘనంగా నిర్వహించబడ్డాయి. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం సమక్షంలో జరిగిన ఈ సమావేశంలో ఆయనను మరోసారి ఏకగ్రీవంగా టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడిగా

11లో

## లక్షల మంది విద్యార్థుల కలలు కల్లలు

**నీట్ పరీక్ష రద్దుపై మండిపడ్డ రాహుల్ గాంధీ**



(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)

న్యూఢిల్లీ, మే 12 : నీట్ ప్రశ్నాపత్రం లీక్ కారణంగా నీట్ పరీక్ష రద్దు కావడంపై ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కొన్ని లక్షల మంది కష్టాన్ని, కలల్ని బీజేపీ ప్రభుత్వం ఛిద్రం చేసిందని విమర్శించారు. ఇది కేవలం పరిపాలనా వైఫల్యం మాత్రమే కాదని, యువత భవిష్యత్తును కాలరాసే నేరమని ఆరోపించారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో రాహుల్ గాంధీ ఓ ట్వీట్ చేశారు. దేశవ్యాప్తంగా 22 లక్షల మందికి పైగా విద్యార్థుల కష్టం, తల్లిదండ్రుల త్యాగాలు, ఎన్నో కుటుంబాల ఆశలు ఈ అవినీతి పాలన వల్ల నాశనమయ్యాయని రాహుల్ గాంధీ అన్నారు. కొంతమంది తండ్రులు అప్పులు చేశారని, తల్లులు తమ నగలు అమ్మారని, లక్షలాది మంది విద్యార్థులు రాత్రింబవళ్లు కష్టపడి చదివారని, అయితే పేపర్ లీకులు, ప్రభుత్వ నిర్లక్ష్యం, విద్యా వ్యవస్థలో అవినీతి వారికి శాపంలా మారాయని

11లో

## బండి కుమారుడిని తప్పించే యత్నం

**- సిట్ విచారణ పేరుతో కాలయాపన**

**- మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి విమర్శలు**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

నిజామాబాద్, మే 12 : కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసు, దీనిపై కాంగ్రెస్ ప్రభుత్వం తీరుపై మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కేంద్రమంత్రి కుమారుడు పరారీలో ఉన్నాడని అనడం హాస్యాస్పదమని అన్నారు. సిట్ విచారణ పేరిట నిందితుడిని సీఎం రేవంత్ రెడ్డి తప్పించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఒక మైనర్ బాలికకు డ్రగ్స్ ఇచ్చి, మద్యం తాగించి అత్యాచారం చేసినట్లు ఆరోపణలు వస్తున్నా.. పోలీసులు మూడు

11లో

## సనత్‌నగర్ టిమ్స్‌లో వైద్యసేవల ట్రయల్ రన్

**- స్వయంగా పరిశీలించిన మంత్రి దామోదర**

**- జూన్‌లో ప్రారంభిస్తామని వెల్లడి**




(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)

హైదరాబాద్, మే 12 : సనత్‌నగర్ టిమ్స్‌లో జరుగుతున్న వైద్య సేవల ట్రయల్ రన్‌ను ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పరిశీలించారు. హాస్పిటల్ బ్లాకులన్నీ మంత్రి కలియ తిరిగారు. ఓపీ రిజిస్ట్రేషన్, ఐపీ వార్డులు, ఎమర్జెన్సీ డిపార్ట్ మెంట్, సీటీ స్కాన్, ఎంఆర్ఐ, ల్యాబులు, మెకనైజ్డ్ ల్యాండ్రీ, కిచెన్ తదితర అన్ని డిపార్ట్ మెంట్లను మంత్రి పరిశీలించారు. పెండింగ్ పనులన్నీ

11లో

## నీట్ ప్రవేశ పరీక్ష రద్దు

**- పేపర్ లీక్ వ్యవహారంతో ఎన్‌టిఎ నిర్ణయం**

**- సిబిఐ విచారణకు ఆదేశించినట్లు వెల్లడి**

(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)

న్యూఢిల్లీ, మే12 : జాతీయ అర్హత పరీక్ష నీట్ యూజీ-2026ను రద్దు చేసారు. పేపర్ లీక్ ఆరోపణలు రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. నీట్ పరీక్షకు సంబంధించిన ప్రశ్నపత్రం రాజస్థాన్‌లో లీకైనట్లు వచ్చిన వార్తలు పెనుదుమారం రేపాయి. ఈ నేపథ్యంలో జాతీయ పరీక్ష సంస్థ (ఎన్‌టీఏ) కీలక నిర్ణయం తీసుకుంది.

11లో




దేశవ్యాప్తంగా మే 3న జరిగిన నీట్

## నేషనల్ డెయిరీతో నార్ముల్ ఒప్పందం

**- పాడిరైతులకు తొలుత పదికోట్లు చెల్లింపు**

(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)



హైదరాబాద్, మే 12 : నల్లగొండ-రంగారెడ్డి జిల్లాల పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంఘం లిమిటెడ్ (నార్ముల్), నేషనల్ డెయిరీ డెవలంప్‌మెంట్ బోర్డుతో త్రైపాక్షిక ఒప్పందం కుదర్చుకుంది. 15 ఏళ్లపాటు డెయిరీ అభివృద్ధి చేసే బాధ్యతను అది తీసుకోనుంది. ఒప్పందంలో భాగంగా మొదట పాడి

11లో

## నీట్ పేపర్ లీక్ కేసు - 13 మందిని అరెస్ట్ చేసిన పోలీసులు

(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)




జైపూర్, మే 12 : రాజస్థాన్ లోని సికార్‌లో నీట్ పేపర్ లీక్ కేసు వ్యవహారంలో 13 మందిని పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. వీరిని పోలీసులు విచారిస్తున్నారు. 'గెస్ పేపర్' పేరుతో మార్కెట్‌లోకి ఈ నీట్

11లో

# సింగరేణి భవన్‌లో గుర్తింపు సంఘం ఏఐటియుసితో సమావేశం



- కార్మికుల సమస్యల పరిష్కారంపై యాజమాన్యం పలు కీలక నిర్ణయాలు
- నెల రోజుల్లో మెడికల్ బోర్డ్ ఏర్పాటుకు హామీ
- గోల్డెన్ హ్యాండ్‌షేక్ లేదా వీఆర్ఎస్ వంటి విధానాల అమలు ఉండదు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్/భద్రాద్రి–కొత్తగూడెం, మే 12 : సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారంపై మంగళవారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో గుర్తింపు సంఘం ఏఐటియుసి నాయకులతో డైరెక్టర్ (పా) గౌతమ్ పొట్రు ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కార్మికులకు సంబంధించిన పలు పెండింగ్ సమస్యలపై యాజమాన్యం కీలక నిర్ణయాలు తీసుకుంది. సమావేశంలో ఏఐటియుసి నాయకులు కార్మికుల సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లగా, వాటి పరిష్కారానికి సానుకూలంగా స్పందించిన అధికారులు పలు హామీలు ఇచ్చారు. మెడికల్ బోర్డును నెల రోజుల్లో ఏర్పాటు చేస్తామని యాజమాన్యం తెలిపింది. సొంత ఇంటి పథకంపై వచ్చే స్ట్రక్చర్ మీటింగ్‌లో చర్చించి అమలు విధానాలను ఖరారు చేస్తామని పేర్కొంది. పెర్క్‌పై ట్యాక్స్ సమస్యను కూడా అదే సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని వెల్లడించింది. కార్మికులు క్వార్టర్లు ఖాళీ చేసిన వెంటనే క్వార్టర్ వెకేషన్ సర్టిఫికేట్ జారీ చేస్తామని, పెండింగ్‌లో ఉన్న 337 మందికి పైగా డిపెండెంట్‌లకు ఉద్యోగాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గనులపై డిపెండెంట్ ఉద్యోగాల దరఖాస్తులను కేసుల వారీగా పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. అనారోగ్యంతో ఆసుపత్రులకు వెళ్లిన కార్మికుల వైద్య బిల్లులను పరిష్కరిస్తామని, మూడు సంవత్సరాల నిబంధనతో సంబంధం లేకుండా ఖాళీలు ఉన్నచోట వెంటనే బదిలీలు చేపడతామని పేర్కొన్నారు. మారుపేర్ల సమస్యను ప్రభుత్వ స్థాయిలో చర్చించి పరిష్కరిస్తామని తెలిపారు. అండర్‌గ్రౌండ్ అలవెన్స్ కట్టింగ్ సమస్య, డిస్మిస్ అయిన కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని యాజమాన్యం హామీ ఇచ్చింది. ఆసుపత్రుల్లో ఆధార్ వివరాలు మారిన వారికి సెల్ఫ్ డిక్లరేషన్ ఆధారంగా చికిత్స అందిస్తామని, ఓవర్‌మన్‌లకు పెండింగ్ ప్రమోషన్లు మంజూరు చేస్తామని తెలిపింది. అన్‌ఫిట్ అయిన మైనింగ్, ట్రేడ్స్‌మెన్ కార్మికులకు తగిన ఉద్యోగాలు కల్పిస్తామని, రిటైర్డ్ కార్మికులకు నిలిపివేసిన లాభాల వాటా, దీపావళి బోనస్, పీఎల్ఆర్ చెల్లించేందుకు అంగీకరించినట్లు వెల్లడించింది. గోల్డెన్ హ్యాండ్‌షేక్ లేదా వీఆర్ఎస్ వంటి విధానాలను అమలు చేయబోమని డైరెక్టర్ స్పష్టం చేశారు. జనరల్ సమ్మెలో పాల్గొన్న కాంట్రాక్టు కార్మికులపై విధించిన పీనల్ వేజ్ కట్టింగ్‌ను నిలిపివేస్తామని తెలిపారు. మిగిలిన కీలక సమస్యలను త్వరలో సీఎండీ, డైరెక్టర్ (పా) స్థాయిలో జరిగే స్ట్రక్చర్ మీటింగ్‌లో చర్చించి పరిష్కరిస్తామని యాజమాన్యం హామీ ఇచ్చింది. కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం గుర్తింపు సంఘం ఏఐటియుసి నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని నాయకులు పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఏఐటియుసి అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్, అదనపు ప్రధాన కార్యదర్శి మిరియాల రంగయ్య, ఉప ప్రధాన కార్యదర్శి సారయ్య పాల్గొన్నారు. యాజమాన్యం తరపున జీఎం పర్సనల్ కవిత నాయుడు, డీజీఎం పర్సనల్ అజయ్‌కుమార్ తదితరులు హాజరయ్యారు.

# సింగరేణిని కాపాడుకోవడం తెలంగాణ సమాజ బాధ్యత

- కార్మిక హక్కుల పరిరక్షణకు టీజేఎస్ పోరాటం కొనసాగుతుంది
- తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కామెర గట్టయ్య

(ప్రజాలక్ష్యం ప్రత్యేక ప్రతినిధి)




హైదరాబాద్, మే 12 : తెలంగాణకు కొంగుబంగారంగా పేరొందిన సింగరేణి సంస్థను, కార్మిక హక్కులను కాపాడుకోవడం తెలంగాణ సమాజం బాధ్యత అని తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కామెర గట్టయ్య అన్నారు. తెలంగాణ జన సమితి (టీజేఎస్) 4వ ప్లీనరీ సమావేశాలు మంగళవారం హైదరాబాద్ నెక్లెస్ రోడ్‌లోని జలవిహార్‌లో టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం సమక్షంలో నిర్వహించగా, ఈ సమావేశంలో పాల్గొన్న కామెర గట్టయ్య సింగరేణి ప్రస్తుత పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 137 సంవత్సరాల చరిత్ర కలిగిన సింగరేణి సంస్థ ఒకప్పుడు 59 భూగర్భ గనులతో లక్ష మందికి పైగా కార్మికులకు ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి కల్పించిందని గుర్తు చేశారు. ప్రస్తుతం పాలకుల తప్పుడు విధానాల కారణంగా సంస్థ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని విమర్శించారు. 2014లో సుమారు 63 వేల మంది కార్మికులు ఉండగా, 2023 నాటికి ఆ సంఖ్య 39 వేలకు పడిపోయిందని తెలిపారు. ప్రైవేటీకరణ, కాంట్రాక్టీకరణ విధానాల వల్ల రెగ్యులర్ ఉద్యోగాలు తగ్గిపోతున్నాయని, కార్మిక హక్కులు హరించబడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 2015 గనుల చట్టం, 2019 మరియు 2023లో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు కార్మికుల భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని పేర్కొన్నారు. ఓపెన్ కాస్ట్ గనుల విస్తరణ కూడా కార్మికుల ఉపాధి, హక్కులపై ప్రతికూల ప్రభావం చూపుతోందన్నారు. కేంద్ర ప్రభుత్వం బొగ్గు బ్లాకులను వేలం వేయడం, సింగరేణికి కొత్త గనుల కేటాయింపులో అడ్డంకులు సృష్టించడం వల్ల సంస్థ అభివృద్ధి దెబ్బతింటోందని విమర్శించారు. ఎన్నికల సమయంలో కార్మికులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వాలు అమలు చేయడంలో విఫలమయ్యాయని ఆరోపించారు. సంస్థలో ప్రభుత్వ జోక్యం పెరగడంతో పరిపాలనలో పారదర్శకత తగ్గిపోయిందని, కాంట్రాక్టు దోపిడీ పెరిగిందని కామెర గట్టయ్య పేర్కొన్నారు. సింగరేణి సంస్థను, కార్మిక హక్కులను పరిరక్షించేందుకు తెలంగాణ జన సమితి పార్టీ కార్మికులతో కలిసి పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాంకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

# ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు చేసేలా చూడాల్సిన బాధ్యత అధికారులదే

- ఇబ్బందులుంటే స్వర్గీయ రత్నాకర్ రావు నెంబర్ 9440152929 కు ఫోన్ చేయండి
- కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



జగిత్యాల, మే 12 : రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని కొనుగోలులో అవకతవకళ్లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదేనని, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ..రైతులకు ఎలాంటి ఇబ్బంది ఉన్న స్వర్గీయ జువ్వాడి రత్నాకర్ రావు ఫోన్ నెంబర్ 9440152929 నంబరు పోన్ చేయాలని, నిబంధనల అతిక్రమించి రైతులను మోసం చేస్తే రైతుల పక్షాన ఎంత దూరం వెళ్లడానికైనా తాను సిద్ధంగా ఉన్నానని అన్నారు. కోరుట్ల నియోజకవర్గంలోని ఎన్ హెచ్ 63 జాతీయ రహదారిపై మంగళవారం రైస్ మిల్లర్లు తమను తూకంలో మోసగిస్తున్నారని, ఆయా గ్రామాలకు చెందిన రైతులు ధర్నాకు దిగడంతో విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు స్వయంగా రైతుల ధర్నా ప్రాంతానికి వెళ్లి వారి సమస్యలు విని, అక్కడికక్కడే రెవెన్యూ, పోలీస్ అధికారులకు ఫోన్ ద్వారా సమాచారం అందించి, రైతులు, రెవెన్యూ అధికారులు, పోలీసులతో సంబంధిత రైస్ మిల్లులకు వెళ్లి 43 కిలోలు తూకం వేయాల్సి ఉండగా రైస్ మిల్లులు అక్రమంగా 42 కిలోలు తూకం వేస్తున్న విషయాన్ని తెలుసుకొని రైస్ మిల్ యాజమాన్యాలను తీవ్రంగా హెచ్చరించారు. ధాన్యం మొక్కజొన్న కొనుగోలు విషయంలో నిర్లక్ష్యం వహిస్తే ఊర్కొనేది లేదని ఇకముందు ఇలాంటి మోసాలు నిర్లక్ష్యం జరిగిన సహించేది లేదని, ముఖ్యమంత్రి సంబంధిత మంత్రుల దృష్టికి తీసుకొని వెళ్ళడానికి వెనుకాడబొమన్నారు. అధికారులు గన్ని బ్యాగులు ఆమాలీల కొరత లేకుండా చూడాలని, లారీలు కూడా సరైన సమయానికి అందుబాటులో ఉంచాలని, ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. ఎవరైనా తూకం వేయడంలో మోసం చేస్తే మాజీ మంత్రి దివంగత జువ్వాడి రత్నాకర్ రావు ఉపయోగించిన సెల్ ఫోన్ నంబర్ ఇప్పటికీ తమ వద్ద వాడుకలో ఉందని, ఎవరు మోసగించిన ఆ నెంబర్ కి ఫోన్ చేయాలని, తాము తక్షణం స్పందించి అలా మోసగించిన వారిపై చర్యలు తీసుకొని రైతులకు న్యాయం చేస్తామన్నారు. ఈ సమావేశంలో కోరుట్ల మార్కెట్ కమిటీ చైర్మన్ పన్నాల అంజిరెడ్డి, కోరుట్ల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు తిరుమల గంగాధర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వెంకటేష్ గౌడ్, వెంకటేశ్వర దేవస్థానం అధ్యక్షులు ఏతిరాజం నర్సయ్య, ఉమ్మడి కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ మాజీ ప్రధాన కార్యదర్శి రాజోజి సదానందచారి, చిన్న మెట్టుపల్లి సర్పంచ్ ఎండీ రహీం, కౌన్సిలర్ లు చిట్యాల లక్ష్మీనారాయణ, రహీం, యూత్ కాంగ్రెస్ కోరుట్ల నియోజకవర్గ మాజీ అధ్యక్షులు ఏలేటి మహిపాల్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ శ్రీరాములు అమరేందర్, పల్లపు రాజు, నాయకులు నేమూరి భూమయ్య, చేట్మెల్లి రంజిత్ గుప్తా, అశోక్, నజ్జు, సుమన్, మహేష్, తిరుపతి రెడ్డి, అనంతరెడ్డి, రియాజ్ మున్సిపల్ కో అప్షన్ సభ్యులు కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కొడుకు కేసుపై బండి సంజయ్ మౌనం ఎందుకు?

- హనీ ట్రాప్ పేరుతో కేసు మళ్లించే యత్నం
- సీఎల్పీలో విప్ బీర్ల అయిలయ్య విమర్శలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



యాదాద్రి–భువనగిరి, మే 12 : తన కుమారుడిపై నమోదైన పోక్సో కేసు వ్యవహారం లో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ వ్యవహరిస్తున్న తీరు తీవ్ర విస్మయానికి గురిచేస్తోందని తెలంగాణ ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య విమర్శించారు. హైదరాబాద్‌లోని సీఎల్పీలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో చిన్న ఘటన జరిగినా వెంటనే స్పందించే బండి సంజయ్ తన కుమారుడిపై కేసు నమోదైన విషయంలో మాత్రం ఇప్పటివరకు స్పష్టంగా స్పందించక పోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు. "హనీ ట్రాప్" పేరుతో అసలు కేసును తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయని పేర్కొన్నారు. తన కుమారుడు నిర్దోషి అయితే తాను విశ్వసించే శ్రీరాముడి పేరిట బహిరంగంగా ప్రమాణం చేసి చెప్పాలని ప్రజలు ప్రశ్నిస్తున్నారని అన్నారు. భాగ్యలక్ష్మి ఆలయానికి వెళ్లి ప్రమాణం చేస్తే ప్రజలకు మరింత స్పష్టత వస్తుందని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం బండి భగీరథ్ పరారీలో ఉన్నాడని పోలీసులు చెబుతున్నారని, ప్రజాస్వామ్యంపై నమ్మకం ఉంటే వెంటనే అతడిని లొంగిపోయేలా చూడాలని డిమాండ్ చేశారు. క్రమశిక్షణ గల నాయకుడైతే స్వయంగా పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి అప్పగించాలని సూచించారు. బండి సంజయ్ తరచూ శ్రీరాముడి విలువలు, నీతి గురించి మాట్లాడుతుంటారని, కానీ అదే విలువలను తన కుటుంబంలో అమలు చేయడంలో విఫలమయ్యారనే విమర్శలు వస్తున్నాయని అన్నారు. గతంలో భగీరథ్ ప్రవర్తనకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయని, మద్యం సేవించడం, దాడులకు పాల్పడడం, ఇప్పుడు లైంగిక వేధింపుల ఆరోపణలు రావడం చర్చనీయాంశంగా మారిందన్నారు. ఇంత జరుగుతున్నా బండి సంజయ్ స్పందించకపోవడం గమనార్హమని, బాధితురాలు, ఆమె కుటుంబాన్ని బెదిరించారనే వార్తలు కూడా వస్తున్నాయని పేర్కొన్నారు. కేసును తప్పుదోవ పట్టించేందుకు, మీడియా మేనేజ్‌మెంట్‌కు ప్రయత్నాలు జరిగాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయని అయిలయ్య ఆరోపించారు.

# రానున్న 15 రోజులు అత్యంత కీలకం - జిల్లా కలెక్టర్ అంకిత్

మొక్కజొన్న, ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



భద్రాద్రి–కొత్తగూడెం, మే 12 : రానున్న 15 రోజులు మొక్కజొన్న, ధాన్యం కొనుగోళ్లకు అత్యంత కీలకమైనవని, క్షేత్రస్థాయిలో ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించి కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సంబంధిత శాఖల అధికారులతో టెలికాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలో జరుగుతున్న మొక్కజొన్న, ధాన్యం కొనుగోళ్ల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొక్కజొన్న నిల్వలు, లోడింగ్ పరిస్థితులు, గోడౌన్ల అందుబాటు, రవాణా సదుపాయాలు తదితర అంశాలపై సమగ్రంగా సమీక్ష చేపట్టినట్లు తెలిపారు. ముఖ్యంగా ఇల్లందు నియోజకవర్గ పరిధిలో సుమారు 9,300 మెట్రిక్ టన్నుల మొక్కజొన్న నిల్వలు ఉన్నాయని, లోడింగ్ ప్రక్రియలో జాప్యం ఎందుకు జరుగుతోందనే అంశంపై అధికారులతో చర్చించినట్లు చెప్పారు. గోడౌన్ల అందుబాటుపై బయ్యారం, ములకలపల్లి, కృష్ణసాగర్, దుమ్ముగూడెం, వాజేడు, వెంకటాపురం, కొత్తగూడెం, బంగారుచిలక ప్రాంతాల్లో నిల్వ సదుపాయాలు అందుబాటులో ఉన్నందున, త్వరితగతిన లోడింగ్ పూర్తి చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా రానున్న మూడు రోజుల్లో ఇల్లందు ప్రాంతంలోని మొక్కజొన్నను గోడౌన్లకు తరలించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మార్క్‌ఫెడ్, రవాణా, మార్కెటింగ్ శాఖలు సమన్వయంతో పనిచేసి కొనుగోలు, రవాణా ప్రక్రియను సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. లోడింగ్ కాంట్రాక్టర్లు అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని హెచ్చరించారు. అవసరమైతే పోలీసు శాఖ సహకారాన్ని కూడా వినియోగించుకోవాలని సూచించారు. హమాలీలు తగిన సంఖ్యలో అందుబాటులో ఉండేలా చూడాలని, ఎక్కడైనా గోడౌన్ సమస్య తలెత్తితే తాత్కాలికంగా ఫంక్షన్ హాళ్లు, పాఠశాల భవనాలు తదితర అనుకూల ప్రదేశాలను వినియోగించుకోవాలని ఆదేశించారు. ప్రతి కొనుగోలు కేంద్రానికి ప్రత్యేక అధికారిని నియమించి, ఆయా అధికారులు క్షేత్రస్థాయిలో ప్రత్యక్ష పర్యవేక్షణ చేపట్టాలని తెలిపారు. ప్రతిరోజూ కొనుగోలు వివరాలను నివేదికల రూపంలో సమర్పించాలని, కొనుగోలు పూర్తైన 24 గంటల్లోపు ట్యాబ్ ఎంట్రీలు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదనపు కలెక్టర్, డీసీఎస్‌వో, డీటీవో, డీఎం సివిల్ సప్లై తదితర అధికారులు ప్రతిరోజూ కొనుగోలు, లోడింగ్, అన్‌లోడింగ్, గోడౌన్ల పరిస్థితి, హమాలీల అందుబాటు, గన్నీ బ్యాగుల సరఫరా వంటి అంశాలను నిరంతరం పర్యవేక్షిస్తూ సమస్యలు తలెత్తిన వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. వాతావరణ శాఖ హెచ్చరికలను ఎప్పటికప్పుడు రైతులకు చేరవేసేలా చర్యలు తీసుకోవాలని, ఏవైనా సమస్యలు తలెత్తితే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. ప్రతి అధికారి క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసే దిశగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు.




# నాణ్యమైన విద్యుత్తును అందించడమే లక్ష్యం

ఎన్పీడీసీఎల్ సీఎండి కర్నాటి వరుణ్ రెడ్డి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ములుగు, మే 12 : వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్తును అందించడమే లక్ష్యంగా విద్యుత్ శాఖ పనిచేస్తుందని తెలంగాణ నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం ములుగు జిల్లాలో పలు విద్యుత్ అభివృద్ధి పనులను పరిశీలించారు. ములుగులో కొత్తగా నిర్మిస్తున్న డిపార్ట్‌మెం టల్ ఎస్పీఎం షెడ్ పనులను పరిశీలించి జూన్ నెలాఖరు నాటికి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సీఎండి అధికారులను ఆదేశించారు.అనంతరం ప్రైవేట్ ఎస్పీఎం షెడ్ ను సందర్శించి, ఫెయిల్యూర్ ట్రాన్స్‌ఫార్మర్ల రికార్డులు,నిర్వహణ విధానం, పనితీరును పరిశీలించారు. ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుల ప్రక్రియను మరింత వేగవంతం చేసి రోలింగ్ స్టాక్ పెంచుకోవాలని సూచించారు.అనంతరం 33 కెవి కొత్త లైన్ పనులను సీఎండీ పరిశీలించారు.ఈ సందర్భంగా సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి మాట్లాడుతూ 33/11 కెవి లింగాలనూతన సబ్ స్టేషన్ ఏర్పాటుతో గుండాల,కొడిశెల లింగాల పరిసర గ్రామాలకు విద్యుత్ సరఫరా మరింత మెరుగ్గా అందుతుందని తెలిపారు.గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ నాణ్యత మెరుగుపడటంతో పాటు అంతరాయాలు తగ్గుతాయని పేర్కొన్నారు. లో వోల్టేజ్ సమస్య ఉండదని వివరించారు. వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు అభివృద్ధి పనులను సమయానికి పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సి.ఈ రాజు చౌహాన్, ఎస్ఈ బేతి బిక్షపతి, డీఈ ఆపరేషన్ నాగేశ్వర్ రావు, డీఈ పురుషోత్తం, డీఈ సదానందం, ఈఈ సివిల్ వెంకట్రాం,ఏ.డి.ఈ సివిల్ ప్రణయ్, సందీప్ పాటిల్, ఏడిఈలు రాజేష్,వేణు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.




# జగిత్యాల ఐఎంఏ సేవలు అభినందనీయం

- ఎమ్మెల్యే సంజయ్ కుమార్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జగిత్యాల, మే 12 : జగిత్యాల ఐఎంఏ సేవలు అభినందనీయమని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అన్నారు. మంగళవారం జగిత్యాల పట్టణ ఐఎంఏ భవన్ లో మెడ్ వేవ్ క్యాన్సర్ హాస్పిటల్ కరీంనగర్, జగిత్యాల వారి ఆధ్వర్యం ఉచిత క్యాన్సర్ నిర్ధారణ క్యాంప్ ను జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..జగిత్యాల ప్రారంభించారు. ముందస్తు జాగ్రత్తల ద్వారా,ముందస్తు పరీక్షల ద్వారా క్యాన్సర్ నివారణ సాధ్యం అని పేర్కొన్నారు. జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో క్యాన్సర్ వ్యాధిగ్రస్తుల కోసం పాలియేటివ్ కేర్ యూనిట్ ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. సేవా ద్వారానే సమాజంలో గుర్తింపు లభిస్తుందన్నారు. 09 నుండి 18 ఏళ్ల మధ్య అమ్మాయిలకు హెచ్ పీవీ వ్యాక్సిన్ వేయించడం ద్వారా సర్వైకర్ క్యాన్సర్ నివారించవచ్చన్నారు. పచ్చకామెర్లకు కూడా వ్యాక్సిన్ ఉంది అని ప్రజలు ఉపయోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎం హెచ్వో శ్రీనివాస్, ఐఎంఏ అధ్యక్షులు డా. హేమంత్, ప్రధాన కార్యదర్శి డా.శ్రీనివాస్, కోశాధికారి డా.సుధీర్, డా.మోహన్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం, కో ఆప్షన్ సభ్యులు గట్టు సతీష్, నాయకులు క్యాదసు నాగయ్య, కౌన్సిలర్ దుమాల రాజ్ కుమార్, డా.కౌశిక్, డా.హారిక, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నర్సుల సేవలు వెలకట్టలేనివి

- మణుగూరు ఏరియా టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి వెంకటేశ్వర్లు
- అంతర్జాతీయ నర్స్ డే సందర్భంగా సింగరేణి ఆసుపత్రి నర్సులకు ఘన సన్మానం



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మణుగూరు, మే 12 : ప్రాణాలను కాపాడుతూ సేవాభావంతో సమాజానికి అండగా నిలిచే నర్సుల సేవలు వెలకట్టలేనివని మణుగూరు ఏరియా టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి వెంకటేశ్వర్లు అన్నారు. అంతర్జాతీయ నర్స్ డే సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు సింగరేణి ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న నర్సులను మంగళవారం ఘనంగా సన్మానించి వారి సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా సుమారు 20 మంది నర్సులకు శాలువాలు కప్పి, పూల మొక్కలు, మిఠాయి పొట్లాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాట్లాడిన నాగెల్లి వెంకటేశ్వర్లు, సింగరేణి కార్మికులు మరియు వారి కుటుంబ సభ్యులకు వైద్య సేవలు అందించడంలో నర్సుల పాత్ర మరువలేనిదని పేర్కొన్నారు. ఏరియాకు నిర్దేశించిన ఉత్పత్తి, ఉత్పాదకత లక్ష్యాల సాధనలో రేయింబవళ్లు శ్రమిస్తున్న కార్మికులకు ఆరోగ్య పరిరక్షణలో నర్సులు కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్నారని తెలిపారు. నైటింగేల్ జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రతి ఏడాది అంతర్జాతీయ నర్స్ డేగా నిర్వహిస్తున్నట్లు పేర్కొంటూ, రోగులకు అంకితభావంతో సేవలందించే నర్సులను ఈ సందర్భంగా సత్కరించడం స్ఫూర్తిదాయకమని అన్నారు. ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ మార్గదర్శకత్వం, హాస్పిటల్ డీవైసీఎంఓ జ్యోతిర్మయి పర్యవేక్షణలో ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని తెలిపారు. గనుల్లో పనిచేసే కార్మికులు అనారోగ్యానికి గురైనప్పుడు లేదా ప్రమాదాలు జరిగిన సందర్భాల్లో నర్సులు అత్యంత అప్రమత్తంగా సేవలందిస్తూ ప్రాణాలను కాపాడుతున్నారని కొనియాడారు. కార్మికుల కుటుంబ సభ్యులకు కూడా అత్యవసర వైద్య సహాయం, మందుల పంపిణీ, ఆరోగ్య సూచనలు అందిస్తూ నర్సులు విశేష సేవ చేస్తున్నారని తెలిపారు. పగలు, రాత్రి తేడా లేకుండా ఆసుపత్రుల్లో విధులు నిర్వర్తిస్తూ రోగులకు ధైర్యం చెప్పడం, వైద్యులకు సహకరించడం వంటి బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తున్న నర్సుల సేవలు సమాజానికి ఆదర్శమని అభినందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బంగారి పవన్ కుమార్, మునిగేల నాగేశ్వరరావు, సుద్దాల సంపత్ కుమార్, మస్తాన్, ప్రవీణ్ కుమార్, ఇమ్రాన్ ఖాన్, కళ్యాణ్ కుమార్, మొగిలి రాజయ్య, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల భవిష్యత్తుకు మార్గదర్శి ప్రయోగశాలలు

ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



రామగుండం, మే 12 : విద్యార్థుల భవిష్యత్తుకు ప్రధానిక ప్రయోగశాలలు మార్గదర్శకంగా ఉంటాయని అవి ఎంతగానో ఉపయోగపడతాయని రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్ రాజ్ ఠాకూర్ అన్నారు మంగళవారం రామగుండం పట్టణ జడ్పిహెచ్ఎస్ పాఠశా లలో 1 కోటి 50 లక్షల వ్యయంతో నిర్మించిన ఆధునిక హై స్కూల్ ప్రయోగశాల భవనాన్ని ప్రారంభించి మాట్లాడారు ప్రభుత్వ పాఠశాలల్లోనూ ప్రైవేటు స్థాయి విద్య స్థాయిలో సదుపా యాలు కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజ్ ఠాకూర్ అన్నారు విద్యార్థులు శాస్త్రీయ దృక్పథంతో ముందుకు సాగాలని ఈ ప్రయోగశాలలు ఎంతగానో దోహద పడతాయని అన్నారు రాబోయే రోజుల్లో పాఠశాల అభివృద్ధికి మరిన్ని నిధులు తీసుకువచ్చి విద్యార్థులకు అవసరమైన మెరుగైన వసతులు కల్పిస్తామని అన్నారు

ప్రజాలక్ష్యం
సంపాదకీయం

## ఖర్చులు తగ్గింపు... మోడీ నుంచే మొదలవ్వాలి !

మంచో చెడో... ప్రధాని మోడీ చేసిన ఓ సూచన ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఇంకా మారాల్సి ఉంది. దీనిపై పైనుంచి కింది వరకు చర్చించాలి. అదేంటంటే ఖర్చులు తగ్గించాలి. బంగారం కొనగూడదు.. ఇంధనం తగ్గించుకుని వాహనాలను మూలన పెట్టాలి. లేదా తక్కువ మోతాదులో ఇంధనం వాడుకోవాలి. దేశహితం కోసం ఇది మంచిదే. అయితే ఎవరు ఖర్చులు తగ్గించాలన్నదే ముఖ్యం. దేశ అర్థిక వ్యవస్థ బలోపేతం కావడానికి ముందుగా ఖర్చుల జాబితాను రూపొందించి తగ్గించాలి. ప్రధాని మొదలు, ఎమ్మెల్యేల వరకు ఖర్చులు తగ్గించే ప్రయత్నం నేటినుంచే మొదలు పెడితే మంచిది. ఇందులో ప్రధానంగా రాజకీయ నాయకలు నుంచి తగ్గింపు మొదలైతే దేశం దరిద్రం పోతుంది. ముందుగా వారి జీతభత్యాల్లో కోత పెట్టాలి. వేలకోట్లు జీతభత్యాలు, విమాన ఖర్చులు, కార్లు, కాన్వాయ్‌ల ఖర్చులు వెంటనే కోత విధించాలి. ప్రధాని పిలుపు మేరకు దేశ ప్రజలు ఇంధన వినియోగం, బంగారం కొనుగోళ్లు, వంట నూనెల వినియోగం 10 శాతం తగ్గించుకుని, ఎరువుల దిగుమతు లను 50శాతం మేర తగ్గించి, అనవసర విదేశీ పర్యటనలను మానుకుంటే.. ఏడాదిలో 4500 కోట్ల డాలర్ల మేర విదేశీ మారక ద్రవ్య నిల్వలను ఆదా చేయొచ్చని ఒక అంచనా. అంటే మన కరెన్సీలో దాదాపుగా రూ.4.3 లక్షల కోట్లు అన్న మాట. ఇది మంచి సలహా గనక ఎవరు తగ్గించు కోవాలన్న చర్చ మొదలు పెట్టాలి. అందుకే రాజకీయంగా అవుతున్న దుబారాను ముందుగా తగ్గించాలి. ఈ ఖర్చులు తగ్గితే విదేశీ మారకం నిల్వాలు పెరుగుతాయి. దేశ జిడిపి పెరుగుతుంది. ప్రజలకు నిత్యావసర వస్తువులు సరసమైన ధరలకు దక్కుతాయి. రాజకీయ నాయకులు జీతభత్యాలు, కార్లు, విమానాలు, హెలికాప్టర్ల ఖర్చులు, అనవసరంగా విదేశీ టూర్లు, ఉచిత పథకాలు వంటివన్నింటిపైనా బ్యాన్ విధించాలి. ముందుగా ప్రధాని మోడీ టూర్లు తగ్గాలి. సిఎంల ప్రమాణాలకు సిఎంలను, కేంద్రమంత్రులను పిలవడం వల్ల ఎంత ఖర్చయ్యిందో లెక్కలు చెప్పాలి. అట్టహాసపు ప్రమాణ స్వీకారాల ఖర్చును దేశంపై రుద్దడం ఎంతవరకు సమంజ సమో ఆలోచించాలి. చంద్రబాబు లాంటి వారు హెలికాప్టర్లు వేసుకుని పెన్షన్లు పంచడానికి వెళ్లడాన్ని నిషేధించాలి. అనవ సర ఖర్చులతో రాష్ట్ర ఖజనాలను గుల్లచేసిన వారినుంచి ఆ మొత్తాలను రాబట్టాలి. ఇందుకోసం ఎంతటి కఠిన నిర్ణయ మైనా తీసుకున్నా ఫర్వాలేదు. దేశ ఆర్థిక వ్యవస్థ బాగా ఉందంటే...అందుకు విదేశీ మారక నిల్వల మొత్తమే రుజువు. విదేశీ మారక ద్రవ్య నిల్వలు అత్యంత కీలక పాత్ర పోషిస్తా యి. ఒక దేశం ఎంత ధనికమైనది, ఎంత సురక్షితమైనది అని చెప్పడానికి ఈ ఫారెక్స్ రిజర్వులు కొలమానం లాంటివి. ఇవి తగ్గుతాయంటే మనం దిగుమతులను తగ్గించాలి. మన వ్యవసాయ ఉత్పత్తులను విదేశాలకు అమ్ముకోవాలి. ఇక్కడ రైతులు ధాన్యం కొనుగోళు లేక దిగాలు పడుతున్నారు. అందువల్ల దేశీయంగా ఉత్పత్తి అయిన వస్తువులను వాడుదాం. అప్పుడు కూడా భారీగా ఖర్చులు తగ్గుతాయి. మోడీ ఇచ్చిన సలహాలను పాజిటివ్‌గా తీసుకుంటే మంచిదే. అయితే ఇది రాజకీయ నాయకులకు మాత్రమే హెచ్చరిక కావాలి. వారే తమ ఇంటి నుంచి సంస్కరణలు ప్రారంభిం చాలి. ఇకపోతే ప్రధాని మోదీ తన ప్రసంగంలో బంగారం గురించి ప్రత్యేకంగా ప్రస్తావించడానికి కారణం ఏంటంటే.. భారతీయులు ఏడాదికి సగటున కొనే పసిడి దాదాపు 700- 900 టన్నులని అంచనా! దీని విలువ సుమారు రూ.13.69 లక్షల కోట్లు. 2024-25తో పోలిస్తే.. 2025-26లో మన బంగారం దిగుమతులు దాదాపు 24శాతం పెరిగాయి. భారతీయులు కొనే బంగారంలో 90 శాతానికి పైగా విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నదే. అందుకు మనం భారీగా విదేశీ మారక ద్రవ్యాన్ని ఖర్చు చేయాల్సి వస్తోంది. కాబట్టి మోదీ చెప్పినట్లు ఏడాది పాటు బంగారం కొనకుండా ఉంటే కచ్చితంగా మన విదేశీ మారక ద్రవ్య నిల్వలపై భారం కాస్తంతైనా తగ్గుతుంది. ఇందులో ఉన్నత వర్గాల వారి కొనుగోళ్లే ఎక్కువని గుర్తించాలి. ఉన్నత వర్గాల వారు సైతం బంగారం కొనుగోళ్లు చేపట్టకుండా చూడాలి. బంగారం దిగుముతలపై ఆంక్షలు విధించాలి. దీంతో దేశీయంగా ఇళ్లల్లో మూలుగుతున్న బంగారన్ని బయటకు తీసి ఆదాయ వనరుగా మార్చాలి. ఇవన్నీ చేయగలుగుతామని చెప్పాలి. ఇకపోతే ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్రంలో బీజేపీ అధికార పగ్గాలు చేపట్టినప్పుడు, సామాన్యుడు తన కష్టాలన్నీ తీరిపోతాయని, భవిష్యత్తు బంగారం అవుతుందని కలలుగన్నాడు. కానీ కలలు కల్లలు అయ్యాయి. వస్తూత్పత్తి పెరిగింది. దాన్యం దిగుబడులు పెరిగాయి. కానీ ధరలు అమాంతంగా అంతకు రెట్టింపు అయ్యాయి. విద్యవైద్యం ఖరీదైన వస్తువుగా మారింది. అందుకే ప్రధాని మోడీ మాటల ను సానుకూలంగా తీసుకుని నిజాన్ని మాట్లాడుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. అచ్చే దిన్ అన్న మోడీ మంచి రోజులు నిజంగా సామాన్యుడి ముంగిట నిలిచాయా అన్నది కూడా చర్చించాలి. కానీ నినాదాల హోరులో నిజాలు సమాధి అయ్యాయి. ప్రభుత్వ ప్రకటనలు చూస్తుంటే భారతదేశం వెలిగిపోతున్నట్లు కనిపిస్తున్నది. కానీ సామాన్యుల బతుకులు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారింది. ప్రపంచంలోనే 5వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ, డిజిటల్ ఇండియా విప్లవం, మేక్ ఇన్ ఇండియా అంటూ భారీ నినాదలు బయలుదేరాయి. కానీ రాజకీయ నాయకులు బలపడుతు న్నారు. ప్రజలు బలహీన పడుతున్నారు. రాజకీయ నాయకు లకు ఊడిగం చేసే దౌర్భాగ్యం పెరుగుతోంది. ఒక దేశంగా మనం ఎంత గర్వంగా తలెత్తుకుంటున్నామో, అదే స్థాయిలో అప్పుల భారంతో తల దించుకోవాల్సిన పరిస్థితి కనిపిస్తున్నది. అందుకే ఖర్చులు తగ్గించుకోవడం అవసరమే. అది రాజకీయ నాయకలు నుంచి మొదలు కావాలి. మోడీ ఒక నిర్ణయం తీసుకుని పార్లమెంటులో చట్టం చేయాలి. రాజకీయ నాయకుల జీతభత్యాలు, పెన్షన్లు ఎత్తేయాలి. విదేశీ టూర్లు, విమాన ఖర్చులపై ఆంక్షలు విధించాలి. ఉచిత పథకాలను ఎత్తేయాలి. అప్పుడే దేశం బాగుపడుతుంది. మోడీ కోరుకున్న ఖర్చుల తగ్గింపు ఆలోచన కార్యరూపం దాలుస్తుంది.

# మలేరియా వ్యాధి పట్ల అవగాహన అవసరం

## మే 13... సర్ రోనాల్డ్ రాస్ జయంతి



రామకిష్టయ్య సంగన భట్ల
9440595494

ప్రాణాంతక వ్యాధి మలేరియా పట్ల ప్రజలలో అవగాహన పెంచడం, చికిత్స చేయడం, నివారించడం గురించి ప్రజలకు అవగాహన కలిగించడం అత్యవస రం. మలేరియా అనే పేరు "మలఅరి య" అనే ఇటాలియను పదాల నుండి పుట్టింది. "మల అరియ" అంటే చెడిపో యిన గాలి అని అర్థం. చిత్తడి నేల ఉన్న చోట్ల మలేరియా అధికంగా ఉండటం వలన ఈ జ్వరాన్ని చిత్తడి జ్వరం అని కూడా పిలిచేవారు.




సర్ రోనాల్డ్ రాస్ (13 మే,1857- 16 సెప్టెంబర్, 1932) బ్రిటిష్ వైద్యుడు, శాస్త్రవేత్త. ఆయనకు మలేరియా పారసైట్ జీవిత చక్రానికి చెందిన పరిశోధనకు 1902లో వైద్య శాస్త్రంలో నోబెల్ బహుమతి ప్రదానం చేయబడింది. 1897లో ఒక దోమ యొక్క జీర్ణశ యాంతర ప్రేగులలో మలేరియా పరాన్నజీవిని ఆయన కనుగొన్నప్పుడు మలేరియా దోమల ద్వారా వ్యాపిస్తుందని ఋజువు చేసింది. ఈ వ్యాధిని ఎదుర్కొనే పద్ధతికి పునాది వేసింది. భారతీయ వైద్య సేవలో 1881లో ప్రవేశించి 25 సంవత్సరాలు పని చేశాడు. తన సేవలోనే అతను సంచలనాత్మక వైద్య ఆవిష్కరణ చేశాడు.

1895 మార్చి 20న ఆయన లండన్ నుండి బయలుదేరి, ఏప్రిల్ 24న సికింద్రాబాదు చేరాడు. కస్టమ్ ఆఫీసులో తన సామాను క్లియర్ కావడానికి ముందే, అతను నేరుగా బొంబాయి సివిల్ హాస్పిటల్ కి వెళ్లి, మలేరియా రోగుల కోసం వెతుకు తూ రక్త నమూనాలు సేకరిం చడం ప్రారంభించాడు. రాస్ మే 1895 లో దోమల కడుపు లోపల మలేరియా పరాన్నజీవి ప్రారంభ దశలను గమనించి నప్పుడు తన పరిశోధ నలో మొదటి ముఖ్యమైన అడుగు వేశాడు. 1896 జూన్‌లో ఆయనను సికింద్రాబాద్‌కు బదిలీ చేశారు. రెండు సంవత్సరాల పరిశోధన వైఫల్యం తరువాత, జూలై 1897 లో అతను సేకరించిన లార్వా నుండి 20 వయోజన "గోధుమ" దోమలను సంవర్థనం చేయ గలిగాడు. మలేరియా పరాన్నజీవి జీవిత చక్రాన్ని సర్ రోనాల్డ్ రాస్ అనే శాస్త్రవేత్త సికింద్రాబాదు నగరంలో పరిశోధన చేస్తున్నప్పుడు 1897 ఆగస్టు 20న కనుగొన్నారు. తద్వారా ఆయనకు 1902లో నోబెల్ బహుమతి లభించింది. రోనాల్డ్‌రాస్.. మలేరియా పరాన్న జీవికి ప్లాస్మోడియం అని పేరు పెట్టారు. రొనాల్డ్ రాస్ భారతదేశం లోని ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని అల్మోరాలో జన్మించాడు. ప్రస్తుతం "మినిస్టర్స్ రోడ్"గా పిలిచే రహదారిని 2000 సంవత్సరం వరకు "సర్ రోనాల్డ్ రాస్ రోడ్" అనేవారు.

మలేరియా ప్లాస్మోడియం అనే పరాన్నజీవి వలన కలుగుతుంది. మనుషుల్లో ఆడ అనోఫిలస్ దోమ ద్వారా ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుంది. పరాన్నజీవిని కలిగివున్న దోమ మనుషులను కరిచినపుడు అవి మనుషులతో చేరి వారి కాలేయం లో విభజన చెంది తదనంతరం ఎర్ర రక్తకణాలను నాశనం చేస్తాయి. ప్రపంచంలో ఏటా 500 మిలియన్ల జనాభా మలేరియా జ్వరాల బారిన పడి వారిలో 2.7 మిలియన్ల మంది మరణిస్తున్నట్లు సర్వేలు వెల్లడిస్తు న్నాయి. ప్లాస్మోడియం" అనే ప్రొటోజోవా పరాన్నజీవి మలేరియా వ్యాధి కారకము. ప్రోటోజోవాలు ఏకకణ జీవులు. వీటి నిర్మాణము బ్యాక్టీరియా కంటే క్లిష్టమైనది. బ్యాక్టీరియా చాలా సులువయిన నిర్మాణము కలిగి ఉంటాయి. వివిధ ప్లాస్మోడియం స్పీసీస్లు మనుష లలో వివిధ రకాల మలేరియాలను కలుగజేస్తాయి. అందులో ... ప్లాస్మోడియం ఫాల్సిపారం, ప్లాస్మోడియం వైవాక్స్, ప్లాస్మోడియం మలేరియై, ప్లాస్మోడియం ఒవేల్, ప్లాస్మోడియం సెమీ ఒవేల్, ప్లాస్మోడియం నోవెస్లి ముఖ్య మైనవి. దోమ మనుషులను కరిచినపుడు అవి మనుషులతో చేరి వారి కాలేయంలో విభజన చెంది తదనం తరం ఎర్ర రక్తకణాలను నాశనం చేస్తాయి. ఎర్ర రక్తకణాలలో చేరిన 48 నుండి 72 గంటలలో ఈ పరాన్నజీవులు విభజన చెంది చిట్లిపోతాయి. దీనివలన ఫ్లూ, వణుకుతో కూడిన జ్వరం, అసాధారణ రక్తస్రావం, దీర్ఘ శ్వాస, రక్తలేమి చిహ్నాలు మరియు స్పృహ కోల్పోవడం జరుగుతుంది.

చలి జ్వరం, తలనొప్పి, కండరాల నొప్పి, ఛాతిలో నొప్పిగా ఉండటం, దగ్గు, చెమటలు పట్టడం, వాంతు లు, విరేచనాలు, నీరసంగా ఉండటం, ఆయాసం మొదలైనవి మలేరియా లక్షణాలు. ప్రారంభ దశలోనే ఈ వ్యాధిని గుర్తించడం వల్ల మెరుగైన చికిత్స అందించవచ్చు. దోమకాటుకు గురైన ఏడు నుంచి 18 రోజుల మధ్య ఈ లక్షణాలు కనిపిస్తాయి. రక్త నమూనాలను సేకరించి మైక్రోస్కో పిక్ ల్యాబోరేటరీ టెస్టులు లేదా ఆర్డీటీ టెస్టుల ద్వారా మలేరియా వ్యాధిని నిర్ధారిస్తారు.

1946నుండి మలేరియా అదుపు చేయడానికి డిడిటి వినియోగం మొదలయ్యింది. 1953లో 7 కోట్ల పైగా ప్రజలు మలేరియా బారిన పడ్డారు. 8 లక్షల వరకు మరణాలు అందువలన సంభవించాయి. అప్పుడు 1958లో జాతీయ మలేరియా నిర్మూలన కార్యక్రమం ప్రారంభించారు. డాక్టర్లు రక్తపరీక్ష చేసి మలేరియా అని నిర్ధారిస్తారు. వ్యాధిగ్రస్తుని నుండి సేకరించిన రక్తం బొట్టును ఒక సన్నటి గాజు పలకపై ఉంచి, దానిపై గీంసా ద్రావకం వేస్తారు. దీనివలన డాక్టర్లు సూక్ష్మదర్శిని (మైక్రోస్కోపు) కింద మలేరియా జీవులను చూడ గలుగుతారు.




మలేరియా బారిన పడిన తర్వాత చికిత్స తీసుకోవడం కంటే.. వ్యాధి సోకకుండా జాగ్రత్త వహించడం మేలు. దోమలు ఉండకుండా చూసుకోవాలి. ఇందుకోసం పరిసరాలను పరిశుభ్రంగా, పొడిగా ఉంచుకోవాలి. మస్కిటో రిపెల్లెంట్స్ క్రీములు, స్ప్రేలు వాడటం ఉపకరిస్తుంది. ఘాటైన వాసనలను వెదజల్లే మొక్కలు, పుష్పాలను దోమలు ఇష్టపడవు. కాబట్టి బంతి రోస్‌మేరీ, పుదీనా మొక్కలను ఇంటి పరిసరాల్లో పెంచడం వల్ల దోమలు రాకుండా ఉంటాయి. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకో వడం, ఎక్కువగా ద్రవాహారం తీసుకోవడం ముఖ్యం. తద్వారా రోగ నిరోధక వ్యవస్థ బలోపేతమై, రోగాల బారిన పడకుండా ఉంటాం. వీధుల్లో అమ్మే అపరిశుభ్ర ఆహారం తీసుకోవడం మానేయాలి.

అధిక ప్రొటీన్లు ఉన్న పాలు పెరుగు, మజ్జిగ మలేరియా వ్యాధి ఉన్న వారు కణజాలాన్ని అధికంగా కోల్పోవడం వలన మలేరియా ఉన్నవారు తమ ఆహార ప్రణాళిక లో ప్రొటీన్లను చేర్చుకోవాలి. అధిక ప్రొటీన్ మరియు అధిక చెక్కెరలు ఉన్న ఆహార పదార్థాలు కణజాల నిర్మాణానికి దోహద పడతాయి. అధిక ప్రొటీన్లు ఉన్న పాలు, పెరుగు, మజ్జిగ, చేపలు, లస్సీ, చికెన్ సూప్, గుడ్లు మొదలైనవి తీసుకోవాలి.

ఎలాక్ట్రోలైట్స్ మరియు నీటిని కోల్పోవడం మలేరియా వ్యాధి ఉన్నవారిలో సర్వ సామాన్యం. కనుక పండ్ల రసాలు, సూపులు, గంజి, కొబ్బరి నీరు, పప్పు నీరు మొదలైనవి తీసుకోవడం శ్రేయస్కరం. బీట్ రూట్, క్యారెట్, బొప్పాయి, నిమ్మ జాతి పండ్ల విటమిన్ ఎ, విటమిన్ సి సమృద్ధిగా కలిగిన బీట్ రూట్, క్యారెట్, బొప్పాయి, నిమ్మ జాతి పండ్లయిన నారింజ, బత్తాయి, ద్రాక్ష, అనాసపనస, నిమ్మ మొదలైన ఆహార పదార్థాలతో పాటు బి- కాంప్లెక్స్ విటమిన్లు తీసుకుంటే వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది.

**- వ్యాసకర్త : సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్.**

# తమిళ సిఎం విజయ్ సంచలన నిర్ణయం



**- బడులు, గుడులు,బస్టాండ్ల వద్ద వైన్ షాప్‌ల ఎత్తివేత**
**- రెండువారాల్లోగా మూసేయాలంటూ ఆదేశాలు**
**- విజయ్ సోషల్ మీడియాకు పెరుగుతున్న ఆదరణ**

(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)

చెన్నై, మే 12 : తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యాసంస్థలు, దేవాలయాలు, బస్‌స్టాండ్స్‌కి 500 మీటర్ల దూరంలో ఉన్న 717 వైన్ షాపులన్నింటినీ క్లోజ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. తమిళనాడు రాష్ట్ర మార్కెటింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ దుకాణాలను రెండు వారాల్లోగా మూసివేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తరువాత విజయ్ జారీ చేసిన తొలి ఉత్తర్వు ఇది. ప్రస్తుతం తమిళనాడు రాష్ట్రంలో టాస్మాక్ 4,765 మద్యం దుకాణాలను నిర్వహిస్తోంది. వీటిలో 276 మద్యం దుకాణాలు ప్రార్థనా స్థలాల సమీపంలో, 186 విద్యా సంస్థల సమీపంలో, 255 బస్ స్టాండ్‌ల సమీపంలో ఉన్నాయి. వీటిని వెంటనే తొలగించాలని సీఎం ఆదేశించారు. కాగా మద్యం అమ్మకాల ద్వారానే రాష్ట్రానికి భారీగా ఆదాయం సమకూరుతోంది. అయినప్పటికీ.. ప్రజా సంక్షేమం దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తమిళనాడు ప్రభుత్వం వెల్లడించింది. 2025 సంవత్సరంలో మద్యం అమ్మకాల ద్వారా రాష్ట్రానికి రూ.48,000 కోట్ల ఆదాయం వచ్చినట్లు ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. ఇకపోతే తమిళనాట దళపతి విజయ్ ఫ్యాన్ ఫాలోయింగ్ ఎలా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. వయసుతో సంబంధం లేకుండా అన్ని వర్గాల్లో ఆయనను అభిమానించే వారు ఉన్నారు. 2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే పార్టీ ఏకంగా 108 స్థానాల్లో విజయం సాధించింది. రెండు రోజుల క్రితం విజయ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి ముఖ్యమంత్రి హోదాలో అసెంబ్లీకి వెళ్లారు. అసెంబ్లీలో ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేశారు. విజయ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టగానే తమిళనాడు సీఎంఓ ఆఫీస్ సోషల్ మీడియా ఖాతాల డీపీలు మారాయి. ముఖ్యమంత్రి విజయ్ ఫొటోలను డీపీలుగా పెట్టారు. విజయ్ ఫొటో డీపీగా పెట్టిన గంటల్లోనే మ్యాజిక్ జరిగింది. సోషల్ మీడియా ఖాతాలకు ఫాలోవర్స్ క్యూ కట్టారు. తమిళనాడు సీఎంఓ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాకు మొదట 4 లక్షల ఫాలోవర్స్ ఉండేవారు. విజయ్ ఫొటో పెట్టిన తర్వాత 16 లక్షలకు ఫాలోవర్స్ సంఖ్య పెరిగింది. ఇక ఎక్స్ ఖాతాకు కూడా 4 లక్షల మంది ఫాలోవర్స్ ఉండేవారు. ఇప్పుడు 22 లక్షల మంది అయ్యారు. అందుకే ఆయన తీసుకునే నిర్ణయాలకు ప్రజలు జై కొడుతున్నారు.

# విదేశీ మారక నిల్వలు పెంచడం ఎలా ?

**- దిగుమతులు దెబ్బతీస్తుంటే తెలియదా? - ఎగుమతులను విస్మరించడంతోనే సమస్య**

(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)

న్యూఢిల్లీ, మే 12 : మనవిదేశా మారక నిల్వాలు పెరగాలంటే ఎగుమతులు పెరగాలి. దిగుమతలు తగ్గాలి. ఈ సూత్రాన్ని పాటించాల్సిన పాలకులు దీనిని పట్టించుకోవడం లేదు. పంటల దిగుబడి పెరుగు తున్నా వాటిని ఆదయ వనరుగా మార్చుకోవడంలో కేంద్రం విఫలం అవుతోంది. విదేశీమారక నిల్వాలు తగ్గిపోతుంటే విదేశీ పెట్టుబడిదారులు ఆ దేశంలో తాము పెట్టిన పెట్టుబడులను వెనక్కి తీసేసుకుంటారు. సాధారణంగా 7-10 నెలలపాటు ముడిచమురు దిగుమతులకు సరిపడా విదేశీ మారక ద్రవ్య నిల్వాలు ఉంటే ఆ దేశ పరపతి బాగున్నట్టుగా అంచనా వేస్తారు. 1991లో మన దేశం వద్ద కేవలం 2 వారాలకు సరిపడా మాత్రమే విదేశీ మారక ద్రవ్య నిల్వాలున్నాయి. అందుకే మన బంగారాన్ని లండన్‌కి పంపి తాకట్టు పెట్టాల్సిన పరిస్థితి వచ్చింది. ఆనాటి చంద్రశేఖర్ ప్రభుత్వం బంగారం తాకట్టు పెట్టింది. పివి నరసింహారావు ప్రధాని అయ్యాక ఆర్థిక సంస్కరణలు చేపట్టడంతో దేశం దారికి వచ్చింది. తాకట్టు పెట్టిన బంగారాన్ని వడిపంచుకోగలిగాం. దీంతో మళ్లీ మనదేశ ఆర్థిక వ్యవస్థ గాడిన పడిందంటే ఆ మహానుభావుడి చొరవే కారణం. ఇప్పుడు మోడీ కూడా అలాంటి చొరవ లేదా సంస్కరణలకు దిగాలి. మూడీస్, ఎస్ అండ్ పి, ఫిచ్ వంటి అంతర్జాతీయ సంస్థలు.. ఫారెక్స్ రిజర్వ్ ఎక్కువగా ఉన్న దేశాలకు మంచి రేటింగ్ ఇస్తాయి. ఆ రేటింగ్ ఎంత ఎక్కువ ఉంటే అంత తక్కువ వడ్డీకి అప్పులు లభిస్తాయి. ఒక దేశం విదేశాల నుంచి అప్పు తీసుకోవాలనుకుంటే.. ఆయా దేశాలు సదరు దేశం వద్ద విదేశీ మారక ద్రవ్య నిల్వాలు ఎంత ఉన్నాయనే విషయాన్నే చూస్తాయి. ఇప్పుడు మన వద్ద విదేశీ మారక ద్రవ్య నిల్వాలు దాదాపు 9 నుంచి 11 నెలలకు సరిపడా ఉన్నప్పటికీ.. పరిస్థితులు మన చేతుల్లో లేవు. పశ్చిమాసియాలో యుద్ధం ఇప్పట్లో ముగిసేలాగా కనిపించట్లేదు. ముడిచమురు ధరల భారంతోపాటు.. ఎరువుల ధరలు కూడా భారీగా పెరిగిపోయే ప్రమాదం కనపడుతోంది. అంటే వాటి దిగుమతుల కోసం చేయాల్సిన ఖర్చు మరింతగా పెరిగిపోయి డాలర్ల రిజర్వు అనుకున్నదానికంటే వేగంగా కరిగిపోయే ముప్పుంది. దీనికితోడు.. మనకు వచ్చే విదేశీ మారక ద్రవ్య నిల్వల్లో ఎక్కువ భాగం గల్ఫ్ దేశాల నుంచి వచ్చేవే. అక్కడున్న భారతీయులు మనదేశంలో ఉన్న తమ కుటుంబసభ్యులకు పంపే డబ్బు కారణంగా విదేశీ మారకం భారీగా పెరిగింది.. యుద్ధం దెబ్బకు అతలాకుతలమైన గల్ఫ్ దేశాల్లో ఉంటున్న మనవాళ్లు పంపే డబ్బు తగ్గిపోతోంది. దీనికితోడు.. ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో మన ఎగుమతులకు, తద్వారా మనకు రావాల్సిన డాలర్లకు కూడా ఆటంకం కలుగుతోంది. ఒకవైపు మనకు రావాల్సిన విదేశీ మారక ద్రవ్యంలో కోత పడుతుండగా, మరోవైపు మన వద్ద ఉన్న నిల్వాలు కరిగిపోతున్నాయి. 2025-26 బడ్జెట్ అంచనాల ప్రకారం, దేశ జాతీయ రుణం అక్షరాలా రూ.235.4 లక్షల కోట్లు. 2014లో కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చే నాటికి మన అప్పు కేవలం రూ.54.9 లక్షల కోట్లు మాత్రమే. అంటే, కేవలం పదేండ్ల కాలంలో దేశం చేసిన అప్పు 4.3 రెట్లు పెరిగింది. ప్రతి భారతీయుడిపై సగటున రూ.1.66 లక్షల అప్పు ఉన్నది. జీడీపీలో అప్పు నిష్పత్తి 67 శాతం నుంచి 83.9శాతానికి చేరుకున్నది. భారత్ ఇప్పుడు ప్రపంచంలోనే ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అని పాలకులు గర్వంగా చెప్తుంటారు. 3.73 ట్రిలియన్ల డాలర్ల జీడీపీతో మనం ఆ స్థానంలో ఉన్నమాట నిజమే. కానీ, ఇందులో ఒక పెద్ద మాయ ఉన్నది. ఒక దేశం ఎంత ధనవంతమైనదో చెప్పాల్సింది దాని మొత్తం ఆదాయం కాదు, ఆ దేశ పౌరుడి తలసరి ఆదాయం. దేశ ఆర్థిక శక్తిని తలసరి ఆదాయపరంగా విశ్లేషిస్తే విస్తుపోయే వాస్తవాలు కనిపిస్తాయి. ఆదాయ పంపిణీలో ఇతర అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే మనం ఇంకా ప్రాథమిక దశలోనే ఉన్నామని, సంపద కేవలం పైస్థాయిలోనే కేంద్రీకృతమై సామాన్యుడి వరకు ఆశించిన స్థాయిలో చేరటం లేదని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఒక్క అమెరికన్ సంపాదన మన దేశంలోని 30 మంది పౌరుల మొత్తం ఆదాయంతో సమానం. జనాభాపరంగా మనం పెద్ద దేశం కాబట్టి జీడీపీ పెద్దదిగా కనిపిస్తుంది. కానీ పౌరుడి జీవన ప్రమాణాల విషయానికి వస్తే ఐఎంఎఫ్ లెక్కల ప్రకారం మనం ప్రపంచంలో 136వ స్థానంలో ఉన్నాం. 2014 ఎన్నికల సమయంలో రూపాయి విలువ పడిపోతుంటే అప్పటి పాలక వర్గాన్ని బీజేపీ తీవ్రంగా విమర్శించింది. అప్పుడు డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ రూ.60. ఇప్పుడు అది రూ.94 దాటిపోయింది. పదేండ్లలో రూపాయి విలువ 40శాతం పైగా కుప్పకూలింది. రూపాయి బలహీనపడటం అంటే మనం విదేశాల నుంచి కొనే పెట్రోల్, డీజిల్, వంట నూనె ధరలు పెరగటం. ఈ భారం నేరుగా సామాన్యుడి వంటగదిపై పడుతున్నది. దేశానికి వెన్నెముక వంటి యువత ఇప్పుడు దిక్కుతోచని స్థితిలో ఉన్నది. ప్రతి ఏటా కోటిన్నర మంది ఉద్యోగ మార్కెట్‌లోకి వస్తుంటే, ప్రభుత్వం సృష్టిస్తున్న అవకాశాలు కేవలం కొన్ని లక్షలు మాత్రమే. ఆర్థిక వ్యవస్థను ప్రక్షాళన చేస్తామని చెప్పి చేపట్టిన నోట్ల రద్దు దేశాన్ని కుదిపేసింది. జీఎస్టీ అమలు ఒకే దేశం ఒక పన్ను అనేది వినటానికి బాగున్నా, దాని సంక్లిష్టమైన స్లాబ్‌లు చిన్న వ్యాపారులకు శాపంగా మారాయి. కోట్లాది చిన్న తరహా పరిశ్రమలు మూతపడ్డాయి. కేంద్రానికి, రాష్ట్రాలకు మధ్య ఆదాయ పంపిణీ గొడవలు నిత్యకృత్యమయ్యాయి. అచ్చే దిన్ అనేది కేవలం ఎన్నికల నినాదంగానే మిగిలిపోయింది.

# కొనుగోలు కేంద్రాల నుంచి మొక్కజొన్న తరలించాలి

**- మొక్కజొన్న కొనుగోలు, రవాణా, నిల్వ ప్రక్రియలు సమన్వయంతో నిర్వహించాలి**
**- నిల్వకు అదనంగా 5 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాం సిద్ధం**
**- తగినంత హమాలీలను ఏర్పాటు చేసి ప్రక్రియ వేగవంతం చేయాలి**
**- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**
**- రంగాపూర్ ఐజి గోదాంలో మొక్కజొన్న నిల్వ ఏర్పాట్లపై ప్రత్యేక పర్యవేక్షణ**
**- అప్పన్నపేట ఎస్ఆర్ఆర్ రైస్ మిల్, కన్నాల గణపతి ఇండస్ట్రీస్ పరిశీలించిన జిల్లా కలెక్టర్**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పెద్దపల్లి, మే 12 : జిల్లాలో ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసిన మొక్కజొన్న నిల్వ కోసం ప్రస్తుతం అందుబాటులో ఉన్న గోదాములకు అదనంగా పెద్దపల్లి మండలం రంగాపూర్‌లో గల ఐజి గోదాంలో 5 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యాన్ని సిద్ధం చేసినట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. మంగళవారం జిల్లా కలెక్టర్ పెద్దపల్లి మండలంలోని రంగాపూర్‌లో గల ధాన్యం గోదాములను పరిశీలించారు. అనంతరం అప్పన్నపేటలోని ఎస్ఆర్ఆర్ రైస్ మిల్‌ను తనిఖీ చేశారు. అలాగే పాలకుర్తి మండలంలోని కన్నాలలో గల గణపతి ఇండస్ట్రీస్‌ను పరిశీలించి మొక్కజొన్న నిల్వ సామర్థ్యం, అందుబాటులో ఉన్న సదుపాయాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుధవారం నుంచి పెద్దపల్లి జిల్లాలోని కొనుగోలు కేంద్రాల నుంచి రంగాపూర్ ఐజి గోదాంకు మొక్కజొన్న తరలింపు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నిల్వ ప్రక్రియలో ఎలాంటి అంతరాయం కలగకుండా తగినంత హమాలీలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మొక్కజొన్న కొనుగోలు, రవాణా, నిల్వ ప్రక్రియలను సమన్వయంతో నిర్వహించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. గోదాముల వద్ద అవసరమైన సౌకర్యాలు కల్పించి నిల్వ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఈ పర్యటనలో జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డి, పాలకుర్తి తహసీల్దార్ సునీత, డీటీసీఎస్ మహేష్, రవీందర్ తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

# జై శ్రీరామ్ నినాదాలతో మార్మోగిన సూర్యాపేట

## భక్తి పారవశ్యంలో ఘనంగా హనుమజ్జయంతి వేడుకలు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

సూర్యాపేట, మే 12 : సూర్యాపేట జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ రోడ్డులో గల శ్రీ భక్తాంజనేయ స్వామి దేవస్థానంలో మంగళవారం హనుమజ్జయంతి వేడుకలు భక్తి శ్రద్ధల మధ్య అత్యంత వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే ఆలయానికి భారీగా తరలివచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడాయి. వేద పండితులు ధరూరి రామానుజాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఉదయం 8 గంటల నుంచి భానుపురి హనుమాన్ చాలీసా భక్త బృందం, హనుమత్ దీక్ష భక్త బృందం, హనుమాన్ చాలీసా పారాయణ భక్త బృందాల ఆధ్వర్యంలో 108 పర్యాయాలు హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక సుగంధ పరిమళ ద్రవ్యాలతో అభిషేకం, నాగవల్లి దళార్చన, వెండి తమలపాకులతో అర్చన, ప్రత్యేక అలంకరణ నిర్వహించారు. నూతన పతాకావిష్కరణ కార్యక్రమం ఆలయ ప్రాంగణంలో వైభవంగా జరిగింది. ఆరగింపు, మంగళాశాసనం, తీర్థప్రసాద వినియోగంతో పాటు భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐసీసీ నాయకుడు రామ్‌రెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు పోతు భాస్కర్, సుధాకర్ పీవీసీ మేనేజింగ్ డైరెక్టర్ మీలా మహదేవ్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని శ్రీ ఆంజనేయ స్వామిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లింగమంతుల స్వామి దేవాలయం చైర్మన్ పోలబోయిన నరసయ్య యాదవ్, రాష్ట్ర బీఆర్ఎస్ నాయకుడు మొరిశెట్టి శ్రీనివాస్, కౌన్సిలర్లు ఎలిమినేటి అభినయ్, కొండపల్లి దిలీప్ రెడ్డి, గుణగంటి హేమ, తంగేళ్ల కరుణాకర్ రెడ్డి, రాచకొండ శ్రీనివాస్, దేవాలయ అధ్యక్షుడు కొత్తా ఆంజనేయులు, పాల్గొన్నారు.

# బడి ఈడుపిల్లలను పాఠశాల లో చేర్పించండి

## గిరిజన సంక్షేమ శాఖా పిఎంఆర్‌సి, ఏసిఎంఓ పూర్కా ఉద్ధవ్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆసిఫాబాద్, మే 12 : కుంరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఆసిఫాబాద్ బాలికల ఆశ్రమ పాఠశాల స్కూల్ కాంప్లెక్స్ మొవాడ్ స్కూల్ కాంప్లెక్స్ ఫరిదిలోని ఉపాధ్యాయులకు ప్రగతి ప్రణాళిక ప్రజా పాలనా విద్యా వారోత్సవాలు ఆచార్య జయశంకర్ బడి బాట కార్యక్రమం లో భాగంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కుంరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా గిరిజన సంక్షేమ శాఖా పీఎం ఆర్ సి,ఏసిఏం ఓ, పూర్కా ఉద్ధవ్ మాట్లాడుతూ ఈవిద్య సంవత్సరం లో తప్పకుండ బడి ఈడు పిల్లలు, బడి బయట పిల్లలు అందర్నీ ప్రభుత్వ ఆశ్రమ పాఠశాల ప్రభుత్వ గిరిజన ప్రాథమిక పాఠశాల లో అడ్మిషన్ చేయించాలని అదే విధంగా ప్రతి విద్యార్థి పాఠశాల లో ఉండాలి ప్రతి ఉపాధ్యాయుడు ఆ గ్రామాన్ని మ్యాపింగ్ చేసి ప్రతి ఇంటికి వెళ్లి ప్రతి విద్యార్థి కీ పాఠశాల కు వచ్చే విదంగా కార్యక్రమం విజయవంతం చేయాలనీ అంగన్వాడీ సెంటర్ కు వెళ్లి బడి ఈడు పిల్లలను నమోదు చేసుకోవాలని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన ఆంగ్ల మాద్యమంలో విద్య అందిస్తుందని ఈసందర్భంగా విద్యార్థుల కు ఉచితంగా పాఠ్యపుస్తకాలు రెండు జతలు ఏకరూప దుస్తులు అందించడం జరిగింది అని అదే విధంగా ప్రభుత్వ పాఠశాల లో సన్నబియ్యం తో భోజనం అట పాటలతో విద్యా అందించడమే కాకుండా విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి అన్ని విధాలా జాగ్రత్తలు తీసుకోవడం జరుగుతుందనిఅదే విధంగా గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఆంగ్ల మాద్యమంలో విద్యను అందించి గిరిజన విద్యార్థుల కు మంచి భవిష్యత్తును అందిస్తున్నామన్నారు. గిరిజన ప్రాథమిక పాఠశాల గిరిజన ఆశ్రమ పాఠశాల లో గిరిజన కళాశాలలో విద్యార్థుల భవిష్యత్ ఉజ్వలంగా ఉంటుందన్ని చెప్పారు. ఈ కార్యక్రమం లో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పవార్ లింబారావ్, ఎస్‌సి ఆర్‌పిలు రాథోడ్ రవీందర్, కూడ్మేత అనంత్, మొవాడ్, ఆసిఫాబాద్ స్కూల్ కాంప్లెక్స్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ కూలీల హక్కుల కోసం మహాసభలు

**- మే 18న రామన్నపేటలో భారీ బహిరంగ సభ**
**- పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలి: కొండమడుగు నర్సింహ**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

యాదాద్రి-భువనగిరి, మే 12 : తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా 3వ మహాసభల సందర్భంగా ఈ నెల 18న రామన్నపేటలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండమడుగు నర్సింహ పిలుపునిచ్చారు. వ్యవసాయ కూలీలు, ఉపాధి హామీ కార్మికులు, పేదలు, కౌలు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని సభను జయప్రదం చేయాలని కోరారు. ఈ నెల 18, 19 తేదీలలో రామన్నపేట మండల కేంద్రంలో జరగనున్న జిల్లా మహాసభల నేపథ్యంలో మంగళవారం బీబీనగర్ మండల కేంద్రంలోని కూలీవాడలో సభ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కొండమడుగు నర్సింహ మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా వ్యవసాయ కార్మిక సంఘం భూమిలేని పేదలు, వ్యవసాయ కూలీల హక్కుల కోసం నిరంతరం పోరాటాలు నిర్వహిస్తోందన్నారు. ప్రభుత్వ భూములను భూమిలేని పేదలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ అనేక ఉద్యమాలు చేపట్టి లక్షల ఎకరాల భూములను పేదలకు అందించిన చరిత్ర సంఘానికి ఉందని పేర్కొన్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం అమలులోకి రావడంలో కూడా సంఘం కీలక పాత్ర పోషించిందని తెలిపారు. ప్రస్తుతం కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని బలహీనపరిచేందుకు కుట్రలు చేస్తోందని ఆరోపిస్తూ, కూలీల ఐక్య పోరాటాలతో వాటిని తిప్పికొడతామని స్పష్టం చేశారు. గత మూడు సంవత్సరాలుగా జిల్లాలో నిర్వహించిన పోరాటాలను మహాసభల్లో సమీక్షించి, భవిష్యత్తులో పేదలు, వ్యవసాయ కార్మికుల హక్కుల కోసం చేపట్టాల్సిన ఉద్యమాలకు కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. ఈనెల 18న సాయంత్రం 5 గంటలకు రామన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించే బహిరంగ సభకు అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి. వెంకట్, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. వెంకట్రాములు, ఆవాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండి జహంగీర్, జిల్లా అధ్యక్షుడు బొల్లు యాదగిరి హాజరై ప్రసంగిస్తారని తెలిపారు. 19న జరిగే ప్రతినిధుల మహాసభలో జిల్లాలోని అన్ని మండలాల నాయకత్వం తప్పనిసరిగా పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కొలిచెలిమి ప్రసన్న, కార్యదర్శి గాడి శ్రీనివాస్, నాయకులు బండారు శ్రీరాములు, సాకలి మంజుల, కుమారి, పేరబోయిన బాల్ నర్సింహ, కొలిచెలిమి గండయ్య, సాకలి శివ, బాలరాజు, ధ్రువచంద్ర, ఈశ్వర్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో కుల వివక్ష నిర్మూలనకు కఠిన చర్యలు తీసుకోండి

**- సూరారం ఘటనలో నిందితులను వెంటనే అరెస్టు చేయాలి**
**- కలెక్టర్‌కు దళిత సంఘాల వినతి**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

యాదాద్రి-భువనగిరి, మే 12 : స్వాతంత్ర్య అమృతోత్సవాలు జరుపుకుంటున్న దేశంలో ఇంకా గ్రామాల్లో కుల వివక్ష కొనసాగడం బాధాకరమని దళిత సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో కుల వివక్షను పూర్తిగా రూపుమాపేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ దళిత బహుజన శ్రామిక యూనియన్, పార, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు సోమవారం జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఈనెల 7న రామన్నపేట మండలం సూరారం గ్రామంలో గ్రామదేవత కోట మైసమ్మ పండుగ సందర్భంగా జరిగిన దళితులపై దాడి ఘటనను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. పండుగలో దళితులను బోనాలు పెట్టకుండా అడ్డుకోవడంతో పాటు మాదిగ కులానికి చెందిన బందేల వెంకటయ్యపై దాడి చేసిన వారిపై వెంటనే కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. దళిత బహుజన శ్రామిక యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు జి. నర్సింహ మాట్లాడుతూ ఇటీవల గ్రామాల్లో జరిగే పండుగల సమయంలో దళితులపై వివక్ష, దాడులు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసు, రెవెన్యూ, పంచాయతీ అధికారులు అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రంపై స్పందించిన కలెక్టర్ అనురాగ్ జయంతి.. కుల వివక్ష నిర్మూలనకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ నెల నుంచి అన్ని మండలాల్లో తప్పనిసరిగా 'సివిల్ రైట్స్ డే' నిర్వహించేలా సర్క్యులర్ జారీ చేస్తామని తెలిపారు. ఆ సమావేశాలకు సంబంధిత అధికారుల హాజరు కూడా తప్పనిసరి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీబీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి కే. అమృత, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు దుబ్బ రామకృష్ణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటుకల దేవేందర్, డీబీఎస్‌యూ జిల్లా కార్యదర్శి, పార కోఆర్డినేటర్ సురుపంగ శివలింగం, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు స్వరూప తదితరులు పాల్గొన్నారు.



# శ్రీనివాస కాలనీలో ఓపెన్ జిమ్‌కు స్థల పరిశీలన

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కూకట్‌పల్లి, మే 12 : శేర్లింగంపల్లి నియోజకవర్గం హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని శ్రీనివాస కాలనీలో ఓపెన్ జిమ్ ఏర్పాటు కోసం మాజీ కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్, శానిటేషన్ అధికారులు, స్థానిక కాలనీ వాసులతో కలిసి స్థల పరిశీలన నిర్వహించారు. ఈ సందర్భంగా నార్నె శ్రీనివాసరావు మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్య పరిరక్షణ దృష్ట్యా కాలనీలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని నిర్ణయించామని తెలిపారు. అదేవిధంగా కాలనీలో పర్యటిస్తూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించేందుకు అధికారులకు సూచనలు ఇచ్చినట్లు చెప్పారు. ప్రజల నుండి వచ్చిన వినతులు, తమ దృష్టికి వచ్చిన సమస్యలను పరిగణనలోకి తీసుకుని అత్యవసర ప్రాంతాల్లో ప్రథమ ప్రాధాన్యతతో అభివృద్ధి పనులు చేపడతామని వెల్లడించారు. మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తూ హైదర్‌నగర్ డివిజన్‌ను ఆదర్శవంతమైన డివిజన్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ డీఈ మౌనిక, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహదేవ్, శానిటేషన్ డీఈ శంకర్ గణేష్, ఏఈ బస్విపటేల్, ఎస్ఆర్పి సత్యనారాయణ, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



# క్యాన్సర్ పట్ల భయం వీడండి..అవగాహన పొందండి

**- సేవా అధ్యక్షురాలు అనితా లలిత్ కుమార్**
**- జివిటిసిలో క్యాన్సర్ అవగాహన సదస్సు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

గోదావరిఖని టౌన్, మే 12 : సమాజంలో వేగంగా విస్తరిస్తున్న క్యాన్సర్ మహమ్మారి పట్ల ప్రజల్లో, ముఖ్యంగా మహిళల్లో అవగాహన కల్పించేందుకు ఆర్జీ-1 ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక జివిటిసిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సేవాసమితి అధ్యక్షురాలు అనితా లలిత్ కుమార్ సూచన మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఏరియా ఆసుపత్రి వైద్యులు డాక్టర్ సాహితీ రెడ్డి పాల్గొని క్యాన్సర్‌కు ఊబకాయం, మద్యపానం, ధూమపానం, మారుతున్న ఆహారపు అలవాట్లు ప్రధాన కారణాలని వివరించారు. ముఖ్యంగా మహిళల్లో కనిపించే రొమ్ము క్యాన్సర్‌పై ప్రత్యేక అవగాహన కల్పిస్తూ మహిళలు స్వయంగా తరచూ పరీక్షలు చేసుకోవాలని సూచించారు. శరీరంపై గడ్డలు ఏర్పడటం, చర్మం రంగు మారడం, అకస్మాత్తుగా బరువు తగ్గడం, తీవ్ర అలసట వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయొద్దన్నారు. క్యాన్సర్‌ను ప్రారంభ దశలో గుర్తిస్తే పూర్తిస్థాయిలో నయం చేయవచ్చని, వ్యాధిపై భయం కాకుండా అవగాహన అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో జివిటిసి మేనేజర్ మాధవరెడ్డి, మురళీకృష్ణ, లేడీస్ క్లబ్ కార్యదర్శి శిరీష, సభ్యులు అంజలి, రజిత, కల్యాణి తదితరులు పాల్గొన్నారు. మహిళా ఉద్యోగులు అధిక సంఖ్యలో హాజరై వైద్య నిపుణులతో తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.



# మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట

**- ఎమ్మెల్యే, పిఎసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

శేరిలింగంపల్లి, మే 12 : శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని వెంకటేశ్వర కాలనీ, స్ప్రింగ్ వ్యాలీ కాలనీలలో పలు అభివృద్ధి పనులకు పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ శంకుస్థాపన చేసారు. శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని వెంకటేశ్వర కాలనీ, స్ప్రింగ్ వ్యాలీ కాలనీలలో రూ. 1 కోటి 24 లక్షల రూపాయలతో నూతనంగా చేపట్టబోయే సీసీ రోడ్ల నిర్మాణం పనులకు మరియు వరద నీటి కాల్వ నిర్మాణము పనులకు సీనియర్ నాయకులు మారబోయిన రాజు యాదవ్ తో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొని శంకుస్థాపన చేసిన పీఏసీ చైర్మన్ ఈ సందర్భంగా మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజల సంక్షేమం, కాలనీల అభివృద్దే ధ్యేయంగా ప్రజల సౌకర్యార్థం వెంకటేశ్వర కాలనీ, స్ప్రింగ్ వ్యాలీ కాలనీలలో నూతనంగా చేపట్టబోయే సీసీ రోడ్ల నిర్మాణం పనులకు, వరద నీటి కాల్వ నిర్మాణము పనులకు శంకుస్థాపన చేసుకోవడం జరిగిందన్నారు. సీసీ రోడ్ల పనులకు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసుకోవడం చాలా సంతోషకరమైన విషయం అని, మౌళిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తానని తెలిపారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంను అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తామని, నియోజకవర్గం ను అగ్రభాగాన నిలబెడుతామని తెలిపారు ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు, కాలనీల అసోసియేషన్ సభ్యులు,మహిళలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# శని ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కాగజ్‌నగర్, మే 12 : కాగజ్‌నగర్ పట్టణం పోచమ్మ బస్తిలో గల శని మందిరంలో ఈనెల 16 న శనివారం అమావాస్య రావడం విశేషం. శనివారం ఉదయం నుండి ప్రత్యేకపుజలు అభిషేకాలు నిర్వహిస్తామని ఆలయ పండితులు నంద్ కిశోర్ జోషి మంగళవారం తెలిపారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కాగలరని కోరారు.





## ఆర్జీ-2 అధికారులతో సీఎంపీఎఫ్ రీజినల్ కమీషనర్ సమీక్ష

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

గోదావరిఖని టౌన్, మే 12 : సీఎంపీఎఫ్ రీజినల్ కమీషనర్ భరత్ కుమార్ ఏవై, డాక్టర్ గోవర్ధన్ కంటెపూడి మంగళవారం సింగరేణి ఆర్జీ-2 ఏరియా అధికారులతో జీఎం బండి వెంకటయ్య అధ్యక్షతన జీఎం కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పెండింగ్ లో ఉన్న పలు సీఎంపీఎఫ్ క్లైములు, కాంట్రాక్టు కార్మికుల ఆన్లైన్ వివరాలు, ప్రయాస్ లో గల షెడ్యూల్, కో -ఆర్డినేషన్, పెన్షన్ అదాలత్, రివైజ్డ్ పిపిఒ కాపీలు, ఎన్పిడబ్ల్యూ రివైజ్డ్ పెన్షన్ ల గురించి సంబంధిత అధికారులు, ఉద్యోగులతో చర్చించారు. ఇంకా ఈ సమీక్ష సమావేశంలో అధికార ప్రతినిధి (ఎజియం పర్సనల్) అరవింద్ రావు, ఎఐటియూసి బ్రాంచ్ సెక్రటరీ గంధం సాంబశివరావు, డివై పియం వంశీధర్, సీనియర్ ఎకౌంట్ ఆఫీసర్ విశాల్ కుమార్, కమలాకర్ రావు, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ షేక్ అజీజ్, మేనేజ్మెంట్ ట్రైని నరేష్, సీనియర్ అసిస్టెంట్లు కుమారస్వామి, మహమూద్, ఈపీ ఆపరేటర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



ఆసిఫాబాద్, మే 12 : జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ హనుమాన్ ఆలయంలో పెద్ద హనుమాన్ జయంతిని మంగళ వారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు శిరీష్ శర్మ ఆధ్వర్యంలో ఉదయం ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కాగజ్‌నగర్, మే 12 : పెంచికల్‌పేట మండల కేంద్రంలో హనుమాన్ జయంతి వేడుకలు మంగళవారం అత్యంత వైభవంగా జరి గాయి. మండల కేంద్రంలోని స్థానిక హనుమాన్ విగ్రహం వద్ద భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. తెలుగు హనుమాన్ జయంతిని పురస్కరించుకుని ఆలయాన్ని విద్యుత్ దీపాలు, పుష్పాలతో సుందరంగా అలంకరించారు. ఉద యం నుంచే స్వామివారికి అభిషేకాలు, అర్చనలు ప్రత్యేక హారతులు నిర్వహించారు. పూజా కార్యక్రమాలు అనంతరం భక్తులందరికీ తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. అనంతరం భక్తులకు ఏర్పాటు చేసిన ప్రసాదం పులిహోర ను భక్తులందరూ స్వీకరించారు. భక్తులు జై బోలో హనుమాన్ నామస్మరణతో పెంచికల్‌పేట పురవీధులు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. ఈ కార్యక్రమంలో మండల ప్రజా ప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు మరియు భక్తులందరూ ఉ త్సాహంగా పాల్గొన్నారు.

## రేపు బస్టాండ్ కార్గోలో డెలివరీ కాని వస్తువులకు వేలం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)




కోల్ సిటి (గోదావరిఖని), మే 12 : గోదావరిఖని ఆర్టీసీ బస్టాండ్ కార్గో కార్యాలయం ఆవరణలో మే 14న గురువారం సాయంత్రం 4 గంటలకు డెలివరీ కాని వస్తువులకు వేలం వేయడం జరుగుతుందని టిజిఎస్ఆర్టిసి కరీంనగర్ జోన్ ఎ.టి.ఎం.వెంకట నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. గోదావరిఖని, పెద్దపల్లి బస్టాండ్ లోని కార్గో ఆఫీస్ లో ఆటో మొబైల్స్ స్పేర్ పార్ట్స్ స్టేషనరీ, జనరల్ ఐటమ్స్ వినియోదారులు తీసుకోకపోవడంతో మిగిలాయని ఆయన పేర్కొన్నారు. దాంతో అట్టి వస్తువులకు వేలం వేయడం జరుగుతుందని ఆయన వివరించారు. కాగా మరిన్ని వివరాలకు 9154298557, 9949407275 సెల్ ఫోన్ నంబర్లలో సంప్ర దించాలని ఆయన కోరారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కాగజ్‌నగర్, మే 12 : కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం జిల్లా ఉపాధి కల్పనా శాఖ ప్రభుత్వ డిగ్రీ కళాశాల కెరీర్ గైడెన్స్ మరియు ప్లేస్ మెంట్ సెల్ తరపున జాబ్ మేళ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఉపాధి కల్పనా శాఖ అధికారి బి. కిరణ్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలోని నిరుద్యోగ యువత కొరకు వివిధ కంపేనీల సహకారంతో జాబ్ మేళాలు నిర్వహిస్తు అర్హులైన యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్లేస్ మెంట్ సెల్ సహకారంతో మరిన్ని ఉద్యోగ మేళా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ కె. శ్రీదేవి మాట్లాడుతూ డిగ్రీ పూర్తి చేసిన ప్రతీ విద్యార్థి ఏదో ఒక రంగంలో స్థిరపడాలనే సంకల్పంతో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తు న్నట్లు తెలిపారు. కళాశాల కెరీర్ గైడెన్స్ ప్లేస్ మెంట్ సెల్ ఇంచార్జ్ డా. డి. లక్ష్మినరసింహం మాట్లాడుతూ వివిధ కంపేనీలు జిల్లాలోని నిరుద్యోగ యువతకు మద్య ప్రభుత్వ డిగ్రీ కళాశాల అనుసంధాన కర్తగా పనిచేస్తు ఉద్యోగావకాశాల కొరకు కెరీర్ గైడెన్స్ జాబ్ మేళా లాంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం ఉద్యోగాల కొరకు 30 మంది అభ్యర్థులు హాజరు కాగా రుద్ర హాస్పిటల్ యాజమాన్యం , ఎల్.ఐ.సి యాజమాన్యం వారు వివిధ రకాల ఉద్యోగాల కొరకు ఇంటర్వ్యూలు నిర్వహించి అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. ఎంపికైన అభ్యర్థులకు త్వరలో సమాచారం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా. లక్ష్మినరసింహం, అకడమిక్ కో ఆర్డినేటర్ డి. జనార్ధన్, అధ్యాపకులు ఎం. రాజేశ్వర్ పాల్గొన్నారు.

# క్రికెట్ శిక్షణ శిబిరాన్ని ప్రారంభించిన ఆర్జీ-1 జీఎం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



గోదావరిఖని టౌన్, మే 12 : పెద్దపల్లి జిల్లా యువతలో క్రికెట్ నైపుణ్యాలను పెంపొందించేందుకు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్, కరీంనగర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక జీఎం కాలనీ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన నెల రోజుల ఉచిత వేసవి క్రికెట్ శిక్షణ శిబిరాన్ని ఆర్జీ-1 జీఎం లలిత్ కుమార్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలికితీయడంలో ఇటువంటి శిబిరాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. శిక్షణలో ఎంపికైన వారికి కరీంనగర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు తెలిపారు. మే 12 నుంచి జూన్ 11 వరకు జరిగే ఈ శిబిరంలో 12 నుండి 23 సంవత్సరాల మధ్య వయస్సు గల పెద్దపల్లి జిల్లా పరిసర ప్రాంతాల విద్యార్థులు పాల్గొంటున్నారు. మూడో సంవత్సరం నిర్వహిస్తున్న ఈ శిక్షణ శిబిరం ద్వారా యువతకు వృత్తిపరమైన క్రికెట్ మెళకువలు నేర్పించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను తదుపరి స్థాయి టోర్నమెంట్లకు ఎంపిక చేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ రవీందర్ రెడ్డి, సీనియర్ పీవో హనుమంతరావు, జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధులు కిరణ్ కుమార్ యాదవ్, కోచ్‌లు సుదేష్, రాజ్‌కుమార్, శ్రీనాథ్, రవి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# భద్రత విషయంలో అత్యంత పారదర్శకతను పాటిస్తున్నాం

### ఈవియం. గోదాం నెలవారి తనిఖీ నిర్వహించిన జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ములుగు, మే 12 : ఈవిఎంల భద్రత విషయంలో అత్యంత పారదర్శకతను పాటిస్తున్నామని ములుగు జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ వాసుదేవరావు తెలిపారు. మంగళవారం జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు కలెక్టరేట్ ఆవరణలోని ఈవీఎం గోదామును వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో నెలవారి తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గోదాం సీల్ ను తనిఖీ చేశారు. గోదాంలో అమర్చిన సీసీ కెమెరాల పనితీరును అగ్నిప్రమాదాలు జరగకుండా ముందస్తుగా ఏర్పాటు చేసిన ఫైర్ ఎక్స్‌స్టింగిషర్లను ఇతర అగ్నిమాపక పరికరాలను తనిఖీ చేశారు. ఏదైనా అత్యవసర పరిస్థితి తలెత్తితే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందికి తగిన సూచనలు జారీ చేశారు. గోదాం వద్ద ఉన్న పోలీస్ బందోబస్తును మరియు రిజిస్టర్లను కలెక్టర్ తనిఖీ చేశారు. భద్రత విషయంలో ఎటువంటి అలసత్వం వహించకూడదని సెక్యూరిటీ ని బ్బందికి సూచించారు. ఈ సందర్భంగా



కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల ప్రక్రియలో అత్యంత కీలకమైన ఈవీఎంల భద్రత విషయంలో అత్యంత పారదర్శకతను పాటిస్తున్నామని తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలోనే గోదాం తనిఖీ చేయడం జరిగిందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఎలక్షన్ సెల్ సూపరింటెంట్ ఎండి సలీం, సీనియర్ అసిస్టెంట్ మనోహర్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సాంస్కృతిక వైభవం ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి

### - మూడు రోజుల పాటు ఉత్సవాల నిర్వహణ -జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ములుగు, మే 12 : ములుగు సాంస్కృతిక వైభవం ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని, మూడు రోజుల పాటు ఉత్సవ కార్యక్రమాలు జరగనున్నాయని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు ములుగు సాంస్కృతిక వైభవం ఉత్సవాల నిర్వహణపై జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి ఉత్సవాల షెడ్యూల్, రిజిస్ట్రేషన్ ప్రక్రియ, ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా విశిష్ట సంస్కృతి, సంప్రదాయాలను, ప్రతిబింబించేలా ములుగు సాంస్కృతిక వైభవం ఉ త్సవాలను అత్యంత వైభవోపేతంగా ఘనంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో, జడ్.పి.హెచ్.ఎస్ బాలుర పాఠశాల, జడ్.పి.హెచ్.ఎస్. బాలికల పాఠశాలలో మే 20,21,22వ తేదీలలో మూడు రోజులపాటు క్రీడలు, సంస్కృతిక కార్యక్రమాలు, ఫుడ్ స్టాల్స్, గిరిజన నృత్యాలు, కవి సమ్మేళనం పలు అంశాలలో ఉత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉత్సవాలు నిర్వహించే వేదికలను ఎప్పటికప్పుడు శుభ్రపరిచే విధంగా చూడాలని, తాగునీరు, విద్యుత్ సౌకర్యం, వంటి అంశాలలో ఎలాంటి లోటుపాట్లు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్ జి, సంపత్ రావు, ఆర్డీవో వెంకటేష్, జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రయాణికులకు మౌలిక వసతులు కల్పించాలి

### - వేసవి కాలం దృష్ట్యా జిల్లా కేంద్రం లో చలివేంద్రాల సంఖ్య పెంచాలి

### - జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ములుగు, మే 12 : బస్ స్టాండ్ ఆవరణలో ప్రయాణికులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని, వేసవికాలం దృష్ట్యా మున్సిపాలిటీ పరిధిలో మరిన్ని చలి వేంద్రాలు ఏర్పాటు చేయాలని అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు ములుగు జిల్లా తాత్కాలిక బస్టాండ్ ఆవరణ పరిసరాలను, ములుగు మున్సిపాలిటీ పరిధిలో పట్టణ ప్రకృతి వనాన్ని, చలి వేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జిల్లా తాత్కాలిక బస్ స్టాండ్ ఆవరణ పరిసరాలను పరిశీలించి బస్సులు సమయపాలన, వసతుల కల్పన పలు అంశాలను అడిగి తెలుసుకొని తప్పనిసరిగా ప్రయాణికులకు మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. పట్టణ ప్రకృతి వనాన్ని పరిశీలించి మొక్కలు ఎండి పోకుండా సమృద్ధిగా నీరు అందించాలన్నారు. వేసవి కాలంలో దృష్టిలో ఉంచుకొని ప్రజలు రద్దీ ఉండే ప్రదేశాలలో మరిన్ని చలి వేంద్రాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. మున్సిపాలిటీ కమిషనర్ జనగాం సంపత్ రెడ్డి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బక్రీద్ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలి

### జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మెదక్, మే 13 : బక్రీద్ పండుగను ఆనందోత్సాహాలతో పాటు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్లోని మీటింగ్ హాల్ లో వివిధ శాఖల సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ సమాజంలో సౌభ్రాతృత్వం, ప్రేమ, పరస్పర గౌరవం పెంపొందించే ఈ పవిత్ర పండుగను అందరూ ఐకమత్యంతో నిర్వహించాలని సూచించారు. బక్రీద్ పండుగ త్యాగానికి, సేవాభావానికి ప్రతీక అని పేర్కొంటూ, పేదలకు సహాయం చేయడం, అవసరమైన వారికి తోడ్పాటు అందించడం అన్నారు. జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ బక్రీద్ సందర్భంగా మసీదులు, ప్రార్థనా స్థలాలు ప్రజలు ఎక్కువగా గుమికూడే ప్రాంతాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు శాఖ కట్టుదిట్టమైన భద్రతా




చర్యలు చేపడుతుందని వెల్లడించారు. ప్రజలు కూడా పోలీసు శాఖకు సహకరించి పండుగను విజయవంతంగా నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, ఆర్డీఓ రమాదేవి, జిల్లాపంచాయతీ అధికారి యాదయ్య, జిల్లా ట్రాన్స్పోర్ట్ అధికారి వెంకట స్వామి, మున్సిపల్ కమీషనర్లు, పశుసంవర్ధక శాఖ అధికారులు, డిఎస్పిలు, సిఐలు తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత శిక్షణ ప్రవేశ పరీక్షకు దరఖాస్తులు ఆహ్వానం

### జిల్లా మైనారిటీ అధికారి శ్రీనివాసరావు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మహబూబాబాద్ టౌన్, మే 12 : మైనారిటీల సంక్షేమ శాఖ ఆధ్వర్యములో తెలంగాణ రాష్ట్ర మైనారిటీస్ స్టడీ సర్కిల్, హైదరాబాద్ వారి ద్వార యూపిఎస్సి-సిఎస్ఏటి 2027 పరీక్ష కోసం 2026-27 విద్యా సంవత్సరమునకు 100 తెలంగాణ మైనారిటీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ అందించబడునని జిల్లా మైనారిటీ అధికారి శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణకు రిజర్వేషన్ల నియమ ప్రకారం మహిళా అభ్యర్థులకు 33.33% సీట్లు, అన్ని రిజర్వ్ కేటగిరీలలో వికలాంగులకు 5% సీట్లు, తల్లిదండ్రులు, సంరక్షకుల వార్షిక ఆదాయంసంవత్సరానికి రూ. 5లక్షలకుమించకుండా, హైదరాబాద్ లోని తెలంగాణ రాష్ట్ర మైనారిటీస్ స్టడీ సర్కిల్ లో మొదటిసారి ప్రవేశం పొందే అభ్యర్థులు ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవలని, ప్రవేశం పూర్తిగా మెరిట్ ప్రాతిపదికన ఉంటుందని యుపిఎస్సి సివిల్ సర్వీసెస్ ఆప్టిట్యూడ్ టెస్ట్ లో ప్రవేశం కోసం తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాలలోని సాధారణ ప్రొఫెషనల్ డిగ్రీ పూర్తి చేసిన మైనారిటీస్ అభ్యర్థుల నుండి ఆన్లైన్ https://cet.cgg.gov.in/tmreis వెబ్ సైట్ ద్వారా దరఖాస్తులు స్వీకరించబడును. దరఖాస్తులు చేసుకొనుటకు చివరి తేదీ ఈ నెల 31, స్క్రీనింగ్ టెస్ట్ ప్రవేశ పరీక్షా జూన్ 14న జిల్లా కేంద్రములో తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలలో నిర్వహించబడును. ఇతర వివరములకు 040-23236112, 9182540680 కార్యాలయ సమయములు ఉదయం 10:30 నుండి సాయంత్రం 5 గంటల పని దినాలలో సంప్రదించగలరని అన్నారు. అర్హులైన ఆసక్తి కలిగిన మైనారిటీస్ విద్యార్థులు ఇట్టి సదవకాశాన్ని సద్వినియోగపర్చుకోగలరని అధికారి ఈ సందర్భంగా కోరారు.

## పేద ప్రజలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

### ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



కోల్ సిటి (గోదావరిఖని), మే 12 : రామగుండం నియోజక వర్గం పాలకుర్తి మండలానికి చెందిన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను ఎమ్మెల్యే క్యాంప్ కార్యాల యంలో రామగుండం నియోజకవర్గం ఎమ్మెల్యే మక్కాన్ రాజ్ ఠాకూర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద ప్రజలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉ పయుక్తంగా నిలుస్తోందని తెలిపారు. ప్రజలకు అవసరమైన ప్రతి సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు లబ్ధిదా రులు తదితరులు పాల్గొన్నారు.




## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కూకట్‌పల్లి, మే 12 : కూకట్‌పల్లి నియోజకవర్గంలోని మూసాపేట్ డివిజన్‌కు చెందిన ఇద్దరు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను మంగళవారం అందజేశారు. మూసాపేట్‌కు చెందిన జంగం ప్రశాంత్‌కి రూ. 60 వేలు, తల్లూరి మమత రూ. 60 వేలు మంజూరయ్యాయి. ఈ మేరకు మొత్తం రూ. 1.20 లక్షల విలువైన చెక్కులను కమ్మ కార్పొరేషన్ చైర్మన్, కూకట్‌పల్లి టీపీసీసీ ఉపాధ్యక్షులు, జహీరాబాద్ పార్లమెంట్ ఇంచార్జ్, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జ్ బండి రమేష్ చేతుల మీదుగా హేమ దుర్గ భవన్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాల యంలో లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మయ్య, గాలి బాలాజీ, కొప్పిశెట్టి దినేష్ కుమార్, గంధం రాజు, విటల్ రెడ్డి, కనకయ్య, అస్లాం, అరవింద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా లబ్ధిదారులు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికు, బండి రమేష్కు కృతజ్ఞతలు తెలిపారు.




## ఆర్ జి టు ఏరియాలో స్ట్రక్చర్ మీటింగ్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కోల్ సిటి (గోదావరిఖని), మే 12 : సింగరేణి సంస్థ రామగుండం 2 వ ఏరియాలో ప్రతినెల నిర్వహించే నిర్మాణాత్మక సమావేశం మంగళవారం జి.ఎం.కార్యాలయం లోని సమావేశ మందిరంలో అఫిషియేట్ జిఎం మాలోత్ రాముడు అధ్యక్షతన గుర్తింపు సంఘం ఎఐటియూసితో నిర్వహించారు. ఈ సమావేశంలో యూనియన్ నాయకులు డివిజన్ లోని వకీల్ పల్లి, ఒసిపి త్రి, వర్క్ షాప్, స్టోర్, సిహెచ్ పి, 8 వ కాలనీలోని పలు సమస్యలను ప్రస్తావించగా యాజమాన్యం చర్చించి సానుకూలంగా స్పందించింది. ఈ సమావేశానికి గుర్తింపు సంఘం ఎఐటియూసి బ్రాంచి సెక్రటరీ గంధం సాంబశివరావు ,అధికార ప్రతినిధి ఎజియం(ప)అరవింద్ రావు, ఎజియం ఈ అండ్ యం. సుజన్ మెహ్రా,, ఎజియం ఐఈడి చంద్రశేఖర్, ప్రాజెక్ట్ ఆఫీసర్ ఉదయ్ హరిజన్, డిజియం వర్క్ షాప్ రాంరెడ్డి, వకీల్ పల్లి ఏజెంట్ నెహ్రూ, డిజియం ఫైనాన్స్ రాంచంద్ర, ఎస్ ఈ సివిల్ బాలరాజు,,ఏరియా సేఫ్టీ ఆఫీసర్ సంతోష్ కుమార్, డిజియం ఏరియా స్టోర్ సదానందం, డివై పియం పర్సనల్ వంశీధర్, ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ షరీఫ్ మహ్మద్, ఎన్విరాన్మెంట్ ఆఫీసర్ వేణుకుమార్, యూనియన్ నాయకులు అసిస్టెంట్ బ్రాంచి సెక్రటరీ శాంసన్, సెంట్రల్ సెక్రటరీ రాజరత్నం , ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆవుల రవికుమార్, మామిడి మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## 16లోపు సమస్యలు పరిష్కరించాలి

### - లేకపోతే సెంట్రింగ్ పనుల బంద్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)




కూకట్‌పల్లి, మే 12 : భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న సెంట్రింగ్ కార్మికులకు శ్రమకు తగ్గ ఫలితం దక్కాలని, కార్మికుల రేట్లు పెంచాలని డిమాండ్ చేస్తూ ఆల్విన్ కాలనీ డివిజన్ శ్రీ గణేష్ సెంట్రింగ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శేర్లింగంపల్లి ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్ అరికపూడి గాంధీకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు కె. మల్లేష్, జనరల్ సెక్రటరీ పి. ఈశ్వర్ మాట్లాడుతూ సెంట్రింగ్ కార్మికుల జీవితాలు దుర్భరంగా మారాయని తెలిపారు. నిత్యావసరాల ధరలు పెరుగుతున్న నేపథ్యంలో కార్మికులకు సరైన పారితోషికం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే ఈఎస్ఐ సదుపాయం కల్పించాలని, ప్రమాదవశాత్తు మరణించిన కార్మిక కుటుంబాలకు ప్రస్తుతం ఉన్న రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియాను రూ. 20 లక్షలకు పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ నెల 16లోపు సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా సెంట్రింగ్ పనులను బంద్ చేస్తామని హెచ్చరించారు. వినతిపత్రం స్వీకరించిన అరికపూడి గాంధీ న్యాయపరమైన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సెంట్రింగ్ కార్మికులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## శ్రీ బాల ఆంజనేయ స్వామి ఆలయంలో ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



కూకట్‌పల్లి, మే 12 : కూకట్‌పల్లిలోని బాగ్ అమీర్ ప్రాంతం లోని శ్రీ బాల ఆంజనేయ స్వామి దేవాలయంలో హనుమాన్ జయంతి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర బీసీ నాయకుడు తేళ్ల హరికృష్ణ హాజరై ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం దేవాలయంలో నిర్వహించిన అన్నసమారాధన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు స్వయంగా ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు ఆకుల లక్ష్మణరావు, రమణ పంతులు బృందం సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని జైశ్రీరామ్, జై హనుమాన్ నినాదాలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో మార్మోగింది.

## రంగులు, జెండాలు మార్చే ఊసరవెల్లికి మమ్మల్ని బహిష్కరించే అర్హత లేదు

### కందగట్ల సురేందర్‌పై రామ్మూర్తి, సుగుణ, బుచ్చయ్య తీవ్ర విమర్శలు




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి–కొత్తగూడెం, మే 12:సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రెండు జిల్లాల సంయుక్త కార్యదర్శినని చెప్పుకుంటున్న కందగట్ల సురేందర్‌కు తమను బహిష్కరించే అర్హత లేదని పార్టీ జిల్లా నాయకులు ఉప్పెర పోయిన రామ్మూర్తి, పీఓడబ్ల్యూ నాయకురాలు మలుగూరి సుగుణ, ఏఐకేఎంఎస్ నాయకులు కురసం బుచ్చయ్య, గుమ్మడి మారన్నలు తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు వారు మంగళవారం సంయుక్త ప్రకటన విడుదల చేశారు. పార్టీలు, జెండాలు, రంగులు మార్చడం కందగట్ల సురేందర్‌కు కొత్త కాదని, గతంలో అనేక రాజకీయ మార్పులు చేసిన చరిత్ర ఆయనకుందని వారు ఆరోపించారు. కేసుల సమయంలో ఆయన కుటుంబాన్ని ఆదుకున్న పార్టీ నాయకత్వానికే వెన్నుపోటు పొడిచారని విమర్శించారు. జిల్లా సహాయ కార్యదర్శిగా ఉన్న సమయంలో ఆదివాసీ నాయకుడు కొమరం సత్యనారాయణకు వ్యతిరేకంగా వ్యవహరించి రెండు జిల్లాల కార్యదర్శి స్థాయికి చేరుకున్న విషయం అందరికీ తెలిసిందేనని పేర్కొన్నారు. పార్టీ పేరుతో వ్యాపారవేత్తలు, కాంట్రాక్టర్లను బెదిరిస్తూ చందాలు వసూలు చేయడం, ఆర్థిక మరియు నిర్మాణ పరమైన అక్రమాలకు పాల్పడడం, కమిటీలతో చర్చించకుండా ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం వంటి చర్యలు సురేందర్ వ్యవహార శైలికి నిదర్శనమని ఆరోపించారు. మహిళా నాయకత్వంపై కూడా అసత్య ఆరోపణలు చేయడం ఆయన రాజకీయ సంస్కృతిని చూపుతోందన్నారు. "ఒక్క గ్రామ కమిటీని కూడా నిర్మించలేని వ్యక్తి, ప్రజల్లో పనిచేసే నాయకత్వాన్ని బహిష్కరించడం హాస్యాస్పదం" అని వారు వ్యాఖ్యానించారు. జిల్లా కమిటీ సమావేశంలో ఆయనపై వచ్చిన ఆర్థిక, నైతిక ఆరోపణలపై చర్చ ప్రారంభం కాగానే సమావేశం నుంచి వెళ్లిపోయి, అనంతరం మెజారిటీ సభ్యులను బహిష్కరించారని ఆరోపించారు. పార్టీ కార్యకర్తల దగ్గర అప్పులు తీసుకుని తిరిగి చెల్లించకుండా కుటుంబాల్లో విభేదాలు సృష్టించారని, కార్యకర్తల విశ్వాసాన్ని ద్రోహం చేశారని వారు విమర్శించారు. "విప్లవకారుడికి ఉండాల్సిన లక్షణాలు నీలో ఏమున్నాయో ప్రజలకు చెప్పాలి. నీ విలాసవంతమైన జీవితం ప్రజలకు తెలియనిది కాదు" అని తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. తమపై చేసిన ఆరోపణలను వెంటనే వెనక్కి తీసుకుని బహిరంగంగా క్షమాపణ చెప్పాలని, లేదంటే బహిరంగ విచారణకు సిద్ధం కావాలని సవాల్ విసిరారు. అవసరమైతే ఆయన వ్యవహారాలపై పూర్తి వివరాలతో కరపత్రాలు విడుదల చేసి ప్రజలకు తెలియజేస్తామని హెచ్చరించారు. తాము గ్రామాలు, దళాల్లో పనిచేస్తూ ప్రజా ఉద్యమాల ద్వారా ఎదిగిన నాయకులమని, పదవుల కోసం అగ్రనాయకత్వానికి భజన చేసిన చరిత్ర తమకు లేదని స్పష్టం చేశారు. ఇంకా అనేక ఆర్థిక, నైతిక అంశాలు బయటపెట్టే అవకాశం ఉన్నప్పటికీ, విప్లవ సంస్కృతిని దృష్టిలో ఉంచుకుని ప్రస్తుతం వాటిని వెల్లడించడం లేదని సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు.

## బండి సంజయ్ కుమారుడిపై చర్యలు తీసుకోవాలి

### – మణుగూరులో బీఆర్ఎస్ నిరసన కార్యక్రమం



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మణుగూరు, మే 12:భారత రాష్ట్ర సమితి రాష్ట్ర పిలుపు మేరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలంలో మంగళవారం బీఆర్ఎస్ పట్టణ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథపై నమోదైన లైంగిక వేధింపుల కేసులో ఇప్పటివరకు అరెస్టు చేయకపోవడాన్ని నిరసిస్తూ మణుగూరు అంబేద్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేపట్టారు. మైనర్ బాలికపై లైంగిక వేధింపుల ఆరోపణల నేపథ్యంలో నమోదైన కేసుపై తక్షణ చర్యలు తీసుకుని బండి భగీరథను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నిరసనకారులు నినాదాలు చేస్తూ కేంద్రమంత్రి బండి సంజయ్‌ను కేంద్ర మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని కోరారు. అనంతరం కేసులో న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ అంబేద్కర్ విగ్రహం వద్ద మెమోరాండం సమర్పించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు కుర్రి నాగేశ్వరరావు, కుంట లక్ష్మణ్ మాట్లాడుతూ కాంగ్రెస్––బీజేపీ మధ్య ఉన్న రాజకీయ అనుబంధం కారణంగానే ఈ కేసు విషయంలో ఆలస్యం జరుగుతోందని విమర్శించారు. గతంలో చిన్న సంఘటనలపైనా వెంటనే స్పందించిన కాంగ్రెస్ నాయకులు, ప్రస్తుతం ఇలాంటి తీవ్రమైన ఆరోపణల కేసులో మౌనం పాటించడం ద్వంద్వ వైఖరికి నిదర్శనమని అన్నారు. అప్పట్లో టీఆర్ఎస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేసిన నాయకులు, ఇప్పుడు అదే విషయాల్లో భిన్నంగా వ్యవహరించడం సమంజసం కాదని పేర్కొన్నారు. ప్రజలు ఈ వైఖరికి తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎడ్ల శ్రీనివాస్, యాదగిరి గౌడ్, తడికమల్ల ప్రభుదాస్, ఆవుల నరసింహారావు, జావిద్ పాషా, ధమ్మక్కపేట సర్పంచ్ మడి స్వరూప, ఉపసర్పంచ్ పెనుగొండ నరేష్, ఎస్సీ సెల్ అధ్యక్షులు వేల్పుల సురేష్, వార్డు సభ్యురాలు యదల్లపల్లి శారద, బుద్దుల ప్రసాద్, బూర్గుల సంజీవరావు, వనమాల రాంబాబు, వాయిల నరసయ్య, కర్ల వెంకన్న, ముత్యం రమేష్, ఉప్పాక సత్యనారాయణ, లక్ష్మిశెట్టి ప్రసాద్, జక్కం రంజిత్, వడ్లూరి రాంబాబు, గంట వెంకటేశ్వర్లు, నాయకురాలు జీవిత, అధ్యక్షుడు బోశెట్టి రవి, ఆవుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## భద్రాచలం దేవస్థాన పాలక మండలి ఏర్పాటు చేయాలి

### – తెలంగాణ ఉద్యమకారులకు ప్రాధాన్యత ఇవ్వాలి
### – శ్రావణ బోయిన నరసయ్య ముదిరాజ్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి–కొత్తగూడెం, మే 12:భద్రాచలం దేవస్థానం పాలక మండలిని తక్షణమే ఏర్పాటు చేసి తెలంగాణ ఉద్యమకారులకు ప్రాధాన్యత కల్పించాలని తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. మంగళవారం కొత్తగూడెంలో నిర్వహించిన తెలంగాణ ఉద్యమ వేదిక సమావేశంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు శ్రావణ బోయిన నరసయ్య ముదిరాజ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ భద్రాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు పాలక మండలిని ఇప్పటికీ ఏర్పాటు చేయకపోవడం విచారకరమన్నారు. ఎండోమెంట్ శాఖ మూడు పర్యాయాలు దరఖాస్తులు స్వీకరించినప్పటికీ పాలక మండలి నియామకంపై ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం ప్రభుత్వ చిత్తశుద్ధిపై అనుమానాలు కలిగిస్తోందని విమర్శించారు. "పాలక మండలిని నిజంగా ఏర్పాటు చేసే ఉద్దేశం ప్రభుత్వానికి ఉందా? లేక కాలయాపన చేస్తుందా?" అని ఆయన ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాటాలు చేసిన ఉద్యమకారులకు పాలక మండలిలో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, అలాగే ఆధ్యాత్మిక భావనతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో విశేషంగా పనిచేసిన వారికి అవకాశం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు నరాల సత్యనారాయణ, కార్యదర్శి కాకెల్లి సైమన్, పిల్లి రాజయ్య, ఖమ్మం లింగయ్య, అలీముద్దీన్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

# పదో తరగతిలో ఫెయిల్ అయ్యామని బాధపడొద్దు

### - సప్లమెంటరీ లో తిరిగి పరీక్ష రాసి పాస్ కావాలి - ఫెయిల్యూర్ నుంచి సక్సెస్ మొదలవుతుంది

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పాల్వంచ, మే 12:పదవ తరగతి పరీక్షల్లో ఫెలయ్యామని విద్యార్థులు బాధ పడవద్దని, ఫెయిల్యూర్ నుంచే సక్సెస్ సాధించాలని భద్రాద్రి జిల్లా విద్యాశాఖ అధికారి బి.నాగలక్ష్మి అన్నారు. విద్యా వారోత్సవాల్లో భాగంగా మంగళవారం భద్రాద్రి జిల్లా పాల్వంచలోని బొల్లోరుగూడెం ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని (రెమెడియల్ క్యాంప్) ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పాల్వంచ పట్టణ, మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 109 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షల్లో ఫెయిల్ అయ్యారని, వారికోసం ప్రభుత్వం 12 వ తేదీ నుంచి జూన్ మూడో తేదీ వరకు (రెమెడియల్ క్యాంపు) ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, దీనిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఆయా సబ్జెక్టుల్లో ఫెయిల్ అయిన విద్యార్థులు క్రమం తప్పకుండా శిక్షణ తరగతులకు హాజరై ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను శ్రద్ధగా విని తిరిగి మళ్ళీ పరీక్షలు రాసి పాసై రెగ్యులర్ విద్యార్థులు మాదిరిగా తిరిగి ఉన్నత చదువులు చదువుకునేందుకు చక్కటి అవకాశం ఏర్పడిందని,దీన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఫెయిల్ అయ్యామని బాధపడుతూ ఇంట్లోనే కూర్చొనకుండా ఇప్పుడు వచ్చిన ఈ అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు అంతా కూడా పేద తరగతి కి చెందినవారు అయినందువల్ల, మీ తల్లిదండ్రులు మీ మీద పెట్టుకున్న ఆశలను అడియాశలు చేయకుండా ఉన్నత శిఖరాలకు ఎదిగేలా ఫెయిల్యూర్ నుంచే సక్సెస్ వైపుగా ముందుకు నడిచి తమ బంగారు భవిష్యత్తు కు బాటలు వేసుకోవాలని విద్యార్థులను కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ఏ. శ్రీరామ్మూర్తి, నోడల్ అధికారి బి. ప్రకాశరావు, కాంప్లెక్స్ హెడ్మాస్టర్లు సునందిని, కుమారి, మంగమ్మ, పద్మలత,రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.




# మహిళా హక్కులు కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వం: ఏపూరి లత దేవి

### - ఎన్.ఎఫ్.ఐ.యు. మహాసభలు జయప్రదం చేయండి: పోటు కళావతి
### - బండి సాయి భగీరథ్ ను అరెస్టు చేయాలి




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

సత్తుపల్లి, మే 12:మహిళల హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తుందని, తెలంగాణ మహిళా సమాఖ్య అనుబంధం ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పోటు కళావతి, ఏపూరి లత దేవి అన్నారు. మంగళవారం సంఘం నాయకులు మహాదేవ లక్ష్మి, సీత అధ్యక్షతన ఖమ్మం జిల్లా సత్తుపల్లి పట్టణంలో జరిగిన సంఘం సర్వసభ్య సమావేశంలో వారు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డి–లిమిటేషన్ పేరుతోటి చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ను అమలు కాకుండా కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని ఆరోపించారు. బిజెపి పాలనలో మహిళాల పై అత్యాచారాలు విపరీతంగా పెరిగాయి ప్రజలను పరిపాలించాల్సిన పార్లమెంట్ మెంబర్లు, వాళ్ల కుమారులు మహిళలపై అత్యాచారాలు చేసి నిర్దోషులుగా తప్పించుకోవాలని, చట్టాలను దుర్వినియోగం చేసి వాళ్ళ చుట్టాలుగా మార్చుకొని రాక్షస పాలన పరిపాలన సాగిస్తున్నారనీ అన్నారు. మైనర్ బాలికపై అత్యాచారం ఆరోపణలు ఎదుర్కొంటున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథ ను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 16వ తేదీన వైరా పట్టణంలో జరగబోయే సంఘం జిల్లా మహాసభలకు మహిళలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సత్తుపల్లి పట్టణ కార్యదర్శి నిమ్మటూరీ రామకృష్ణ, మండల కార్యదర్శి తడికమల యోబు, షేక్ రహిమునిష, వెంకటలక్ష్మి, కృష్ణవేణి, చిట్టెమ్మ, నాగలక్ష్మి, సుజాత, నాగమ్మ, జారినా, శ్రీలక్ష్మి, రాజ్యలక్ష్మీ, రవళి, తదితరులు పాల్గొన్నారు.

# భగీరథను ఎక్కడున్నా అరెస్టు చేసి బాధిత కుటుంబానికి న్యాయం చేస్తాం

### – బండి సంజయ్‌ను పార్టీ పదవి నుంచి తొలగించాలి – కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బట్టు కర్ణాకర్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్–భూపాలపల్లి, మే 12:కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కుమారుడు బండి భగీరథపై నమోదైన పోక్సో కేసులో చట్టపరమైన చర్యలు తీసుకుని, ఎక్కడున్నా అరెస్టు చేసి బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బట్టు కర్ణాకర్ అన్నారు. అలాగే బండి సంజయ్‌ను పార్టీ పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, షేక్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఒక మైనర్ బాలిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు బండి భగీరథపై పోక్సో కేసు నమోదు చేసి విచారణ చేపట్టారని తెలిపారు. స్నేహం పేరుతో ఫామ్‌హౌస్‌కు పిలిపించి మత్తు పదార్థాలు ఇచ్చి పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్నట్లు చెప్పారు. "ఒక హిందూ బాలికపై ఇంత తీవ్రమైన ఆరోపణలు వచ్చినా బీజేపీ మహిళా నాయకులు ఎందుకు స్పందించడం లేదు?" అని ప్రశ్నించారు. ఈ వ్యవహారం దాదాపు రెండు నెలలుగా కొనసాగుతున్నప్పటికీ, అధికార పలుకుబడితో కేసును తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం బాధితురాలి కుటుంబానికి అండగా నిలుస్తుందని, నిందితుడిని చట్టం ముందు నిలబెడతామని స్పష్టం చేశారు. బీజేపీ ఎంపీ బండి సంజయ్ తన పదవిని ఉపయోగించి కేసు విచారణను ప్రభావితం చేయకుండా వెంటనే ఆయనను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.



కరీంనగర్‌లో బాధితురాలిపైనే కేసు నమోదు చేయడం దురదృష్టకరమని విమర్శించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అజ్మీర జంపన్న మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల రక్షణకు కట్టుబడి ఉందన్నారు. "రాముడిని మొక్కుతాం.. బీజేపీని తొక్కుతాం" అంటూ విమర్శలు గుప్పించారు. హిందూ మహిళకు అన్యాయం జరిగితే హిందూ సంఘాలు, మతపెద్దలు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. జిల్లా కార్యదర్శి నాలిక పరమేశ్వరి మాట్లాడుతూ, మహిళలపై ఇలాంటి ఘటనలు సమాజానికి సిగ్గుచేటని పేర్కొన్నారు. అధికారంలో ఉన్నామనే అహంకారంతో మహిళలను వేధిస్తే సహించబోమని హెచ్చరించారు. బండి సంజయ్ హోంశాఖ సహాయ మంత్రి పదవికి అనర్హుడని, వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కౌన్సిలర్లు, మహిళా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలి

### మొగుళ్ళపల్లి మార్కెట్ గోదాంను సందర్శించిన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్–భూపాలపల్లి, మే 12:రైతులు పండించిన మొక్కజొన్న పంటకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అధికారులను ఆదేశించారు. మంగళవారం మొగుళ్ళపల్లి మండల కేంద్రంలోని మార్కెట్ గోదాంను ఎమ్మెల్యే సందర్శించి, అక్కడి పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ రైతులు పండించిన మొక్కజొన్న ధాన్యం రవాణా, నిల్వ, హమాలీ తదితర అంశాలపై సంబంధిత అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి పలు సూచనలు చేశారు. మొక్కజొన్న దిగుబడులను సరైన సమయంలో తరలించి గోదాంలలో నిల్వ చేసేలా చర్యలు తీసుకోవాలని, రైతులకు నష్టం కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. హమాలీ చార్జీలు, రవాణా సమస్యలు, గోదాంల సామర్థ్యం వంటి అంశాలను ప్రత్యేకంగా పర్యవేక్షించి రైతులకు ఎటువంటి ఆలస్యం లేకుండా సేవలు అందించాలని అధికారులను కోరారు. రైతుల కష్టానికి తగిన గిట్టుబాటు ధర అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిట్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ గుమ్మడి శ్రీదేవి, వైస్ చైర్మన్ ఎండి రఫీ, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# రాష్ట్ర అభివృద్ధికి రాజకీయ షరతులు విధించడం రాజ్యాంగ విరుద్ధం

### - ప్రధాని వ్యాఖ్యలు తెలంగాణ ప్రజలను నిరుత్సాహపరిచాయి - సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి బందు సాయిలు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్–భూపాలపల్లి, మే 12:"రాష్ట్ర అభివృద్ధి జరగాలంటే మాతో జతకట్టాలి" అనే విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రికి పరోక్ష సంకేతాలు ఇవ్వడం రాజ్యాంగ విరుద్ధమని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి బందు సాయిలు విమర్శించారు. మంగళవారం భూపాలపల్లి పట్టణ కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన బహిరంగ సభలో తెలంగాణ ప్రజల ఆశలను నీరుగార్చేలా ప్రసంగించారని అన్నారు. నీతి సూత్రాలు వల్లిస్తూ ఉపన్యాసం చేసినప్పటికీ, రాష్ట్రానికి సంబంధించిన ప్రధాన సమస్యలపై ఎలాంటి స్పష్టత ఇవ్వలేదని విమర్శించారు. బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు ఎందుకు చేయలేదని, పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఎందుకు ఇవ్వలేదని, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు ఎందుకు అడ్డంకులు సృష్టిస్తున్నారని ప్రశ్నించారు. అలాగే రాష్ట్రానికి రావాల్సిన కేంద్ర నిధులు ఎందుకు తగ్గుతున్నాయో ప్రధాని సమాధానం చెప్పలేదన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్రానికి అనుకూలంగా వ్యవహరించాలని ముఖ్యమంత్రికి సంకేతాలు ఇవ్వడం సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని బందు సాయిలు పేర్కొన్నారు. పెట్రోల్ వినియోగాన్ని తగ్గించాలి, ప్రజారవాణా వినియోగించాలి, బంగారం కొనొద్దు, విదేశీ పర్యటనలు తగ్గించుకోవాలి వంటి సూచనలు చేస్తూనే ధరల పెరుగుదలకు కారణమైన అంతర్జాతీయ పరిస్థితులపై కేంద్రం సమర్థవంతమైన చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్, విద్యుత్ సవరణ బిల్లుల ద్వారా విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరణ చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ప్రధాని ప్రసంగంలో తెలంగాణ సమస్యల పరిష్కారం కంటే రాష్ట్రంలో రాజకీయంగా ఎలా బలపడాలన్న దానిపైనే దృష్టి కనిపించిందన్నారు. మతోన్మాద రాజకీయాలకు వ్యతిరేకంగా పోరాడిన తెలంగాణ ప్రజలు అదే పోరాట స్ఫూర్తితో బీజేపీకి తగిన గుణపాఠం చెప్పాలని సీపీఐ(ఎం) ప్రజలను కోరుతున్నదని బందు సాయిలు తెలిపారు.



## మంత్రి పొంగులేటిని మర్యాదపూర్వకంగా కలిసిన సత్తుపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

సత్తుపల్లి, మే 12:ఖమ్మం జిల్లా సత్తుపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ రిహానా కమల్ పాషా మంగళవారం తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలో పెండింగ్‌లో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల బిల్లుల సమస్యపై మంత్రితో లచర్చించినట్లు ఆమె తెలిపారు. సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## హనుమాన్ జయంతి సందర్భంగా అన్న ప్రసాదాలు పంపిణీ



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, మే 12:భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం నియోజకవర్గం సూపర్ బజార్ సెంటర్ శ్రీ లలిత్ కంగన్ హాల్ దుర్గ ప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు నిర్వహించారు. మంగళవారం హనుమాన్ జయంతి సందర్భంగా అన్న ప్రసాదాలు పంపిణీ కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమములో దుర్గ ప్రసాద్ మాట్లాడుతూ, కొత్తగూడెం నియోజకవర్గంతో పాటు,రాష్ట్ర ప్రజలందరిపై హనుమాన్ దయ ఉండాలని, హనుమాన్ దయ వలన అందరూ కూడా ఆయువు ఆరోగ్యాలతో అష్ట ఐశ్వర్యాలతో నిండు నూరేళ్ళు వర్ధిల్లాలని హనుమాన్ జయంతి రోజు ప్రసాదాలు పంచడం దేవుడు ఇచ్చిన గొప్పవరంగా దుర్గాప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమములో పవన్,రాహుల్,వర్ధన్,మోహన్ రావు,మహిళలు,వ్యాపారాలు పాల్గొన్నారు.

## జీనియస్ వరల్డ్ రికార్డ్స్ లో శృతి ప్రియ ప్రతిభ




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మణుగూరు, మే 12: భద్రాద్రి జిల్లా మణుగూరు పట్టణంలోని వెూంటిసోరి పాఠశాలకు చెందిన విద్యార్థిని శృతి ప్రియ ప్రతిభ చాటింది. పట్టణంలోని ప్రియా టెంట్ హౌస్ యజమాని సురేష్ కుమార్తె శృతి ప్రియా స్థానిక వెూంటిసోరి పాఠశాలలో చదువుతోంది. విజయవాడలోని ఓ మ్యూజిక్ స్కూల్లో వివిధ దేశాల నుంచి రెండు వేల మంది కీబోర్డు వాయిద్య కళాకారులు ఏకకాలంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శన గిన్నిస్ రికార్డు సాధించింది. ఈ కార్యక్రమంలో ప్రతిభ కనపరిచిన వారికి ధ్రువపత్రాలను అందించారు. తాజా గా మ్యూజిక్ స్కూల్లో జరిగిన కార్యక్రమంలో మ్యూజిక్ స్కూల్ వ్యవస్థాపకుడు అగస్టిన్ దండంగి నుంచి శృతి ప్రియా గిన్నిస్ బుక్ జీనియస్ వరల్డ్ రికార్డ్ ధ్రువపత్రం అందుకున్నారు.

## అంజనాపురంలో ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

### - పాల్గొన్న ఎమ్మెల్యే రాగమయి



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

సత్తుపల్లి, మే 12:ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గం తల్లాడ మండలంలోని అంజనాపురం గ్రామంలో శ్రీ హనుమాన్ జయంతి సందర్భంగా శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం జరిగిన ఈ కార్యక్రమాలలో సత్తుపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భక్తులతో కలిసి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీస్సులు పొందారు. అనంతరం నిర్వహించిన అన్నప్రసాద కార్యక్రమంలో పాల్గొని భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.గ్రామ ప్రజలు, భక్తులు, పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని హనుమాన్ జయంతి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

# రీ సర్వే ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలి

### - ప్రతి రైతుకు పూర్తి అవగాహన కల్పించాలి: జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్

### - కాకరవాయిలో రీ సర్వే పనులను పరిశీలించిన కలెక్టర్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖమ్మం, మే 12:రీ-సర్వే ప్రక్రియను ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు, మార్గదర్శకాల ప్రకారం పూర్తిస్థాయి పారదర్శకతతో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్ అధికారులను ఆదేశించారు. భూ వివాదాల పరిష్కారం, భూ రికార్డుల నవీకరణ లక్ష్యంగా చేపడుతున్న ఈ ప్రక్రియలో ప్రతి రైతుకు పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. మంగళవారం తిరుమలాయపాలెం మండలం కాకరవాయి గ్రామంలో జరుగుతున్న రీ సర్వే పనులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే నిర్వహిస్తున్న అధికారులతో సమావేశమై పలు దిశానిర్దేశాలు చేశారు. కాకరవాయి గ్రామంలో ఆర్ఎస్ఆర్ పట్టా విస్తీర్ణ సమస్యలు ఉన్నందున వాటి పరిష్కారం కోసం రీ సర్వే చేపడుతున్నామని తెలిపారు. రైతు వేదికను కేంద్రంగా చేసుకుని అక్కడే కంప్యూటర్ ఏర్పాటు చేసి భూ వివరాల నమోదు చేపట్టాలని సూచించారు. గ్రామంలో రీ సర్వే నిర్వహణ కోసం ఐదు బృందాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ప్రతి బృందంలో ఒక సర్వేయర్, జీపీవో ఉంటారని తెలిపారు. ప్రభుత్వం జారీ చేసిన జీవోలు, మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించిన కలెక్టర్, ముందుగా ఫారం-6 జారీ చేసి, 15 రోజుల గడువు అనంతరం మాత్రమే తదుపరి ప్రక్రియ చేపట్టాలని స్పష్టం చేశారు. ఇందుకోసం ఎస్ఓపీ సిద్ధం చేసి దశలవారీ విధానాన్ని అనుసరించాలని సూచించారు. గ్రామంలోని రహదారులు, ప్రజా స్థలాలు, ప్రభుత్వ భూములు, ప్రభుత్వ సంస్థలకు చెందిన భూముల వివరాలను కోఆర్డినేట్లతో సహా ఖచ్చితంగా నమోదు చేయాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ భూముల వివరాలను స్పష్టమైన పంచనామాలతో నమోదు చేయాలని తెలిపారు. ప్రతి బృందం రోజుకు 50 నుంచి 70 ఎకరాల వరకు సర్వే పూర్తి చేయాలని, మొత్తం ఐదు బృందాలు కలిసి రోజుకు 250 నుంచి 300 ఎకరాల వరకు రీ సర్వే నిర్వహించాలని లక్ష్యాలు నిర్దేశించారు. ప్రతిరోజూ ఉదయం 7 గంటలకే క్షేత్రస్థాయిలో పనులు ప్రారంభించాలని ఆదేశించారు. ప్రతి రైతు పేరు, భూ విస్తీర్ణం, పూర్తి వివరాలు నమోదు చేయాలని, సర్వే నివేదికలను రోజువారీగా సమర్పించాలని సూచించారు. సర్వే వివరాల డేటా ఎంట్రీ, మ్యాప్ తయారీ ప్రక్రియలను సమాంతరంగా కొనసాగించాలని పేర్కొన్నారు. రీ సర్వే ద్వారా ఎవరూ తమ భూమి విస్తీర్ణాన్ని కోల్పోరని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రస్తుతం గ్రామంలో సర్వే నంబర్ల విషయంలో ఉన్న గందరగోళం పూర్తిగా తొలగిపోయి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు. రీ సర్వే విజయవంతం కావాలంటే గ్రామ సభలు నిర్వహించడం తప్పనిసరి అని పేర్కొన్న కలెక్టర్, రెవెన్యూ గ్రామ పరిధిలోని అన్ని గ్రామాల ప్రజలను గ్రామ సభలకు ఆహ్వానించాలని సూచించారు. రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకోవాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో వివిధ సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున ఆర్డీఓ ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే కమిటీకి దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాలని, కమిటీ పరిశీలన అనంతరం మాత్రమే తదుపరి సర్వే ప్రక్రియ కొనసాగించాలని తెలిపారు.

# ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో సహకార బ్యాంకుల పాత్ర కీలకం

### - 33 మంది లబ్ధిదారులకు రూ.11.21 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

### - కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్-భూపాలపల్లి, మే 12:గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి సహకార బ్యాంకులు వెన్నెముకలుగా నిలుస్తున్నాయని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో సహకార బ్యాంకుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. మంగళవారం మొగుళ్లపల్లి మండల కేంద్రంలో వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ లిమిటెడ్ నూతన బ్రాంచ్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు, మహిళా సంఘాలు, చిన్న వ్యాపారులకు సులభంగా రుణ సదుపాయాలు అందించడంలో ఈ కొత్త బ్రాంచ్ ఉపయోగపడుతుందని తెలిపారు. గ్రామీణ ప్రజలకు బ్యాంకింగ్ సేవలు మరింత చేరువ కావడం ద్వారా ఆర్థికాభివృద్ధికి దోహదం అవుతుందని చెప్పారు. రైతులకు అవసరమైన సమయంలో ఆర్థిక సహాయం అందేలా అధికారులు పనిచేయాలని సూచించిన ఎమ్మెల్యే, ప్రజలు డిజిటల్ బ్యాంకింగ్ సేవలను వినియోగించుకొని పొదుపు అలవాటు పెంపొందించుకోవాలని కోరారు. అనంతరం మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో మొగుళ్లపల్లి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 33 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.11,21,500 విలువ గల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆపద్బాంధవంగా నిలుస్తోందన్నారు. అనారోగ్య సమస్యలతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు



ప్రభుత్వం అండగా నిలిచి సహాయం అందిస్తోందని తెలిపారు. పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేస్తున్నామని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో సీఎం రిలీఫ్ ఫండ్‌ను పరిమిత వర్గాలకే అందించారని విమర్శించిన ఎమ్మెల్యే, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల కష్టసుఖాల్లో ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అన్నారు. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరేలా చర్యలు తీసుకుంటున్నామని, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# హనుమాన్ జయంతి సందర్భంగా పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు

### పాల్గొన్న డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు దంపతులు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పాల్వంచ, మే 12:హనుమాన్ జయంతి సందర్భంగా మంగళవారం పాల్వంచ పట్టణంలోని పలు దేవాలయాల్లో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్, పాల్వంచ సొసైటీ అధ్యక్షుడు కొత్వాల శ్రీనివాసరావు, ఆయన సతీమణి 46వ డివిజన్ కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.పాత పాల్వంచలోని ఆంజనేయస్వామి దేవాలయం, బొల్లోరిగూడెంలోని రామాలయం, అయ్యప్పస్వామి దేవాలయ ప్రాంగణంలోని హనుమాన్ ఆలయంలో జరిగిన పూజల్లో వారు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా దేవాలయాల నిర్వాహకులు కొత్వాల దంపతులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. హనుమాన్ జయంతి సందర్భంగా అయ్యప్పస్వామి దేవాలయంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని కొత్వాల శ్రీనివాసరావు ప్రారంభించారు. సుమారు వెయ్యి మంది భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో కార్పొరేటర్లు కొత్వాల విమలాదేవి, సీరపు సుగుణ, అయ్యప్పస్వామి దేవాలయ పూజారి బృందావనం నరసింహమూర్తి, కనగాల రాంబాబు, బేతంశెట్టి వెంకట్, భట్టు మంజుల, బ్యాంకు చారి, కేశబోయిన కోటేశ్వరరావు, బాడిశ శంకరరావు, గల్ల శోభన్ బాబు, హర్షవర్ధన్, సుంకర వీరభద్రం, కృష్ణ, ప్రసాద్, బూసి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా "రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు" కార్యక్రమం



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

సత్తుపల్లి, మే 12:ఖమ్మం జిల్లా వేంసూర్ మండలం కె.జి. మల్లెల గ్రామంలో వ్యవసాయ కళాశాల అశ్వారావుపేట ఆధ్వర్యంలో "రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు" కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు డా. ఎం. రామ్ ప్రసాద్, డా. పి. ఝాన్సీ రాణి పాల్గొని రైతులకు పలు వ్యవసాయ అంశాలపై అవగాహన కల్పించారు.డా. ఎం. రామ్ ప్రసాద్ మాట్లాడుతూ భూసార పరీక్షల ఆధారంగా ఎరువుల మోతాదును నిర్ణయించి నేలకు అందించాలని సూచించారు. సేంద్రియ వ్యవసాయం ప్రాధాన్యత, మట్టి నమూనాల సేకరణ విధానం, ఆయిల్ పామ్ సాగులో ఎదురయ్యే సమస్యలు, వాటి పరిష్కారాలపై రైతులకు వివరించారు. కొబ్బరి మొక్కల లభ్యత, ఆయిల్ పామ్‌లో నీటి నిర్వహణ, ఎరువుల యాజమాన్యంపై అవగాహన కల్పించారు.డా. పి. ఝాన్సీ రాణి మార్కెట్లో గిరాకీ ఉన్న వరి రకాల లక్షణాలు, పచ్చిరొట్ట పంటల ప్రయోజనాలు, పంట మార్పిడి అవసరాన్ని రైతులకు వివరించారు. ఉద్యాన శాఖ అధికారులు ఆయిల్ పామ్ సాగులో లభించే సబ్సిడీలు, కూరగాయల సాగులో తీసుకోవాల్సిన మెలకువలు, డ్రిప్ సాగుపై ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీల గురించి రైతులకు తెలియజేశారు.గ్రామ సర్పంచ్ నరసింహారావు మాట్లాడుతూ శాస్త్రవేత్తల సూచనలు పాటించి రైతులు లాభసాటి వ్యవసాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి స్వాతి, వ్యవసాయ విస్తరణ అధికారులు సందీప్, స్వాతి, రీమా, ఉద్యాన విస్తరణ అధికారి రాజేశ్వరరావు,అగ్రికల్చర్ కళాశాల విద్యార్థులు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# గ్రామాల అభివృద్ధే రాష్ట్ర ప్రగతికి పునాది

### పెద్దంపల్లిలో నూతన గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

రేగొండ, మే 12:గ్రామాల అభివృద్ధే రాష్ట్ర ప్రగతికి పునాదిగా నిలుస్తుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు గ్రామస్థాయిలోనే అందుబాటులో ఉండేలా గ్రామపంచాయతీ కార్యాలయాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. మంగళవారం రేగొండ మండలంలోని పెద్దంపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు ఈ నూతన భవనం ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రజా ప్రభుత్వ హయాంలో గ్రామీణాభివృద్ధికి పెద్దపీట వేస్తూ మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గ్రామాల సమగ్ర అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామ ప్రజలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామ పెద్దలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.








# కొనుగోళ్లపై నిర్లక్ష్యం వహిస్తే అధికారులపై వెంటనే చర్యలు తీసుకుంటాం

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మెదక్/మహబూబాబాద్, మే 12 : ధాన్యం, మొక్కజొన్న పంట కొనుగోళ్లపై నిర్లక్ష్యం వహిస్తే అధికారులపై వెంటనే చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి సంబంధిత అధికారులను హెచ్చరించారు. మంగళవారం మొక్కజొన్న, ధాన్యం కొనుగోళ్ల పై సీఎం రేవంత్ రెడ్డి,మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి,వాకిటి శ్రీహరి, దనసరి అనసూయ సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావులతో కలిసి అన్ని జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో మెదక్ జిల్లా నుండి కలెక్టర్ ప్రతిమా సింగ్, మహబూబాబాద్ జిల్లా నుండి కలెక్టర్ స్నేహ శబరిష్ ఆయా జిల్లా ఐడీఓసీ నుండి పాల్గొన్నారు.

సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ మొక్కజొన్న, ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా యంత్రాంగం సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. జిల్లాలో ఉన్న ప్రతి ప్రైవేట్ గోదామును అవసరమైతే ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలని, అవసరమైన అన్ని చట్టాలను వినియోగించి నిల్వ సదుపాయాలను పెంచాలని సూచించారు. కమ్యూనిటీ హాళ్లు, రైతు బజార్లను తాత్కాలిక షెడ్లుగా వినియోగించాలని ఆదేశించారు. జిల్లా ఎస్పీలు, ఉన్నత స్థాయి పోలీసు అధికారులు కొనుగోలు ప్రక్రియలో చురుకుగా పాల్గొనాలని, అవసరమైన వాహనాల ఏర్పాట్లు వెంటనే పూర్తి చేయాలని సూచించారు. జిల్లాలో స్థానిక హమాలీలను 100 శాతం వినియోగించుకునేలా కార్యాచరణ రూపొందించాలని, ఎక్కడా హమాలీల కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. హమాలీలు అధిక మొత్తంలో డబ్బు డిమాండ్ చేస్తే వారి లైసెన్సులను రద్దు చేయాలని, అవసరమైన పోలీసు సహకారం తీసుకోవాలని స్పష్టం చేశారు. కొన్ని చోట్ల ధాన్యం రైస్ మిల్లులకు చేరిన తర్వాత రైతులకు రశీదులు ఇస్తుండటం వల్ల కోతలు జరుగుతున్నాయని, ఇది ఎట్టి పరిస్థితుల్లోనూ జరగకూడదని సీఎం స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాల్లోనే నాణ్యత పరిశీలన అనంతరం రైతులకు వెంటనే రశీదులు ఇవ్వాలని, రైస్ మిల్లుల వద్ద ఎలాంటి కోతలు ఉండకూడదని ఆదేశించారు. పంట రవాణా కోసం ఖాళీగా ఉన్న అన్ని వాహనాలు, ట్రాక్టర్లు, డీసీఎంలను పూర్తిస్థాయిలో వినియోగిం చాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల వద్ద టార్పాలిన్ కవర్లు సిద్ధంగా ఉంచాలని సూచించారు. తడిసిన ధాన్యం కొనుగోళ్లకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ప్రతి రైస్ మిల్లుకు కొనుగోళ్ల పర్యవేక్షణ కోసం సమర్థవంతమైన అధికారిని నియమించాలని, ఆయా అధికారులు ప్రతి రోజూ నివేదికలు పంపించాలని సీఎం ఆదేశించారు. కొనుగోళ్ల వ్యవహారంపై జిల్లా కలెక్టర్లు పూర్తి బాధ్యత తీసుకోవాలని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్లు సాధారణ విధానాన్ని విడిచి మిషన్ మోడ్‌లో పని చేయాలని, కేవలం కార్యాలయాలకు పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పర్యటించాలని సీఎం ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి పత్రికల్లో వచ్చే ప్రతికూల వార్తలను జిల్లా కలెక్టర్లు వెంటనే స్పందించి పరిష్కరించాలని సీఎం ఆదేశించారు. రిజాయిండర్లు క్రమం తప్పకుండా మీడియాకు పంపించాలని సూచించారు. తప్పుడు వార్తలను ఎదుర్కోవడంలో కొంతమంది అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు.

ప్రతికూల వార్తలపై వెంటనే స్పందించాలని, ప్రతి రోజు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి కొనుగోళ్ల పురోగతిని సమీక్షించాలని ఆదేశించారు. కొనుగోళ్ల అంశాన్ని తేలికగా తీసుకునే అధికారులపై వెంటనే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతిరోజూ వివిధ సమస్యలపై రైతులు రోడ్డెక్కుతున్న పరిస్థితి రావద్దని, రవాణా కోసం నిబంధనల ప్రకారం వాహనాలు ఇవ్వని ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సీఎం ఆదేశించారు. పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఈ యాసంగి సీజన్‌లో తెలంగాణ ప్రభుత్వం రికార్డు స్థాయిలో 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా నిర్ణయించిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కేవలం 52 లక్షల మెట్రిక్ టన్నుల లక్ష్యాన్ని మాత్రమే నిర్దేశించిందన్నారు. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 8,575 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 25 లక్షల 78 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు చెప్పారు.

ప్రస్తుతం కొనుగోలు కేంద్రాల వద్ద 11 లక్షల 52 వేల టన్నుల ధాన్యం పెండింగ్‌లో ఉందన్నారు. రైతులకు కనీస మద్దతు ధర చెల్లింపుల కోసం ఇప్పటివరకు రూ. 3,873 కోట్లను బ్యాంకుల ద్వారా విడుదల చేసినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 18 కోట్ల 68 లక్షల గన్నీ సంచులను అందుబాటులో ఉంచామని, ఎటువంటి కొరత లేదని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్లు హమాలీలు, రవాణా సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి సమస్యలు ఉన్నా వెంటనే ఫీడ్‌బ్యాక్ అందేలా వ్యవస్థ ఉండాలని సూచించారు. ధాన్యం కొనుగోళ్లపై జిల్లా కలెక్టర్లు పూర్తి బాధ్యత తీసుకోవాలని మంత్రి స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాల వద్ద గన్నీ సంచులు, హమాలీలు, రవాణా వాహనాల కొరత లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతులకు చెల్లింపులు వేగంగా జరిగేలా ట్యాబ్ ఎంట్రీలు వెంటనే పూర్తి చేయాలని సూచించారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ యాసంగి సీజన్‌లో భారీగా మొక్కజొన్న దిగుబడి వచ్చిందని, రైతులు ఇబ్బందులు పడకుండా కొనుగోళ్లు సజావుగా నిర్వహించాలని అన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం, మొక్కజొన్న తెలంగాణలోకి రాకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి ఆదేశించారు. అవసరమైన బందోబస్తు, విజిలెన్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. వర్షాల సూచనలపై ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తూ కొనుగోళ్ల వేగాన్ని పెంచాలని అధికారులను ఆదేశించారు.

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు మాట్లాడుతూ రాష్ట్రంలో పెద్ద ఎత్తున మొక్కజొన్న కొనుగోళ్లు జరుగుతున్నాయని తెలిపారు. రాబోయే ఒక నెల అత్యంత కీలకమని, రైతులకు ఎలాంటి నష్టం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. యాసంగి సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా 16 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న సాగు జరిగి, ఎకరానికి సగటున 25 క్వింటాళ్ల దిగుబడి వచ్చిందన్నారు. మొక్కజొన్న కొనుగోళ్ల కోసం రాష్ట్ర మంత్రివర్గం రూ. 4,178 కోట్లను ఆమోదించిందని తెలిపారు. ఇప్పటివరకు ప్రభుత్వం ద్వారా 8 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న కొనుగోలు జరగగా, ప్రభుత్వం కొనుగోళ్లు ప్రారంభించిన తర్వాత ప్రైవేట్ వ్యాపారులు కూడా అధిక ధరలకు మరో 6 లక్షల టన్నులు కొనుగోలు చేసినట్లు తెలిపారు. మొత్తం 14 లక్షల 90 వేల మెట్రిక్ టన్నుల నిల్వ అవసరం ఉండగా ఇప్పటికే 10 లక్షల టన్నుల నిల్వ సామర్థ్యాన్ని సిద్ధం చేసినట్లు చెప్పారు. అవసరమైన గన్నీ సంచులు అందుబాటులో ఉంచామని, అంతర్జాతీయ పరిస్థితుల కారణంగా సరఫరాలో కొంత అంతరాయం ఉన్నప్పటికీ ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రైతులు స్వయంగా గన్నీ సంచులు తీసుకువస్తే డీబీటీ ద్వారా చెల్లింపులు చేస్తున్నామని పేర్కొన్నారు.

హమాలీలు, గన్నీ సంచులు, నిల్వ సామర్థ్యం అంశాలపై కలెక్టర్లతో నిరంతర సమన్వయం కొనసాగుతోందని తెలిపారు. హమాలీ చార్జీలను ఒక్కో సంచికి రూ. 8.50కు పెంచినట్లు చెప్పారు. అవసరమైన రవాణా వాహనాలను కూడా సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు.

ఈ సమావేశంలో మెదక్ జిల్లా నుండి అదనపు కలెక్టర్ నగేష్, డి ఆర్ ఓ అంబాదాస్ రాజేశ్వర్, ఆర్డీఓ రమాదేవి జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్, సివిల్ సప్లై అధికారి నిత్యానంద, ట్రాన్స్ పోర్ట్ అధికారి వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు. అలాగే మహబూబాబాద్ జిల్లా నుండి అదనపు కలెక్టర్ రెవెన్యూ కె.అనిల్ కుమార్, డిఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, డిసిఓ వెంకటేశ్వర్లు, డీఎస్ఓ రమేష్, డిఎం సివిల్ సప్లై నరసింహారావు, డిఏఓ సరిత, డిఎం మార్కెటింగ్ వెంకటేశ్వర్లు, మెప్మా డీసీఎం విజయ, ఎంవిఐ సాయి చరణ్, మార్క్ఫెడ్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

# ఆనాటి జైళ్లు దుర్భరంగా ఉండేవి

## బ్రిటీష్ హయాంలో నరక కూపాలుగా జైళ్లు
## తానూ ఎమర్జెన్సీలో జైలుకు వెళ్లి వచ్చా
## చంచల్‌గూడాలో మ్యూజియం, ఫీల్ ది జైల్ ప్రారంభంలో గవర్నర్






(ప్రజాలక్ష్యం ప్రతినిధి)




హైదరాబాద్, మే 12 : స్వాతంత్ర్యానికి ముందు జైళ్లు ఎంత అమానవీయంగా ఉండేవో ప్రజలకు తెలియజేయాల్సి ఉందని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా తెలిపారు. మంగళవారం చంచల్‌గూడ జైలులో ఏర్పాటు చేసిన మ్యూజియం, ఫీల్ ది జైల్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా మాట్లాడుతూ.. స్వాతంత్రానికి పూర్వం జైల్లో గడిపిన వారు ఎలా ఉండేవారనే విషయం ఈ మ్యూజియంను చూస్తే తెలుస్తుందన్నారు. తెలంగాణ జైళ్ల శాఖ ఆధ్వర్యంలో మ్యూజి యం, ఫీల్ ది జైల్ ప్రారంభించడం తనకు చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ మ్యూజి యంలో ఉన్నది కేవలం ఇతిహాసానికి సంబంధించిన వస్తువులు కాదన్నారు. స్వాతంత్రానికి ముందు జైళ్లలో ఉన్నవారు ఎలాంటి పరిస్థితులు ఎదుర్కొన్నారో ఈ మ్యూజియం ద్వారా తెలుస్తుందని చెప్పారు. శిక్షల పేరుతో సంస్కారాన్ని, శరీరాన్ని, మనస్తత్వాన్ని విరగ్గొట్టే ప్రయత్నం చేశారని బ్రిటిష్ పాలనలో సాగిన అకృత్యాలను ఆయన వివరించారు. మన కోసం మన పూర్వీకులు పడ్డ కష్టాన్ని తెలుసుకునేందుకు ప్రతి ఒక్కరు ప్రయత్నం చేయాలని ప్రజలకు తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా సూచించారు. విద్యార్థి నాయకుడిగా ఉన్న సమయంలో తాను పలుమార్లు జైలుకు వెళ్లానన్నారు. ఎమర్జెన్సీ సమయంలో 21 రోజులు తాను జైల్లో ఉన్నానని ఆయన గుర్తు చేసుకున్నారు. అప్పుడే జైలు ఎలా ఉంటుందో తనకు తెలిసిందని వివరించారు. గతంలో ఉత్తరప్రదేశ్‌లో కళ్యాణ్ సింగ్ ప్రభుత్వం లో జైళ్ల శాఖ మంత్రిగా తాను పని చేశానని తెలంగాణ గవర్నర్ గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా జైళ్లలో తాను పలు సంస్కరణలు తీసుకొచ్చానని తెలిపారు. ఈ సంస్కరణలతో ఖైదీలు సంతోషం వ్యక్తం చేశారని చెప్పారు. ఈ రోజు మ్యూజియంలో చూసిన దృశ్యాలతో.. మళ్లీ ఆనాటి జ్ఞాపకాలు తనకు గుర్తుకు వచ్చాయన్నారు. ఖైదీలలో ప్రతి ఒక్కరూ క్రిమినల్స్ కాదని.. పరిస్థితులు వారిని ఆ సమయంలో నిందితులుగా మార్చాయని వివరించారు. ఖైదీలలో మార్పు తీసుకురావడానికి అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకోవాలని జైలు అధికారులకు గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా సూచించారు. మరోసారి తప్పుచేసే ఆలోచన రాకుండా ఖైదీల్లో పరివర్తన తీసుకురావాలని అధికారులకు స్పష్టం చేశారు. సాధారణ ప్రజల కోసం చంచల్‌గూడ జైలు అధికారులు వినూత్న ప్రయోగానికి శ్రీకారం చుట్టారు. జైలు ఆవరణలో 'జైల్ మ్యూజియం', 'ఫీల్ ది జైల్' పేరుతో ప్రత్యేక బ్లాక్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల ప్రారంభించారు. ఇప్పటికే గోవా, కోల్‌కతా వంటి ప్రాంతాల్లో జైలు మ్యూజియాలు ఉన్నాయి. తాజాగా హైదరాబాద్‌లోని చంచల్‌గూడ జైలు కూడా ఈ జాబితాలో చేరింది. జైల్ మ్యూజియంలో జైలు చరిత్ర, ఉపయోగించిన పాత వస్తువులు, ఖైదీల జీవితం, శిక్షల విధానాలు వంటి అంశాలను ప్రదర్శించనున్నారు. ఇది విద్యార్థులు, పర్యాటకులు, సాధారణ ప్రజలకు జైలు వ్యవస్థ గురించి అవగాహన కల్పించడానికి ఉపయోగపడనుంది. 'ఫీల్ ది జైల్' బ్యారక్ ద్వారా సాధారణ ప్రజలు ఒకరోజు జైలు జీవితాన్ని అనుభవించేలా జైలు అధికారులు అవకాశం కల్పించారు. ఫీజు చెల్లించి రిజర్వేషన్ చేసుకున్నవారు జైలు రూల్స్ ప్రకారం ఒక రోజు బ్యారక్‌లో ఉండి, జైలు ఆహారం, రొటీన్ కార్యకలాపాలు, శిక్షల వాతావరణాన్ని అనుభవించవచ్చు. ఇది జైలు జీవితం ఎంత కష్టమో అర్థం చేసుకోవడానికి సహాయపడు తుందని అధికారులు తెలిపారు.

# నగరంలో మూడు చోట్ల చైన్ స్నాచింగ్‌లు

## ఆందోళనలో స్థానిక ప్రజలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

వరంగల్, మే 12 : జిల్లాలో చైన్ స్నాచర్లు, పోకిరీల రెచ్చిపోతున్నారు. సోమవారం రాత్రి మూడు చోట్ల చైన్ స్నాచింగ్ సంఘటనలు చోటు చేసుకున్నాయి. ఒక వ్యక్తితో సహా ఇద్దరు మహిళల మెడలో బంగారు గొలుసులను దొంగలు తెంచుకెళ్లారు. ఈ సంఘటనలు స్థానికులను తీవ్ర భయాందోళనకు గురిచేస్తున్నాయి. వరంగల్ మిల్స్ కాలనీలో పోకిరీలు హంగామా సృష్టించారు. రాత్రి సమయంలో కొందరు యువకులు బైక్‌లపై తిరుగుతూ ప్రజలను భయపెడుతున్నట్లు తెలుస్తోంది. కాలనీలోని ఓ టీ స్టాల్ యజమానిపై పోకిరీలు దాడి చేశారు. దాడిలో టీ స్టాల్ యజమాని తీవ్రంగా గాయపడ్డాడని, అతన్ని స్థానికులు ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం. నగరంలో పోలీసు పెట్రోలింగ్ పూర్తిగా కనిపించడం లేదని ప్రజలు తీవ్రంగా విమర్శలు గుప్పిస్తున్నారు. రాత్రి సమయంలో మహిళలు, వృద్ధులు ఒంటరిగా బయటకు రావడానికి భయపడుతున్న పరిస్థితి నెలకొందని స్థానికులు వాపోతున్నారు. రాత్రి సమయాల్లో గట్టి నిఘా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ములుగు జిల్లా మంగపేట మండలం కమలాపురంలో దొంగలు బీభత్సం సృష్టించారు. రాత్రి ఓ ఇంటి తాళాలు పగలగొట్టిన దుండగులు బంగారు నగలు, వెండిని అపహరించారు. ఇంటి యజమాని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# బీదర్ సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం

## బైకును ఢీకొని బోల్తాపడ్డ కర్నారటక ఆర్టీసీ బస్సు
## ప్రమాదంలో ముగ్గురు మృతి... ఇద్దరు సంగారెడ్డి వాసులు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

సంగారెడ్డి, మే 12 : కర్ణాటకలోని బీదర్ సమీపంలో మంగళవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రహదారిపై వెళ్తున్న బైక్‌ను కర్ణాటక రోడ్డు రవాణా సంస్థకు చెందిన బస్సు ఢీ కొట్టింది. అనంతరం ఆర్టీసీ బస్సు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఐదుగురు ప్రయాణికులు అక్కడికక్కడే మరణించారు. మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. అదే రహదారిపై వెళ్తున్న వాహనదారులు వెంటనే స్పందించి.. పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వెంటనే ఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను బీదర్‌లోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వారిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు వెల్లడించారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుల్లో ఇద్దరు సంగారెడ్డి జిల్లా వాసులు ఉన్నారని పోలీసులు వివరించారు. బీదర్ నుంచి ఆర్టీసీ బస్సు హైదరాబాద్ వస్తుండగా ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు చెప్పారు. మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్ట్‌మార్టం నిమిత్తం బీదర్ ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంపై మృతుల కుటుంబ సభ్యులకు పోలీసులు సమాచారం అందించారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యోగపై అవగాహన కార్యక్రమం

## నిత్యజీవితంలో యోగాసనాల ప్రాముఖ్యత వివరించిన మందాల చైతన్య సుధా

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మంచిర్యాల, మే 12 : మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 99 రోజుల ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా, సీసీఈ హైదరాబాద్ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న విద్యాశాఖ వారోత్సవాలలో రెండవ రోజు యోగపై అవగాహన కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జై కిషన్ ఓజా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి అతిథిగా యోగ గురువు మందాల చైతన్య సుధా హాజరై నిత్యజీవితంలో యోగ పాత్ర, యోగాసనాల ప్రాముఖ్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ యోగాసనాలను ప్రతిరోజూ అభ్యసించడం ద్వారా శారీరక ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు మానసిక ప్రశాంతత, ఏకాగ్రత పెరుగుతాయని తెలిపారు. వివిధ యోగాసనాలను ప్రదర్శిస్తూ వాటి వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను వివరించారు. యోగా అనేది ప్రతి మనిషి నిత్యజీవితంలో ఒక నిత్యావసరంగా మార్చుకుని, ప్రతిరోజూ ఆచరించాలని సూచించారు.



ఈ కార్యక్రమానికి ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మంచిర్యాల జిల్లా జనరల్ సెక్రటరీ చందూరి మహేందర్ హాజరయ్యారు. అనంతరం ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జై కిషన్ ఓజా అతిథులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# హైకోర్టును ఆశ్రయించిన బండి భగీరథ్

## 14న విచారించనున్న వెకేషన్ బెంచ్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మే 12 : కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ హైకోర్టును ఆశ్రయించారు. పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన పోక్సో కేసులో మధ్యంతర బెయిల్ కోరుతూ బండి భగీరథ్ పిటిషన్ దాఖలు చేశారు. హైకోర్టుకు వేసవి సెలవులు కావడంతో వెకేషన్ బెంచ్‌లో పిటిషన్ వేశారు. పిటిషన్‌పై ఈ నెల 14న హైకోర్టు వెకేషన్ బెంచ్ విచారణ జరిపే అవకాశం ఉంది. అయితే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు బండి భగీరథ్ కేసుపై ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేస్తూ డీజీపీ సీవీ ఆనంద్ ఆదేశాలు జారీ చేశారు. ఈ కేసు సున్నితమైనది కావడంతో మహిళా ఐపీఎస్ అధికారిణి పర్యవేక్షణలో దర్యాప్తు కొనసాగించాలని డీజీపీ నిర్ణయించారు. ఇప్పటికే బాధితురాలి స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేయడం జరిగింది. సిట్ ఏర్పాటు నేపథ్యంలో మరోసారి స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేసే అవకాశం ఉంది. మరోవైపు బండి భగీరథ్ కోసం పోలీసుల గాలింపు కొనసాగుతోంది. ఈ కేసుకు సంబంధించి అన్ని ఆధారాలను సేకరిస్తున్నామని, నేరం రుజువైతే నిందితుడిని కచ్చితంగా అరెస్ట్ చేస్తామని కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్ స్పష్టం చేశారు.

# సింగరేణి మెడికల్ బోర్డు పునరుద్ధరణకు యాజమాన్యం హామీ



## - ఐఎన్టీయూసీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బి.జనక్ ప్రసాద్
## - కార్మికుల సమస్యలపై మంత్రులు, అధికారులతో చర్చలు

(ప్రజాలక్ష్యం ప్రత్యేక ప్రతినిధి)

హైదరాబాద్, మే 12 : సింగరేణి కార్మికుల్లో ఇటీవల నెలకొన్న అనిశ్చితి పరిస్థితుల నేపథ్యంలో ఐఎన్టీయూసీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బి.జనక్ ప్రసాద్ నాయకత్వంలో ముఖ్య నేతల బృందం హైదరాబాద్‌లో పలువురు మంత్రులు, ఉన్నతాధికారులతో విస్తృత స్థాయి చర్చలు జరిపింది. చర్చలకు సంబంధించిన వివరాలను జనక్ ప్రసాద్ మీడియాకు విడుదల చేశారు. ఐఎన్టీయూసీ బృందం ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ప్రభుత్వ సలహాదారు వెం నరేందర్ రెడ్డిని కలిసి సింగరేణి కార్మికుల సమస్యలను వివరించినట్లు తెలిపారు. అనంతరం సింగరేణి సంస్థ సిఎండి బుద్ధ ప్రకాశ్ జ్యోతి, కార్మిక సంక్షేమ విభాగం డైరెక్టర్ గౌతమ్ పోట్రుతో సమావేశమై పలు కీలక అంశాలపై చర్చించినట్లు ఆయన పేర్కొన్నారు. చర్చల్లో ప్రధానంగా మెడికల్ బోర్డు పునరుద్ధరణ, గతంలో నిర్వహించిన రెండు మెడికల్ బోర్డులపై సమీక్ష, కార్మికుల అలవెన్సులపై ఆదాయపు పన్ను రద్దు, సొంత ఇంటి పథకం అమలు, శిక్షణ పూర్తి చేసిన అభ్యర్థులకు నియామక పత్రాల పంపిణీ, మారుపేర్ల మార్పు, విధుల నుంచి తొలగించిన కార్మికుల సమస్యల పరిష్కారం, కొత్త బొగ్గు గనుల ప్రారంభం, విజిలెన్స్ కేసుల పరిష్కారం, పెండింగ్ బకాయిల చెల్లింపు వంటి అంశాలు ప్రస్తావనకు వచ్చినట్లు జనక్ తెలిపారు. ఈ అంశాలపై యాజమాన్యం సానుకూలంగా స్పందించిందని డాక్టర్ బి.జనక్ ప్రసాద్ వెల్లడించారు. ముఖ్యంగా మెడికల్ బోర్డు పునరుద్ధరణతో పాటు గత రెండు బోర్డులపై సమీక్ష నిర్వహించేందుకు హామీ ఇచ్చినట్లు తెలిపారు. అలాగే కార్మికుల అలవెన్సులపై విధిస్తున్న ఆదాయపు పన్ను మాఫీ అంశాన్ని కూడా సానుకూలంగా పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు. సొంత ఇంటి పథకం అమలుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి ప్రభుత్వంతో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని యాజమాన్యం హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ సమావేశాల్లో ఇంటక్ కేంద్ర సీనియర్ ఉపాధ్యక్షులు నరసింహ రెడ్డి, ధర్మపురి, కాంపెల్లి సమ్మయ్య, త్యాగరాజన్, జెట్టి శంకర్ రావు, ప్రధాన కార్యదర్శి వికాస్ కుమార్ యాదవ్, ప్రధాన వ్యవస్థాపక కార్యదర్శి నరేందర్, ఉపాధ్యక్షులు దాస్, కోట రవీంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జనగణనలో ఎన్యూమరేటర్లకు ప్రజలు పూర్తి సహకారం అందించాలి



## - ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్
## - సెన్సస్-2027 ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలి
## - అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖమ్మం, మే 12 : దేశ అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనలో కీలకమైన సెన్సస్-2027 హౌస్ లిస్టింగ్ కార్యక్రమం సోమవారం నుంచి ప్రారంభమైందని, ఇంటింటికి వచ్చే ఎన్యూమరేటర్లకు ప్రజలు పూర్తి సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ కోరారు. వైరా నియోజకవర్గ పరిధిలోని కొణిజర్ల మండల కేంద్రంలో జరుగుతున్న జనగణన ప్రక్రియను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామంలోని ఎస్సీ కాలనీలు సహా పలు ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి సేకరిస్తున్న జనాభా, కుటుంబ వివరాల నమోదును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సూపర్వైజర్లు, ఎన్యూమరేటర్లు, వార్డ్ అధికారులు నిర్వహిస్తున్న సర్వే విధానంపై వివరణ తీసుకుని పలు సూచనలు చేశారు. ప్రతి ఇంటి వివరాలను ఖచ్చితత్వంతో నమోదు చేయాలని, ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా సర్వే నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జనగణన ద్వారా సేకరించే సమాచారం ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, భవిష్యత్ అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనకు కీలక ఆధారంగా ఉపయోగపడుతుందని తెలిపారు. జనాభా, కుటుంబాల సామాజిక-ఆర్థిక పరిస్థితులు, విద్య, ఉపాధి, నివాస సదుపాయాలు, మౌలిక వసతులు తదితర అంశాలపై సమగ్ర సమాచారం అందుబాటులోకి రావడం ద్వారా ప్రజల అవసరాలకు అనుగుణంగా పథకాలు రూపొందించేందుకు ప్రభుత్వానికి వీలు కలుగుతుందని పేర్కొన్నారు. జనగణనలో సేకరించే ప్రతి సమాచారం పూర్తిగా గోప్యంగా ఉంచబడుతుందని, వ్యక్తిగత వివరాలను ఇతర అవసరాలకు వినియోగించబోమని స్పష్టం చేశారు. ప్రజలు ఎటువంటి అపోహలకు లోనుకాకుండా జనగణన సిబ్బందికి స్వచ్ఛందంగా సహకరించాలని కోరారు. "మన సమాచారం-మన భవిష్యత్తు" అనే భావనతో ప్రతి పౌరుడు జనగణనలో చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. దేశ ప్రగతికి ఖచ్చితమైన గణాంకాలు ఎంతో అవసరమని, సమగ్ర గణాంకాల ఆధారంగానే అభివృద్ధి కార్యక్రమాలు సమర్థవంతంగా అమలవుతాయని తెలిపారు. జిల్లాలోని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ జనగణన ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహన పెంచాలని ఆదేశించారు. గ్రామ పంచాయతీలు, మండలాలు, మున్సిపాలిటీలు, పట్టణ ప్రాంతాల్లో ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. విద్యాసంస్థలు, స్వయం సహాయక సంఘాలు, యువజన సంఘాలు, స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో విస్తృత ప్రచారం చేపట్టాలని తెలిపారు. జనగణన సిబ్బంది ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, ఇంటింటికి వెళ్లే సమయంలో అధికారిక గుర్తింపు కార్డులు ధరించాలని సూచించారు. ప్రజలు అడిగే సందేహాలకు స్పష్టమైన సమాధానాలు ఇవ్వడంతో పాటు సమాచార సేకరణలో పూర్తి పారదర్శకత పాటించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీపీవో శ్రీనివాస్, తహసీల్దారు అరుణ, ఎంపీఓ ఉపేంద్రయ్య, గ్రామ సర్పంచ్ బూదె పుష్పవతి ఉపేందర్, వివిధ శాఖల అధికారులు, సిబ్బందిలు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ చట్ట రక్షణకు మే 15న గ్రామీణ సమ్మె

## డీఆర్‌డీఓకు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సమ్మె నోటీసు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

యాదాద్రి-భువనగిరి, మే 12 : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని బలహీనపరిచే విధంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన విబి-జి రాంజీ చట్టాన్ని వెంటనే రద్దుచేసి, పాత చట్టాన్నే కొనసాగించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేశారు. ఉపాధి హామీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 15న దేశవ్యాప్తంగా నిర్వహించనున్న గ్రామీణ సమ్మె (బంద్)కు సహకరించాలని కోరుతూ సోమవారం జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి టి. నాగిరెడ్డికి సంఘం నాయకులు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు బొల్లు యాదగిరి, ప్రధాన కార్యదర్శి కొండమడుగు నర్సింహ, జిల్లా ఉపాధ్యక్షుడు, చీమలకొండూరు సర్పంచ్ పల్లెర్ల అంజయ్య మాట్లాడుతూ గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తున్న ఉపాధి హామీ కార్మికులు ప్రస్తుతం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త విధానాలతో కార్మికుల హక్కులు హరించబడుతున్నాయని విమర్శించారు. పనికి వెళ్లిన తర్వాత ఎంత కూలి వస్తుందో, చేసిన పనికి ఎప్పుడు వేతనం చెల్లిస్తారో తెలియని పరిస్థితి నెలకొందని, దీంతో కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలని, సంవత్సరానికి 200 రోజుల పని కల్పించి రోజువారీ కూలీని రూ.800కు పెంచాలని డిమాండ్ చేశారు. రోజుకు రెండుసార్లు ఫోటోలు తీసే ఈ-కేవైసీ విధానాన్ని రద్దుచేయాలని, పని ప్రదేశాల్లో తాగునీరు, టెంట్లు, మెడికల్ కిట్ వంటి కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు. ప్రమాదాలు జరిగితే ఉచిత వైద్యం, కార్మికులకు బీమా సదుపాయం, పనిముట్లు అందించాలని పేర్కొన్నారు. అలాగే ఉపాధి హామీ నిధుల్లో కేంద్ర ప్రభుత్వం 90 శాతం వాటా భరించాలని, పట్టణ ప్రాంతాల్లో కూడా ఉపాధి హామీ పనులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధన కోసం మే 15న నిర్వహించే గ్రామీణ సమ్మెలో ఉపాధి హామీ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని సంఘం నాయకులు పిలుపునిచ్చారు.



# విద్యా వారోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలి



## - భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్
## - పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు
## - వేసవి శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, మే 12 : పజాపాలన ప్రగతి ప్రణాళిక-99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాలు సోమవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ జూలూరుపాడు మండలంలో విస్తృతంగా పర్యటించి పాఠశాలల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించడంతో పాటు పలు నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేశారు. ముందుగా జూలూరుపాడు మండలం దండు తండా మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సుమారు రూ.2 లక్షల వ్యయంతో చేపట్టనున్న బాలుర మరుగుదొడ్ల నిర్మాణ పనులకు జిల్లా కలెక్టర్ శంకుస్థాపన చేశారు. స్వయంగా పలుగు పట్టి గుంత తవ్వి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పాఠశాలల్లో పరిశుభ్రత, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. విద్యార్థులకు మెరుగైన వాతావరణంలో విద్య అందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అనంతరం పాపకొల్లు పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించిన కలెక్టర్, అక్కడ చేపట్టనున్న ఇంకుడు గుంతల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. పాఠశాలలో నిర్వహిస్తున్న వేసవి శిబిరాన్ని పరిశీలించి విద్యార్థులతో ముచ్చటించారు. శిబిరాల్లో చురుకుగా పాల్గొంటూ కొత్త విషయాలు నేర్చుకోవాలని విద్యార్థులను ప్రోత్సహించారు. ఈ సందర్భంగా పదవ తరగతి ఫలితాల్లో మండల స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థిని పూజితను కలెక్టర్ అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. క్రమశిక్షణతో చదివితే ఉన్నత లక్ష్యాలను సాధించవచ్చని విద్యార్థులకు సూచించారు. జూలూరుపాడు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, కళాశాలలో నిర్వహిస్తున్న వేసవి శిబిరాన్ని కూడా కలెక్టర్ ప్రారంభించారు. శిబిరంలో మ్యూజిక్, డాన్స్, పెయింటింగ్, కంప్యూటర్ స్కిల్స్, బేసిక్ కోడింగ్, స్పోకెన్ ఇంగ్లీష్, స్పీడ్ మాథ్స్, క్రీడలు, యోగా తదితర అంశాల్లో ప్రత్యేక శిక్షణ అందిస్తున్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. శిబిరంలో పాల్గొంటున్న విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడి వారికి కల్పిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. వేసవి సెలవులను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు తమలోని సృజనాత్మకతను పెంపొందించుకోవాలని సూచించారు. విద్యతో పాటు కళలు, క్రీడలు, సాంకేతిక నైపుణ్యాలపై కూడా దృష్టి పెట్టాలని తెలిపారు. పాఠశాలల అభివృద్ధి, విద్యార్థుల ప్రతిభా వికాసం కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందని, విద్యా వారోత్సవాల ద్వారా పాఠశాలల్లో మౌలిక వసతులు, బోధనా ప్రమాణాలు మరింత మెరుగుపడతాయని జిల్లా కలెక్టర్ అంకిత్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా విద్యాశాఖ అధికారి నాగలక్ష్మి, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంఈఓలు, సర్పంచులు, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, ప్రధానోపాధ్యాయులు ఎస్కే మీరా సాహెబ్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమంగా జంతువులను తరలిస్తే కఠిన చర్యలు తప్పవు



## - భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్ రాజు -బక్రీద్ పండుగ నేపథ్యంలో జిల్లాలో ప్రత్యేక నిఘా

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, మే 12 : రాబోయే బక్రీద్ పండుగ సందర్భంగా జిల్లాలో శాంతిభద్రతలను పటిష్టంగా అమలు చేయడంలో భాగంగా అక్రమంగా జంతువులను తరలించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు హెచ్చరించారు. ఈ మేరకు ఆయన సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఇతర శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ అక్రమ జంతు రవాణాను అరికట్టేందుకు పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. జిల్లా వ్యాప్తంగా చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న పశువుల సంతలు, బక్రీద్ పండుగ దృష్ట్యా ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల పనితీరుపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. చట్టవిరుద్ధంగా ఆవులు, దూడలను రవాణా చేయడం, వధించడం పూర్తిగా నిషేధమని, అలాంటి చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి జరిగే అక్రమ జంతు రవాణాను అడ్డుకునేందుకు రెండు అంతర్రాష్ట్ర, మూడు అంతర్‌జిల్లా చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి మొత్తం ఐదు చెక్‌పోస్టుల వద్ద 24 గంటల నిరంతర నిఘా కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ప్రతి చెక్‌పోస్టులో పోలీస్ సిబ్బందితో పాటు పశుసంవర్ధక శాఖ అధికారులు సంయుక్తంగా విధులు నిర్వహిస్తూ వాహనాల తనిఖీలు చేపడుతున్నారని వెల్లడించారు. జంతువుల రవాణా సమయంలో సంబంధిత చట్టాలు, నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. చెల్లుబాటు అయ్యే పత్రాలు లేకుండా పశువులను తరలించే వారిపై ఎలాంటి రాజీ లేకుండా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమ రవాణాను అడ్డుకునే పేరుతో ఎవరూ చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దని, వ్యక్తిగత దాడులు లేదా గుంపులుగా దాడులకు పాల్పడటం కూడా శిక్షార్హ నేరమని ప్రజలకు సూచించారు. పశువుల అక్రమ రవాణా లేదా అనుమానాస్పద కార్యకలాపాలపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. యువత ఆవేశానికి లోనుకాకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, మత పెద్దలు శాంతి, సామరస్యాలపై అవగాహన కల్పించాలని సూచించారు. వాట్సాప్, ఫేస్‌బుక్ వంటి సోషల్ మీడియా వేదికల్లో విద్వేషాలను రెచ్చగొట్టేలా మార్ఫింగ్ ఫొటోలు, అసత్య ప్రచారాలు, ప్రేరేపిత పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇందుకోసం జిల్లా పోలీస్ మీడియా మానిటరింగ్ సెల్ నిరంతర నిఘా కొనసాగిస్తోందని తెలిపారు. ప్రజల్లో భయాందోళనలు కలిగించే రూమర్లను వ్యాప్తి చేసిన వారిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్-100 లేదా సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని సూచించిన ఎస్పీ, ప్రతి పండుగను ప్రజలు పరస్పర మతాలను గౌరవించుకుంటూ శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని ఆకాంక్షించారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు పోలీసులకు పూర్తి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

# భూపాలపల్లి ఏరియా బీసీ-ఓబీసీ లైజన్ ఆఫీసర్‌గా సిలివేరి మురళీమోహన్

## సన్మానించిన ఏరియా జిఎం ఏనుగు రాజేశ్వర్ రెడ్డి



(ప్రజాలక్ష్యం ప్రత్యేక ప్రతినిధి)

జయశంకర్-భూపాలపల్లి, మే 12 : భూపాలపల్లి ఏరియా సింగరేణి బీసీ-ఓబీసీ లైజన్ ఆఫీసర్‌గా ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ సిలివేరి మురళీమోహన్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన భూపాలపల్లి ఏరియా సింగరేణి జీఎం కార్యాలయంలో ఏరియా జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జీఎం మురళీమోహన్‌ను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి బీసీ-ఓబీసీ జనరల్ సెక్రటరీ, కార్పొరేటర్ నల్లపురి రమేష్‌తో పాటు వివిధ ఏరియాలకు చెందిన లైజన్ ఆఫీసర్లు పాల్గొని ఏరియా జీఎంను కలిశారు. ఈ సందర్భంగా సిలివేరి మురళీమోహన్ మాట్లాడుతూ, తన నియామకానికి సహకరించిన సింగరేణి సీఎండీ జ్యోతి బుద్ధ ప్రసాద్, డైరెక్టర్ (పా) గౌతమ్ పోట్రుకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే రోజుల్లో బీసీ-ఓబీసీ కార్మికుల సంక్షేమం కోసం తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ-ఓబీసీ నాయకులు, సింగరేణి ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.




# విద్యార్థినుల భవిష్యత్తుకు మెరుగైన వసతులు కల్పిస్తాం

## కలెక్టర్ కె.హరిత

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆసిఫాబాద్, మే 12 : ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మౌలిక వసతులకు కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ కె.హరిత అన్నారు సోమవారం రెబ్బెన మండలంలోని గంగాపూర్ గ్రామంలోని కస్తూరి గాంధీ బాలికల విద్యాలయంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా విద్యా వారోత్సవలలో భాగంగా ఏర్పాటు చేసిన అదనపు తరగతుల గదుల నిర్మాణనికి బాలికలకు ప్రత్యేక టాయిలెట్లు నిర్మాణం పనులను ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవా లక్ష్మితో కలిసి కలెక్టర్ కె.హరిత భూమి పూజ నిర్వహించారు అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమములో కలెక్టర్ మాట్లాడు తూ ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వ ప్రధాన ధ్యేయమన్నారు అందరికీ విద్యను అందించడం మే ప్రధాన కర్తవ్యమని అన్నారు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యనుగుణంగా అదనపు తరగతీ గదుల నిర్మాణనికి చర్యలు తీసుకుంటూ న్నమన్నారు నీతి అయోగ్ ఆద్వర్యములో కేంద్ర ప్రభుత్వం ప్రతి పాఠశాలలో బాలికల కొరకు ప్రత్యేక టాయిలెట్ గదుల నిర్మాణం చేపట్టడనికి చర్యలు తీసుకుంటున్నామన్నారు సి ఎస్ ఆర్ , ఉ పాధి హామీ, సర్వ శిక్ష అభియాన్ నిధులతో జిల్లాలోని ప్రతి పాఠశాలలో మౌలిక వసతులు కల్పనకు చర్యలు తీసుకుంటున్నామన్నారు పాఠశాలలో సరైన స్థలం లేనిచోట ప్రి ఫాబ్రిక్ టాయిలెట్ గదులను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు కస్తూరి గాంధీ భాలిక విద్యాలయంలో విద్యార్థినిలకు వేసవి శిబిరాలను ఏర్పాటు చేయడం ద్వారా క్రీడలు డ్రాయింగ్ చిత్రలేఖనం వంటి వాటిపై శిక్షణ ద్వారా మేలుకువలు సాధించవచ్చు అన్నారు పదవ తరగతి, ఇంటర్ అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు కోచింగ్ వసతులను కల్పించడం జరిగిందన్నారు విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు ఎమ్మెల్యే కోవా లక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో చదివి విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించడానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు అనంతరం మండలంలోని తుంగేడ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో ఏర్పాటుచేసిన ప్రి ఫాబ్రిక్ టాయిలెట్ గదిని ప్రారంభించారు అనంతరం సర్పంచ్ తో ఎన్నికైనతరం గ్రామంలో ఏం పనులు చేపట్టారని సమస్యలను అడిగి తెలుసుకున్నారు గ్రామానికి తన వంతు కృషి చేస్తానని కలెక్టర్ పేర్కొన్నారు ఈ కార్యక్రములో సర్పంచులు పిఎసిఎస్ అధ్యక్షులు కర్నాథం సంజీవ్ తాసిల్దార్ సూర్యప్రకాష్ ఎంపీడీవో శంకరమ్మ ఉపాధ్యక్షులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# తేమ పేరుతో రైతులను వేధించడం దారుణం

## - 16 రోజులుగా ధాన్యం కొనుగోలు లేక రైతుల అవస్థలు
## - వీరవెల్లి ఐకేపీ కేంద్రంలో పైళ్ల శేఖర్ రెడ్డి ఆగ్రహం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



యాదాద్రి-భువనగిరి, మే 12 : తేమ, మాచర్ పేరుతో రైతులను రోజుల తరబడి ఇబ్బందులకు గురిచేయడం దారుణమని భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి ప్రభుత్వంపై మండిపడ్డారు. భువనగిరి మండలం వీరవెల్లి గ్రామంలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడిన ఆయన..16 రోజులుగా ధాన్యం కొనుగోళ్లు నిలిచిపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తేమ ఎక్కువగా ఉందని, మాచర్ రావడం లేదనే సాకులతో ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడం రైతుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. పండించిన పంటను కొనుగోలు కేంద్రాల వద్ద కాపలా కాస్తూ రైతులు నానా ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతుల ధాన్యాన్ని కొనుగోలు చేసి వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రైతులను ఇబ్బందులకు గురిచేసే విధానాలను వెంటనే విరమించుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ భువనగిరి మండల అధ్యక్షుడు, తుక్కాపురం సర్పంచ్ జనగాం పాండు, మాజీ సింగిల్ విండో చైర్మన్ బాల్గురి మధుసూదన్ రెడ్డి, మాజీ ఎంపీపీ కేశపట్నం రమేష్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు జక్కా రాఘవేందర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ తోటకూరి శంకరయ్య, మాజీ ఎంపీటీసీ కంచు మల్లయ్య, చింతల శ్రీనివాస్ రెడ్డి, ర్యాకల శ్రీనివాస్, పుట్ట వీరేష్, చింతల వెంకటరెడ్డి, రేగు శ్రీశైలం, కటిక జంగయ్య, రాసాల శేఖర్ యాదవ్, బాత్కా అశోక్, కడారి బాలు యాదవ్ తదితరులతో పాటు రైతులు పాల్గొన్నారు.




# ధాన్యం తరలింపులో జాప్యం వద్దు

## జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

నిర్మల్, మే 12 : కొనుగోలు కేంద్రాల నుంచి వరి ధాన్యం తరలింపు ప్రక్రియలో ఎలాంటి ఆలస్యం జరగకూడదని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ధాన్యం సేకరణ, రవాణాపై సంబంధిత శాఖల అధికారు లతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలని, కొనుగోలు కేంద్రాల్లో ఎక్కువకాలం నిల్వ ఉంచరాదని స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో ధాన్యం రాక మరింత పెరిగే అవకాశం ఉన్నందున ముందస్తు ప్రణాళికతో అదనపు లారీలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. అవసరానికి తగ్గట్టుగా రవాణా వాహనాలను అందుబాటులో ఉంచుకోవాలని, ధాన్యం లోడింగ్, అన్‌లోడింగ్ పనులకు సరిపడా హమాలీలను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ప్రతిరోజూ ఎంత ధాన్యం తరలించారనే వివరాలను ఎప్పటికప్పుడు నివేదించాలని ఆదేశించారు. ఇప్పటివరకు జరిగిన ధాన్యం తరలింపు ప్రక్రియ, కొనుగోలు కేంద్రాల్లో సిద్ధంగా ఉన్న నిల్వల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, పౌర సరఫరాల శాఖ అధికారులు రాజేందర్, సుధాకర్, డీఆర్‌డీఓ విజయలక్ష్మి, లారీ ట్రాన్స్‌పోర్ట్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాలక్ష్యం

బుధవారం 13 మే, 2026

## లక్షల మంది విద్యార్థుల కలలు కల్లలు

మొదటిపేజీ తరువాయి

విమర్శించారు. ప్రతిసారి పేపర్ మాఫియా తప్పించుకుంటోందని, నిజాయతీగా చదివిన విద్యార్థులే శిక్ష అనుభవిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కష్టం కాదు.. డబ్బు, పరిచయాలే భవిష్యత్తును నిర్ణయిస్తే విద్యకు అర్థమేంటి? ప్రధాని చెప్పే అమృత కాలం దేశ యువతకు విష కాలంగా మారింది' అని రాహుల్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. విద్యా వ్యవస్థలో పారదర్శకత తీసుకురావాలని, పరీక్షల నిర్వహణలో కఠిన చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు

## నేషనల్ డెయిరీతో నార్ముల్ ఒప్పందం

మొదటిపేజీ తరువాయి

రైతుల బకాయిలను చెల్లించేందుకు రూ.10 కోట్ల రూపాయలను చెల్లించనుంది. ఈ మేరకు ఎన్‌డిబి అధికారులతో తెలంగాణ రాష్ట్ర డెయిరీ విభాగం అధికారులు ఒప్పందాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పశుసంవర్ధక, పాడిపారిశ్రామికాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, పశుసంవర్ధక, డెయిరీ, ఫిషరీస్ సెక్రటరీ ఇలంబర్తి, మదర్ డెయిరీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, ఔజఆ అధికారులు పాల్గొన్నారు.

## బండి కుమారుడిని తప్పించే యత్నం

మొదటిపేజీ తరువాయి

నెలలుగా ఫిర్యాదు తీసుకోకుండా తాత్సారం చేయడం వెనుక రాజకీయ ఒత్తిడి ఉందని వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. మీడియాలో వార్తలు వచ్చిన వెంటనే గత్యంతరం లేక పోలీసులు కేసు నమోదు చేశారని తెలిపారు. పోక్సో కేసులో బాధితురాలికి రక్షణ కల్పించాల్సింది పోయి.. ఆమెపైనే హనీట్రాప్ కేసు పెట్టడం దారుణమని మండిపడ్డారు. మైనర్ బాలిక హనీట్రాప్ చేస్తుందా అని ప్రశ్నించారు. బాధితురాలిపైనే రివర్స్ కేసులు పెట్టడం చూస్తుంటే రేవంత్ రెడ్డి, బండి సంజయ్ ఒక్కటేనని అర్థమవుతుందని అన్నారు. బాధితురాలిపైనే రివర్స్ కేసులు పెట్టడం చూస్తుంటే రేవంత్ రెడ్డి, బండి సంజయ్ ఒకటేనని అర్థమవుతోందని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, కేంద్రమంత్రి బండి సంజయ్‌ది ఫెవికాల్ బంధమని విమర్శించారు. వీళ్లిద్దరు కలిసి వ్యాపారాలు చేస్తున్నారని, కుంభకోణాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అందుకే కేంద్రమంత్రి కొడుకుపై ఇంత పెద్ద నేరం మోపబడినా ప్రభుత్వం మిన్నకుండిపోయిందని అన్నారు. ఒక్క కాంగ్రెస్ నాయకుడు కూడా దీనిపై స్పందించకపోవడం వెనుక మర్మమేంటని ప్రశ్నించారు. పొద్దున లేస్తే కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు మీద విషం చిమ్మే బండి సంజయ్.. తన కొడుకు చేసిన నేరంపై ఏం సమాధానం చెబుతారని వేముల నిలదీశారు. తన కొడుకుపై వచ్చిన పోక్సో కేసుపై నైతిక బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. పోక్సో కేసులో నిందితుడైన బండి భగీరథ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని.. ఈ కేసులో రాజకీయ జోక్యం లేకుండా నిష్పక్షపాతంగా విచారణ జరపాలని.. బాధితురాలికి, ఆమె కుటుంబానికి తక్షణమే పూర్తిస్థాయి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.రాష్ట్ర పోలీసులు ఇప్పటికైనా ఒత్తిళ్లకు లొంగకుండా చట్టాన్ని గౌరవించాలని, బాధిత మైనర్ బాలికకు న్యాయం జరిగే వరకు తాము పోరాడుతామని స్పష్టం చేశారు.

## తమిళనాడు అసెంబ్లీ స్పీకర్‌గా జెసిడి ప్రభాకర్

మొదటిపేజీ తరువాయి

టీవీకే ఎమ్మెల్యే జేసీడీ ప్రభాకర్ మంగళవారం నాడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. టీవీకేకు చెందిన మరో ఎమ్మెల్యే రవిశంకర్ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్‌గా ఎన్నికయ్యారు. స్పీకర్, డిప్యూటీ స్పీకర్ ఎన్నిక కోసం ఈ సమావేశం ఏర్పాటు చేసినట్టు ప్రోటెం స్పీకర్ ఎంవీ కరుప్పయ్య తెలిపారు. తొలుత ప్రభాకర్ నామినేషన్‌ను ముఖ్యమంత్రి సి.జోసెఫ్ విజయ్ ప్రతిపాదించారు. ఒకే నామినేషన్ దాఖలు కావడంతో ఏకగ్రీవంగా స్పీకర్ ఎన్నిక జరిగింది. అనంతరం ప్రోటెం స్పీకర్‌గా తన పాత్ర ముగిసినట్లు కరుప్పయ్య ప్రకటించారు. ఆ వెంటనే సభాసాంప్రదాయం ప్రకారం స్పీకర్ ప్రభాకర్‌ను ఆయన చైర్ వరకూ సహానేత కేవీ సెంగొట్టియన్, ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్ తోడ్కొని వెళ్లారు. ఆయనకు అభినందనలు తెలిపారు. స్పీకర్‌గా ప్రభాకర్ బాధ్యతలు చేపట్టిన వెంటనే డిప్యూటీ స్పీకర్ ఎన్నికను చేపట్టారు. డిప్యూటీ స్పీకర్ పదవికి తుదియార్ టీవీకే ఎమ్మెల్యే ఎం.రవిశం కర్ ఒక్కరే నామినేషన్ వేశారని, దీంతో ఆయన ఎన్నిక ఏకగ్రీవమైందని ప్రభాకర్ ప్రకటించారు. రవిశంకర్ నామినేషన్ ను సెంగొట్టియన్ ప్రతిపాదించారు.

## అన్నా డిఎంకెలో లుకలుకలు

మొదటిపేజీ తరువాయి

వర్గంలో 30 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. డీఎంకేతో చేతులు కలపాలని అన్నాడీఎంకే అనుకుం దని, అందుకే పళనిస్వామి వర్గం నుంచి తాము విడిపోయామని మంగళవారంనాడు మీడియాతో మాట్లాడుతూ షణ్ముగం తెలిపా రు. ఎన్డీయే కూటమి నుంచి బయటకు వచ్చినట్టు చెప్పారు. వరుస ఓటములకు పళనిస్వామే కారణమని విమర్శించా రు. పార్టీ పదవి నుంచి ఆయన దిగిపోవాలని డిమాండ్ చేశారు. అన్నాడీఎంకే గత చరిత్ర కాలంగా పలు ఓటములను చవిచూసిం దని, మూడుసార్లు చిరకాల ప్రత్యర్థి డీఎంకే చేతిలో ఓడిపోతే, గత నెలలో టీవీకే చేతిలో మరో ఓటమి చవిచూసిందని షణ్ముగం తెలిపారు. పార్టీని పునరుద్ధరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, అన్నాడీఎంకే భవిష్యత్తుపై కూలంకషంగా చర్చించాలని అన్నారు. ఎన్నికల్లో విజేతగా నిలిచిన టీవీకేకు మద్దతివ్వాలని మేము నిర్ణయించాం. డీఎంకేకు వ్యతిరేకంగానే అన్నాడీఎంకే పార్టీని స్థాపించడం జరిగింది. 53 ఏళ్ల గా డీఎంకేకు వ్యతిరేకం గానే పార్టీ రాజకీయాలు నడిచాయి. చరిత్ర ఇలా ఉంటే డీఎంకే మద్దతుతో అన్నాడీఎంకే ప్రభుత్వం ఏర్పాటు కావాలనే ప్రతిపాదన ముందుకు తెచ్చారు. అయితే మెజారిటీ సభ్యులు ఈ ప్రతిపాదనను తోసిపుచ్చారు. డీఎంకేతో పొత్తు పెట్టుకోవడం అంటే అన్నాడీఎంకే సొంత ఉనికి కోల్పోవడమే అవుతుంది. ప్రస్తుతం మా దృష్టి ఉంతా పొత్తులపై లేదు. సొంత పార్టీని పునరుద్ధరించి, పటిష్టం చేయడమే మా ఉద్దేశం. అంతిమంగా ఎన్నికల్లో విజయం సాధించిన టీవీకేకు మద్దతు ఇవ్వాలని నిర్ణయించాం' అని షణ్ముగం వివరణ ఇచ్చారు. పార్టీ సొంత పార్టీని చీల్చే ఉద్దేశం లేదని షణ్ముగం వివరణ ఇచ్చారు. పార్టీ కీలక నాయకత్వంపై పోరాటంగా దీనిని పేర్కొ న్నారు. ముఖ్యంగా విజయ్, టీవీకేతో పొత్తుకు గత వారంలో నిరాకరించిన మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామికి వ్యతిరే కంగా తాముంతా తీసుకున్న నిర్ణయమని చెప్పారు.

# నీట్ ప్రవేశ పరీక్ష రద్దు

మొదటిపేజీ తరువాయి

పరీక్షను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. త్వరలోనే కొత్త పరీక్ష తేదీలను వెల్లడిస్తామని తెలిపింది. విద్యార్థుల ప్రయోజనాలు, జాతీయ పరీక్షా వ్యవస్థపై ఉన్న విశ్వాసాన్ని కాపాడేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎన్‌టీఏ వెల్లడించింది. కొత్త పరీక్ష కోసం విద్యార్థులు మళ్లీ రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిన అవసరం లేదని, పరీక్ష ఫీజు చెల్లించనక్కర్లేదని తెలిపింది. పరీక్ష తేదీలను నిర్ణయించిన తర్వాత మళ్లీ అడ్మిట్ కార్డులు విడుదల చేస్తామని పేర్కొంది. ఇక, ప్రశ్నపత్రం లీకేజీ ఆరోపణలపై సీబీఐ దర్యాప్తు చేస్తున్నట్లు ఎన్‌టీఏ తెలిపింది. ఈనెల 3న జరిగిన నీట్ పరీక్షలో కెమిస్ట్రీ విభాగంలో వచ్చిన సుమారు 120కి పైగా ప్రశ్నలతో ఉన్న ఓ ప్రాక్టీసు పేపరును గుర్తించినట్లు రాజస్థాన్ అదనపు డీజీపీ విశాల్ బన్సాల్ వెల్లడించారు. ఈ మెటీరియల్ రాజస్థాన్‌లోని సికార్‌లో పరీక్షకు 42 గంటల ముందు వాట్సాప్‌లో అందుబాటులోకి వచ్చినట్లు గుర్తించారు. ఇందులోని సమాచారం.. నీట్ ప్రశ్నపత్రంలోని 600 మార్కుల ప్రశ్నలతో పోలి ఉండటం గమనార్హం. కొన్ని ప్రశ్నల్లోని జవాబుల క్రమం కూడా అచ్చం ఒకేలా ఉండడం పలు అనుమానాలకు తావిచ్చింది. ఆ ప్రాక్టీసు పేపరు కేరళలోని ఓ వైద్య కళాశాలలో చదువుతున్న ఎంబీబీఎస్ విద్యార్థికి చెందినదిగా దర్యాప్తులో వెల్లడైంది. ఆ వ్యక్తి ఈనెల 1న సికార్‌లోని తన స్నేహితుడికి ఈ మెటీరియల్ ఇచ్చాడని.. ఆ తర్వాత అది పీజీ వసతిగృహాలు, కోచింగ్ నెట్‌వర్క్‌లు, కెరీర్ కౌన్సిలర్లు, పరీక్షకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు చేరిందని అధికారులు తెలిపారు. ఆ మెటీరియల్‌లో ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీకి సంబంధించిన300కుపైగా చేతిరాత ప్రశ్నలు ఉన్నాయని వెల్లడించారు.

# "కేసీఆర్‌ను గద్దె దించడంలో టీజేఎస్ కీలక పాత్ర పోషించింది"

మొదటిపేజీ తరువాయి

ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమ కాలంలో ప్రజల విశ్వాసాన్ని ఎప్పుడూ వమ్ము చేయలేదని అన్నారు. "నేను అమ్ముడుపోతాననే అనుమానం అప్పటి ప్రభుత్వాలకు ఉండేది. కానీ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకున్నాను" అని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో తన తర్వాతే కేసీఆర్ వచ్చారని, నక్సలైట్లు కూడా తెలంగాణ రాష్ట్ర సాధనకు మద్దతు ఇచ్చారని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేసీఆర్ ప్రభుత్వం కేవలం కమిషన్ల కోసమే పనిచేసిందని విమర్శించారు. "తెలంగాణ నేనే తెచ్చాననే భావనలో కేసీఆర్ ఉన్నాడు. బీఆర్ఎస్ పాలనలో ఉద్యమకారులకు గుర్తింపు లేకుండా పోయింది" అని ఆరోపించారు. కేసీఆర్‌ను ఓడించే శక్తి ఒక్క టీజేఎస్‌కు సరిపోదని భావించి కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చామని తెలిపారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలకు, రాజకీయ పార్టీలకు ప్రభుత్వాన్ని నేరుగా ప్రశ్నించే స్వేచ్ఛ ఉందని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమకారులకు గుర్తింపు, ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. "మా దగ్గర డబ్బులు లేవు కాబట్టి ఓట్లు రావని తెలుసు. కానీ ప్రజల విశ్వాసాన్ని మాత్రం సంపాదించుకున్నాం" అని అన్నారు. బీఆర్ఎస్–టీఆర్ఎస్ మధ్య విభేదాలకు కుటుంబ రాజకీయాలే కారణమని విమర్శించిన కోదండరాం, "బీఆర్ఎస్‌ను కుటుంబ పార్టీగా నడిపారు" అన్నారు. ప్రజలను పొదుపు చేయమని చెప్పే ప్రధాని మోదీ తన పాలనపై స్పష్టత ఇవ్వడం లేదని వ్యాఖ్యానించారు. రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని కొన్ని నియోజకవర్గాలపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తామని తెలిపారు. "సామాజిక మార్పు రాజకీయాల ద్వారానే సాధ్యమవుతుంది. అందుకే రాజకీయ పార్టీని కొనసాగిస్తున్నాం. ఇదే నాకు పార్టీ అధ్యక్షుడిగా చివరి అవకాశం. భవిష్యత్తులో కొత్త నాయకత్వానికి అవకాశం ఇస్తాను" అని ప్రకటించారు. బీఆర్ఎస్ పాలనలో ముఖ్యమంత్రి, మంత్రులను కలవడం కష్టంగా ఉండేదని, కాంగ్రెస్ ప్రభుత్వంలో అలాంటి పరిస్థితి లేదన్నారు. టీజేఎస్‌ను కేసీఆర్ ప్రభుత్వం తీవ్ర ఇబ్బందులకు గురిచేసినా పార్టీ నిలదొక్కుకుందని, "టీజేఎస్ ఏం చేసింది అంటే కేసీఆర్‌ను గద్దె దించిందని గట్టిగా చెప్పండి" అని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. "కేసీఆర్ ఇక ఫార్మ్‌హౌస్‌కే పరిమితం.. బయటకు రాడు" అని వ్యాఖ్యానించారు.

రాజకీయ తీర్మానం ఆమోదం:

ప్లీనరీలో "విలువలను కాపాడిన రాజకీయమే భవిష్యత్తును కాపాడగలదు" అనే రాజకీయ తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు. ప్రస్తుత రాజకీయాల్లో ఆశ్రిత పెట్టుబడి వ్యవస్థ (క్రోనీ క్యాపిటలిజం) కారణంగా ప్రజాస్వామ్య విలువలు దెబ్బతింటున్నాయని తీర్మానంలో పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రస్తుత రాజకీయ వ్యవస్థ విఫలమైందని, వ్యక్తిగత ప్రయోజనాలే ప్రధాన లక్ష్యంగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. కేసీఆర్ ప్రభుత్వం వ్యవసాయం, విద్య, ఉపాధి, ఆరోగ్య రంగాలను నిర్లక్ష్యం చేసి ప్రజాస్వామ్య వ్యవస్థలను నిర్వీర్యం చేసిందని విమర్శించారు. తెలంగాణ పునర్నిర్మాణ లక్ష్యాలను పక్కనబెట్టి కార్పొరేట్ ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇచ్చారని ఆరోపించారు. 2023 ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ఓడించకపోతే తెలంగాణ మరింత అధోగతికి గురయ్యేదని గుర్తించి కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చామని టీజేఎస్ పేర్కొంది. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభంలో కొన్ని సంక్షేమ చర్యలు చేపట్టినా, తర్వాత పలు అంశాల్లో దారి తప్పుతోందని విమర్శిం చింది. భూసేకరణ చట్టం అమలు, విద్య–వైద్య రంగాల అభివృద్ధి, అవినీతి విచారణల విషయంలో ప్రభుత్వం ఆశించిన స్థాయిలో పనిచేయడం లేదని అభిప్రాయపడింది.

భవిష్యత్ కార్యాచరణపై దృష్టి:

పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయాలని ప్లీనరీ నిర్ణయించింది. విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలపై ఆందోళనలు చేపట్టాలని, సింగరేణి ప్రైవేటీకరణను అడ్డుకోవాలని, ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని తీర్మానించింది. అలాగే కనీస వేతన జీఓ సవరణ, బీసీ రిజర్వేషన్ల పెంపు, మహిళా రిజర్వేషన్లలో ఓబీసీ కోటా కోసం పోరాడాలని నిర్ణయించింది.

# జూన్ 2న ఇందిరమ్మ ఇళ్ల రెండోవిడుత పంపిణీ

మొదటిపేజీ తరువాయి

సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశాల్లో శాసనసభ స్పీకర్ ప్రసాద్ కుమార్, రంగారెడ్డి జిల్లా ఇన్ ఛార్జి మంత్రి శ్రీధర్ బాబు, హైదరాబాద్ ఇన్ ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రి మహ్మద్ అజారుద్దీన్, శాసన మండలిలో చీఫ్ విప్ మహేందర్ రెడ్డి తదితర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వం దూరదృష్టి లేకుండా హైదరాబాద్ నగరానికి దూరంగా డబుల్ బెడ్ రూం ఇండ్లను నిర్మించడం వల్ల జరిగిన నష్టం కళ్లముందే కనిపిస్తున్నదన్నారు. అటువంటి తప్పు పునరావృత్తం కాకుండా పేదలు ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాలకు 5 నుంచి 8 కిలోమీటర్ల పరిధిలోనే ఇందిరమ్మ ఇండ్లను నిర్మించే విధంగా నియోజకవర్గాన్ని యూనిట్ గా తీసుకుని స్థలాలను గుర్తించి తగిన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఆనాటి ప్రభుత్వం నగరానికి 20 నుంచి 30 కిలోమీటర్ల దూరంలో 2 బిహెచ్ కె ఇండ్లను నిర్మించి హైదరాబాద్ నగరంలో నివసిస్తున్న వారికి కేటాయించడం వల్ల తమ జీవనోపాధికి ఇబ్బంది కలుగుతుందన్న ఉద్దేశ్యంతో ఇండ్లు తీసుకున్న లబ్దిదారులు అక్కడ నివసించడానికి సంసిద్ధతం వ్యక్తం చేయడం లేదని క్షేత్ర స్థాయి పరిశీలనల్లో స్పష్టమైందన్నారు. ఈ అంశాన్ని ప్రధానంగా దృష్టిలో ఉంచుకుని ఏ నియోజకవర్గానికి సంబంధించి ఆ నియోజకవర్గంలోనే ప్రభుత్వ స్థలాలు, మురికివాడలు, భూదాన్, గతంలో వివిధ పథకాల కింద నిర్మించిన ఇళ్లు శిథిలావస్థలో ఉన్న ప్రాంతాలను గుర్తించి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఈ విషయంలో ప్రజా ప్రతినిధులను భాగస్వామ్యులను చేయాలని అధికారులను ఆదేశించారు. 2 బిహెచ్ కె ఇండ్లకు లబ్దిదారులను కేటాయించడానికి యుద్ధప్రాతిపదికన స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని మంత్రి పొంగులేటి అధికారులను ఆదేశించారు. ఇప్పటికే పూర్తి అయిన వాటికి, వివిధ నిర్మాణ దశల్లో ఉన్న వాటికి ఈ నెలాఖరు కల్లా లబ్దిదారులను గుర్తించాలని, అది కూడా ఆ కాలనీలకు అయిదు నుంచి ఎనిమిది కిలోమీటర్ల లోపు ఉన్న వారినే ఎంపిక చేయాలని స్పష్టం చేశారు. ఇప్పటికే నిర్మాణాలన్నీ పూర్ఖైన ఇండ్లలో లబ్దిదారులు ఉండేలా చూసేలా నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ఈ కాలనీల్లో మంచినీరు, డ్రైనేజి, విద్యుత్ వంటి కనీస సౌకర్యాల కల్పనకు వేగవంతమైన చర్యలు తీసుకోవాలన్నారు. హైదరాబాద్ పరిధిలో ఇండ్ల స్థలాలు ఉండి అర్హులైన లబ్దిదారులకు ఈనెల చివరిలోగా ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను అందజేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లా హౌసింగ్ ప్రాజెక్టు డైరక్టర్లు మరింత క్రియాశీలకంగా వ్యవహరించాలని, పనితీరు మెరుగుపడాలని అన్నారు. పిడిలు తమ పరిధిలో గతంలో నిర్మించిన జెన్ఎన్ యుఆర్ఎం, రాజీవ్ గృహకల్ప, వాంబే హౌసింగ్ కాలనీలన్నిటిని సందర్శించాలని స్పష్టంగా నిర్దేశిరచారు. అంగుళం ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమైనా కఠినంగా వ్యవహరిస్తామని మంత్రి పొంగులేటి హెచ్చరించారు. మల్కాజిగిరి నియోజకవర్గంలో యుఎల్ సి భూములు కోర్టు పరిధిలో ఉన్నప్పటికీ, నిబంధనలకు విరుద్ధంగా కొంత భాగాన్ని రిజిస్ట్రేషన్ చేశారని , స్థానిక ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి సమావేశంలో మంత్రి దృష్టికి తీసుకుని రాగా వెంటనే సంబంధిత సబ్ రిజిస్ట్రార్?పై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలకు గురికాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. శాశ్వత భవనాలు లేని ఆర్డీవో, తహశీల్దార్, సబ్ రిజస్ట్రార్ కార్యాలయాలకు సొంత భవనాలను నిర్మించేందుకు ప్రభుత్వం సిద్దంగా ఉందని ఇందుకు సంబంధించి ప్రతిపాదనలు రూపొందించాలన్నారు. రెవెన్యూ, ఫారెస్టు సరిహద్దు వివాదాలకు ముగింపు పలికేలా రెండు శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

# ధాన్యం సేకరణలో నిర్లక్ష్యం సహించం

మొదటిపేజీ తరువాయి

మొక్కజొన్న పంట ఎక్కువగా వచ్చే జిల్లాల కలెక్టర్లు కొనుగోళ్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎక్కడా రైతులకు ఇబ్బందులు కలగొద్దని తెలిపారు. అవసరమైన చోట పోలీస్ సహాయం తీసుకుని కలెక్టర్లు ధాన్యం సేకరణ సాఫీగా జరిగేలా చూడాలని సూచించారు. మంగళవారం.. జిల్లా కలెక్టర్లతో సీఎం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలో మొక్కజొన్న కొనుగోలు, వరి ధాన్యం సేకరణపై జిల్లా కలెక్టర్లతో ముఖ్యమంత్రి సమీక్ష చేశారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సీఎం ఆదేశించారు. అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి కొనుగోళ్ల తీరును పరిశీలించాలని.. గన్నీ బ్యాగులు, హమాలీల కొరత లేకుండా చూసుకోవాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటి కప్పుడు గోడౌన్స్‌కు తరలించాలని అన్నారు. ధాన్యం తరలింపునకు అవసరమైన వాహనాలను అందుబాటులో ఉండేలా చూడాలని రవాణా శాఖ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేశారు. సమస్య తీవ్రతను గుర్తించి జిల్లా కలెక్టర్లు సరైన చర్యలు తీసుకోవాల్సిందే అని.. ప్రతి అధికారి జవాబుదారీ తనంతో వ్యవహరించాల్సిందే అని తేల్చిచెప్పారు. నిర్లక్ష్యం వహిస్తే కలెక్టర్లపై చర్యలకు ప్రభుత్వం వెనకాడదని హెచ్చరించారు. గోడౌన్స్ సమస్య ఉన్న ప్రాంతాల్లో అవసరాన్నిబట్టి తాత్కాలిక ఏర్పాట్లు చేసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. రైతుబజార్లు, ఫంక్షన్ హాల్స్‌ను ఎంగేజ్ చేసి ధాన్యాన్ని తరలించాలన్నారు. వెసులుబాటు ఆధారంగా అక్కడినుంచి గోడౌన్స్‌కు తరలించేలా ప్రణాళికలుండాలని తెలిపారు. కొనుగోళ్లపై ఎప్పటికప్పుడు సీఎస్‌కు పోర్ట్ పంపించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ధాన్యం లోడింగ్‌లో జాప్యం జరగకుండా స్థానికంగా ఉన్న హమామీలను గుర్తించి వారితో పని చేయించుకోవాలని రేవంత్ తెలిపారు. ధాన్యం లోడ్ చేసిన వెంటనే రైతులకు రశీదు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. దగ్గరగా ఉన్న ప్రాంతాల్లో లారీల కొరత ఉంటే ట్రాక్టర్లు, ఇతర వాహనాలను వినియోగించాలని సూచించారు. అకాల వర్షాల సమయంలో ధాన్యం తడవకుండా అవసరమైన టార్పాలిన్లను రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. అకాల వర్షాల సమయంలో నష్టం జరగకుండా శాశ్వత పరిష్కారానికి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని కలెక్టర్లకు సూచించారు. వాతావరణ శాఖ సూచనల ఆధారంగా ఎప్పటికప్పుడు రైతులను అప్రమత్తం చేసేందుకు మండల స్థాయిలో ఒక ప్రత్యేక అధికారిని నియమించాలని సీఎం ఆదేశించారు. వాతావరణ సూచనలను రైతులకు చేరవేసేందుకు ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రతి ఐకేపీ సెంటర్‌కు ఒక అధికారిని నియమించాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రతి రైస్ మిల్లు దగ్గర ఒక బాధ్యతాయుతమైన అధికారిని నియమించి పర్యవేక్షించాలన్నారు. మిషన్ మోడ్‌లో పనిచేస్తేనే సమస్యలు వేగంగా పరిష్కారమవుతాయని తెలిపారు. కలెక్టర్లు ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తేనే సమస్యలు తలెత్తవని.. ఏ సమస్య వచ్చినా కలెక్టర్లదే బాధ్యత అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తేల్చిచెప్పారు. వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

## నీట్ పేపర్ లీక్ కేసు - 13 మందిని అరెస్ట్ చేసిన పోలీసులు

మొదటిపేజీ తరువాయి

ప్రశ్నాపత్రం వచ్చింది. ప్రభుత్వం నిర్వహించిన ప్రశ్నాపత్రంతో ఈ 'గెస్ పేపర్' 100 శాతం సరి పోలినట్లు అధికారులు గుర్తించారు. అలాగే మే 3వ తేదీన ఈ నీట్ పరీక్ష నిర్వహించగా.. అంతకు ముందే ఈ పరీక్ష పేపర్ లీక్ అయినట్లు అధికారులు ధృవీకరించారు. ఈ ప్రశ్నాపత్రం రూ. 20 వేల నుంచి రూ. 2 లక్షల వరకు విక్రయించినట్లు గుర్తించారు. కేరళలోని ఒక ఎంబీబీఎస్ విద్యార్థి వద్ద ఈ పేపర్ లీక్ అయినట్లు పోలీసులు కనుగొన్నారు. మే 1వ తేదీన సికార్‌లోని స్నేహితుడితో ఎంబీబీఎస్ విద్యార్థి ఈ ప్రశ్నాపత్రం పంచుకున్నట్లు తెలుస్తుంది. ఆ తర్వాత కోచింగ్ సెంటర్లు, అభ్యర్థులకు ఈ పేపర్ లీక్ అయినట్లు సమాచారం.నైల్ పరీక్షల్లో అసలు ప్రశ్నాపత్రంలోని 140 ప్రశ్నలు సరి పోలాయి. ఈ 140 ప్రశ్నలు సోషల్ మీడియాలో విస్తృతంగా వైరలయ్యాయి. ఈ విషయాన్ని గుర్తించిన ప్రభుత్వం ఈ పరీక్షను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ పరీక్ష నిర్వహించే తేదీలు త్వరలో ప్రకటిస్తామని వెల్లడించింది.

## సనత్‌నగర్ టిమ్స్‌లో వైద్యసేవల ట్రయల్ రన్

మొదటిపేజీ తరువాయి

యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆర్ అండ్ బీ, ఆరోగ్యశాఖ అధికారులకు మంత్రి సూచించారు. హాస్పిటల్‌కు నీళ్లు, పవర్ సప్లైలో ఎలాంటి ఆటంకం ఉండకూడదని, 24 గంటల సరఫరా ఉండాలని మంత్రి సూచించారు. ఫైర్ సేఫ్టీ విషయంలో రాజీ ఉండకూడదని, అన్ని ఫ్లోర్లలో మరోసారి పూర్తిస్థాయి పరిశీలన చేయాలని అధికారులను ఆదేశించారు. రిసెప్షన్ ఏరియా, హెల్ప్ డెస్క్, ఓపీ కౌంటర్లు, వెయిటింగ్ హాల్, ఓపీ కన్సల్టేషన్ రూమ్స్, డయాగ్నస్టిక్స్, ఇన్ పేషెంట్ వార్డులు, ఫార్మసీ తదితర ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి.. రిజిస్ట్రేషన్ కౌంటర్స్, ఫార్మసీ కౌంటర్స్ పెంచాలని మంత్రి సూచించారు. సీటీ స్కాన్, ఎంఆర్ఐ, ఎక్స్ రే, ఆల్ట్రాసౌండ్ తదితర యంత్రాలను పరిశీలించిన మంత్రి.. అడ్వాన్స్డ్ టెక్నాలజీతో అందుబాటులోకి తీసుకొచ్చిన ఈ యంత్రాలు పూర్తిస్థాయిలో పేషెంట్లకు ఉపయోగపడాలని, ఇందుకు అవసరమైన డాక్టర్లు, ఇతర సిబ్బందిని సిద్ధంగా ఉంచుకోవాలని ఆరోగ్యశాఖ అధికారులను మంత్రి ఆదేశించారు. ప్రారంభం నాటికి అన్ని సౌకర్యాలతో హాస్పిటల్‌ను సిద్ధం చేయాలని, పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా పని చేయాలని అధికారులకు మంత్రి సూచించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. జూ న్ లో సనత్‌నగర్ టిమ్స్‌ను ప్రారంభిస్తామని అన్నారు. ఇక్కడ సక్సెస్‌ఫుల్‌గా వైద్య సేవల ట్రయల్ రన్ జరుగుతోంది.కొన్ని ఫినిషింగ్ వర్క్స్ జరుగుతున్నాయి. ఆ పనులన్నీ గడువులోగా పూర్తి చేయాలని ఆర్ అండ్ బీ, ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించామన్నారు. ఇది వెయ్యి బెడ్ల హాస్పిటల్, ఇందులో 300 ఎమర్జెన్సీ బెడ్లు ఉంటాయి. అత్యవసర పరిస్థితుల్లో బాధితుల ప్రాణాలు నిలిపే గొప్ప హాస్పిటల్‌గా దీన్ని తీర్చిదిద్దుతున్నాం. గుండె సంబంధిత వ్యాధుల చికిత్సలు, ఆర్గాన్ ట్రాన్స్‌ఎ÷–లాంటేషన్ సర్జరీలకు ఈ హాస్పిటల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా ఉంటుందని వివరించారు. ఇక్కడే అద్భుతమైన రీసెర్చ్ సెంటర్ అందుబాటులోకి తీసుకొస్తాం అని దామోదర అన్నారు.

## పోక్సో కేసులో కుల ప్రసక్తి ఉండదు

మొదటిపేజీ తరువాయి

చట్టప్రకారం నిందితు లకు కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు. నేర పరిశోధనలో నిందితుడి కులం లేదా సామాజిక హోదాతో సంబంధం లేదని తెలిపారు. బండి సంజయ్ ఈ కేసులో కుల రాజకీయాలను తీసుకురావడం దురదృష్టకరమని అన్నారు. ఈ కేసులో ఎవరినీ వ్యక్తిగతంగా టార్గెట్ చేయాల్సిన అవసరం కాంగ్రెస్‌కి ఏమాత్రం లేదని స్పష్టం చేశారు. చట్టం తన పని తాను చేసుకుపోతుందని తేల్చిచెప్పారు. 'నారీ శక్తి' అని నినాదాలు చేసే బీజేపీ, ఇప్పుడు బాలికపై జరిగిన దాడి విషయంలో మౌనంగా ఉండటం దేనికి సంకేతం..? అని మహేశ్ గౌడ్ ప్రశ్నించారు. బాలిక కుటుంబ సభ్యులను భగీరథ్ బెదిరిస్తున్నట్లు వస్తున్న వార్తలపై ప్రభుత్వం దృష్టి పెట్టిందని అన్నారు. నిజమని తేలితే పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటారని తెలిపారు. ఈ కేసు విషయంలో ఎలాంటి రాజకీయ జోక్యం, కుల మతాల ప్రభావం లేకుండా పారదర్శకంగా విచారణ జరుగుతుందని స్పష్టం చేశారు. నిందితుడు ఎంతటి శక్తివంతుడైనా సరే, బాధితురాలికి తాము అండగా నిలుస్తామని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

## అసోం సిఎంగా హిమంత బిశ్వశర్మ

మొదటిపేజీ తరువాయి

బిశ్వ శర్మతో పాటు బీజేపీ నుంచి ఇద్దరు, ఏజీపీ, బీపీఎఫ్ నుంచి ఒక్కొక్కరు మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. అస్సాంలో బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి రావడం ఇది వరుసగా మూడోసారి కాగా, అసోం ముఖ్యమంత్రిగా శర్మ పగ్గాలు చేపట్టడం రెండోసారి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్, పలువురు కేంద్ర మంత్రులు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ సహా పలువురు ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉపముఖ్యమంత్రులు హాజరయ్యారు. హిమంత బిశ్వ శర్మతో పాటు రామేశ్వర్ తేలి, అతుల్ బోరా, చరణ్ బోరో, అజంతా నియోగ్ మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో రాష్ట్రాభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని, కొత్త టీమ్‌తో కలిసి పూర్తి అంకితభావంతో పటిష్టమైన, మరింత అభివృద్ధి చెందిన, సుసంపన్నమైన అస్సాంను నిర్మిస్తామని శర్మ ప్రకటించారు. హిమంత బిశ్వ శర్మ తొలిసారి 2021లో సీఎంగా ప్రమాణ స్వీకారం చేసారు. బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఘనవిజయం సాధించి వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చింది. మొత్తం 126 స్థానాల్లో ఎన్డీయే 102 సీట్లు గెలుచుకుంది. బీజేపీ 82 సీట్లు దక్కించుకోగా, భాగస్వామ్య పార్టీలైన ఏజీపీ, బీపీఎఫ్ చెరో 10 సీట్లు గెలుచుకున్నాయి. కాంగ్రెస్ సారథ్యంలోని కూటమికి 19 సీట్లు వచ్చాయి. భాజపా ఒక్కటే 82 సీట్లు గెలుచుకోగా.. దాని కూటమి భాగస్వాములైన ఏజీపీ, బీపీఎఫ్ చెరో 10 సీట్లు దక్కించుకున్నాయి. దీంతో ఎన్డీఏ రాష్ట్రంలో వరుసగా మూడోసారి తమ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసింది. ఈ కార్యక్రమానికి ముందు వేదిక వద్ద ఓ వ్యక్తి అనుమానాస్పదంగా తచ్చాడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. తనిఖీ చేయగా అతడి వద్ద తుటాలు లభ్యమయ్యాయి. వెంటనే అనుమానితుడిని బసిస్ట పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారణ చేపట్టామన్నారు. హిమంత ప్రమాణస్వీకార కార్యక్రమానికి పీఎం మోదీ సహా పలువురు కీలక నేతలు హాజరైన నేపథ్యంలో ఈ ఘటన చోటుచేసుకోవడం గమనార్హం.

# రఘునాథపాలెంను సోలార్ విలేజ్‌గా అభివృద్ధి చేయాలి



**- కమ్యూనిటీ భవనాలపై కూడా సోలార్ రూఫ్‌టాప్‌లు ఏర్పాటు చేయాలి**

**- సెన్సస్-2027కు ప్రజలు పూర్తి సహకారం అందించాలని సూచన**

**- ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖమ్మం, మే 12 : జిల్లాలో పునరుత్పాదక ఇంధన వినియోగాన్ని ప్రోత్సహించే దిశగా రఘునాథపాలెం గ్రామాన్ని సోలార్ రూఫ్‌టాప్ వ్యవస్థ కలిగిన పైలట్ గ్రామంగా అభివృద్ధి చేయాలని ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్ తెలిపారు. మంగళవారం రఘునాథపాలెం గ్రామంలో అమలవుతున్న సోలార్ మోడల్ ప్రాజెక్టును కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు. గ్రామంలో ఏర్పాటు చేస్తున్న సోలార్ రూఫ్‌టాప్‌ల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో మొత్తం 1081 మంది గృహజ్యోతి లబ్ధిదారులు ఉన్నారని, వారిలో 821 ఇళ్లలో సోలార్ రూఫ్‌టాప్‌ల ఏర్పాటు చేయడానికి అనుకూల పరిస్థితులు ఉన్నట్లు గుర్తించామని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఇప్పటివరకు 110 ఇళ్లలో సోలార్ రూఫ్‌టాప్‌ల ఏర్పాటు పూర్తయిందని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రఘునాథపాలెంను భవిష్యత్తులో పూర్తి స్థాయి "సోలార్ విలేజ్"గా తీర్చిదిద్దే లక్ష్యంతో చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రతి ఇంటికి కనీసం 2 కిలోవాట్ల సామర్థ్యంతో సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. గ్రామంలోని కమ్యూనిటీ హాళ్లు, ప్రభుత్వ భవనాలు, ఇతర సామూహిక ప్రదేశాలపై కూడా సోలార్ రూఫ్‌టాప్‌లు ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు అవసరమైన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. సోలార్ రూఫ్‌టాప్‌ల ద్వారా ఉత్పత్తి అయ్యే అదనపు విద్యుత్‌ను గ్రిడ్‌కు విక్రయించే విధంగా చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో జరుగుతున్న సెన్సస్--2027 కార్యక్రమంపై కూడా కలెక్టర్ ఆరా తీశారు. జనగణన సిబ్బందికి ప్రజలు పూర్తి సహకారం అందించాలని కోరారు. తప్పుడు సమాచారం ఇవ్వకుండా సరైన వివరాలు నమోదు చేయాలని సూచించారు. జనగణన కారణంగా ఎలాంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రభావితం కావని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రఘునాథపాలెం తహసీల్దార్ శ్వేత, ఆర్ఐ వహీద్, సంబంధిత శాఖల అధికారులు, విద్యుత్ శాఖ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# అక్రమ నిర్మాణాలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి



**- ఎన్ఎస్‌పీ లింక్ కెనాల్ ఆక్రమణలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు**

**-కాంగ్రెస్ పార్టీ నేత డీవీఎన్ శరత్ కుమార్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖమ్మం, మే 12 : ఖమ్మం రూరల్ మండలంలోని ఎన్ఎస్‌పీ లింక్ కెనాల్ పరిసర ప్రాంతాల్లో పెరుగుతున్న అక్రమ నిర్మాణాలపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని ఏదులాపూరం మున్సిపాలిటీ 2వ వార్డు కాంగ్రెస్ పార్టీ వైస్ ప్రెసిడెంట్ డీవీఎన్ శరత్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఏదులాపూరం మున్సిపల్ కమిషనర్ ఆళ్ళ శ్రీనివాస్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రాంతంలోనే ప్రభుత్వ భూముల ఆక్రమణలు కొనసాగడం ఆశ్చర్యకరమని విమర్శించారు. ఏదులాపూరం మున్సిపాలిటీ పరిధిలోని ఎన్ఎస్‌పీ లింక్ కెనాల్ బఫర్ జోన్‌లో కొంతమంది ప్రైవేటు వ్యక్తులు కాలువ భూమిని కబ్జా చేసి అక్రమంగా ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపించారు. పల్లెగూడెం, రెడ్డిపల్లి, పోలేపల్లి, సాయి గణేష్ నగర్, షిరిడి సాయి నగర్, కరుణగిరి ప్రాంతాల మీదుగా మున్నేరు వాగులోకి ప్రవహించే లింక్ కెనాల్ పరిసరాల్లో ఈ ఆక్రమణలు పెరుగుతున్నాయని తెలిపారు. కాలువ సహజ వెడల్పు తగ్గిపోవడంతో పాటు ప్రవాహ మార్గం మారిపోతుందని, దీంతో వర్షాకాలంలో వరద నీటి ప్రవాహానికి తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని పేర్కొన్నారు. రోడ్లపై నీరు నిల్వ ఉండటం, దోమల వ్యాప్తి పెరగడం, అంటువ్యాధుల ప్రమాదం నెలకొనడం వంటి సమస్యలతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన రోడ్లు, ఇతర ప్రజా మౌలిక వసతులు కూడా దెబ్బతింటున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఈ అంశంపై ఇప్పటికే మున్సిపల్ కమిషనర్, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. అలాగే సమాచార హక్కు చట్టం--2005 ప్రకారం ఇరిగేషన్ శాఖ చీఫ్ ఇంజనీర్‌కు ఆర్‌టీఐ దరఖాస్తు సమర్పించినట్లు తెలిపారు. కాలువ అసలు రికార్డులు, బఫర్ జోన్ వివరాలు, గత సర్వే నివేదికలు, అక్రమ నిర్మాణాలపై తీసుకున్న చర్యలు, భవిష్యత్ పరిరక్షణ చర్యలపై పూర్తి సమాచారం కోరినట్లు చెప్పారు. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ దృష్ట్యా సంబంధిత శాఖలు వెంటనే స్పందించి ఆక్రమణలపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారని డీవీఎన్ శరత్ కుమార్ పేర్కొన్నారు.

# భద్రగిరి మార్ట్‌కు విశేష ఆదరణ



**- గిరిజన మహిళల ఆర్గానిక్ ఉత్పత్తులకు దేశవ్యాప్తంగా పెరుగుతున్న డిమాండ్**

**- సుజాతనగర్ లో భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్ పరిశీలన**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం (సుజాతనగర్), మే 12 : ఆర్గానిక్ వ్యవసాయ ఉత్పత్తులు, జీసీసీ ద్వారా సేకరించే అటవీ ఉత్పత్తులు, గిరిజన స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేస్తున్న నిత్యావసర వస్తువులకు ప్రజల్లో విశేష ఆదరణ లభిస్తోందని భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ అన్నారు. గిరిజన మహిళల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటుగా ఏర్పాటు చేసిన "భద్రగిరి మార్ట్"కు రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి కూడా మంచి స్పందన వస్తోందని తెలిపారు. మంగళవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతనగర్ మండలంలో రైతు ఎల్లయ్య ఎద్దుగానుగాతో తయారు చేస్తున్న కల్తీలేని నూనె తయారీ విధానాన్ని ఐటీడీఏ పీఓ రాహుల్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దర్శనానికి వచ్చే భక్తులను ఆకర్షించేలా భద్రగిరి మార్ట్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భద్రగిరి మార్ట్‌లో పూర్తిస్థాయిలో ఆర్గానిక్ వ్యవసాయ ఉత్పత్తులు, అడవుల నుంచి సేకరించిన అటవీ ఉత్పత్తులు, గిరిజన మహిళలు తయారు చేస్తున్న మిల్లెట్ మ్యాజిక్ బిస్కెట్లు, వివిధ రకాల పచ్చళ్లు, నెయ్యి, తేనె, ఎద్దుగానుగ నూనెలతో పాటు ఇతర నిత్యావసర సరుకులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. నాణ్యమైన, కల్తీ లేని ఉత్పత్తులు అందుబాటులో ఉండటంతో ప్రజల ఆదరణ రోజురోజుకూ పెరుగుతోందని పేర్కొన్నారు. భద్రగిరి మార్ట్‌కు సరఫరా అయ్యే ఉత్పత్తుల నాణ్యతపై ఐటీడీఏ ప్రత్యేక దృష్టి సారిస్తోందని రాహుల్ తెలిపారు. మూడు నెలలకు ఒకసారి ప్రత్యేక బృందాలను గ్రామాలకు పంపించి ఉత్పత్తుల తయారీ విధానం, నాణ్యతను పరిశీలిస్తున్నామని చెప్పారు. పరీక్షల్లో కల్తీ తేలితే సంబంధిత సరఫరాదారులను వెంటనే తొలగించే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రస్తుతం రైతు ఎల్లయ్య సరఫరా చేస్తున్న ఎద్దుగానుగ నూనెకు మంచి డిమాండ్ ఉందని, ఇదే నాణ్యతను కొనసాగిస్తూ కల్తీలేని ఉత్పత్తులను సరఫరా చేయాలని రైతుకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణప్రసాద్, రైతు ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# వడ్ల కొనుగోలు కేంద్రం లేక ఆగమవుతున్న రైతన్నలు



**- పలిమెల-పంకెన గ్రామాల్లో వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి**

**- జిల్లా రైతు సంఘం నాయకుడు అక్కల బాపు యాదవ్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కాటారం, మే 12 : జయశంకర్-భూపాలపల్లి జిల్లా పలిమెల మండలంలోని పంకెన గ్రామంలో వడ్ల కొనుగోలు కేంద్రాలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని జిల్లా రైతు సంఘం నాయకుడు అక్కల బాపు యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పలిమెల మండల కేంద్రంతో పాటు పంకెన గ్రామ రైతులు అప్పులు తెచ్చి ఎంతో కష్టపడి వరి సాగు చేసినప్పటికీ, పంట చేతికొచ్చే సమయానికి సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్), ఐకేపీ ఆధ్వర్యంలో వడ్ల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు.

ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యాన్ని అమ్ముకునే పరిస్థితి లేక రైతులు కళ్లాల్లోనే ధాన్యాన్ని నిల్వ ఉంచి రోజుల తరబడి ఎదురుచూస్తున్నారని తెలిపారు. అకాల వర్షాల భయంతో రాత్రింబవళ్లు ధాన్యం కుప్పలకు కాపలా కాస్తున్నారని చెప్పారు. వర్షం వస్తే గింజ తడిసి రంగు మారి మద్దతు ధర కోల్పోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు అందుబాటులో లేకపోవడంతో ప్రైవేటు వ్యాపారులు, దళారులు తక్కువ ధరలకు ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. మద్దతు ధర దక్కకపోవడంతో పాటు రవాణా ఖర్చులు కూడా రైతులపై అదనపు భారం అవుతున్నాయని తెలిపారు. "మేము పండించిన వడ్లను అమ్ముకోవడానికి పక్క గ్రామాలకు వెళ్లాల్సి వస్తోంది. అక్కడ కూడా భారీ రద్దీ ఉండటంతో వారాల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. మా గ్రామంలోనే కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తే ఈ కష్టాలు తప్పుతాయి" అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని బాపు యాదవ్ తెలిపారు. పలిమెల, పంకెన గ్రామాల్లో వెంటనే పీఏసీఎస్, ఐకేపీ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు. ధాన్యం సేకరణలో జాప్యం లేకుండా గన్నీ బ్యాగులు, రవాణా సౌకర్యం కల్పించాలని, తేమ శాతం పేరుతో కోతలు విధించకుండా పూర్తి మద్దతు ధర చెల్లించాలని కోరారు. జిల్లా యంత్రాంగం, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి రైతుల సమస్యలు పరిష్కరించాలని, యుద్ధ ప్రాతిపదికన కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. లేనిపక్షంలో రైతులతో కలిసి ఆందోళన బాట పడతామని హెచ్చరించారు.

# యాసంగి వరి ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి : జిల్లా కలెక్టర్ కె.హరిత

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కాగజ్‌నగర్, మే 12 : జిల్లాలో యాసంగి వరి ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. మంగళవారం జిల్లాలోని కాగజ్ నగర్ మండలం జంబుగా గ్రామంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా తో కలిసి సందర్శించి ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వ్యాసంగి వరి ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు కేంద్రాలలో త్రాగునీరు, నీడ సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. అవసరమైన గోనె సంచులు, టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉంచాలని, తేమ శాతం వచ్చిన ధాన్యాన్ని వెంటనే తూకం వేసి కేటాయించిన ప్రకారం రైస్ మిల్లులకు తరలించాలని తెలిపారు. సంబంధిత రైస్ మిల్లర్లు జాప్యం లేకుండా ధాన్యం దిగుమతి చేసుకోవాలని తెలిపారు. అకాల వర్షాల నేపథ్యంలో రైతులు ధాన్యం కుప్పలను టార్పాలిన్ కవర్లను జాగ్రత్తగా గాలికి ఎగిరిపోకుండా కప్పి ఉంచాలని, ఎండ తీవ్రత దృష్ట్యా రైతులు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. ధాన్యం తరలించేందుకు వాహనాల కొరత లేకుండా స్థానిక వాహనాలను వినియోగించుకోవాలని, ఇతర ప్రాంతాల హమాలీలపై ఆధారపడకుండా స్థానికంగా ఉన్న హమాలీలను వినియోగించుకోవాలని తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను అధికారులు సమన్వయంతో వ్యవహరించి ప్రశాంతంగా సాగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం కాగజ్ నగర్ పట్టణంలోని 6వ వార్డులో ఇండ్ల గణన సర్వేను సబ్ కలెక్టర్ తో కలిసి పరిశీలించారు. జనగణన 2027 లో భాగంగా చేపట్టిన ఇండ్ల గణన ప్రక్రియను



ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లు సమన్వయంతో వ్యవహరించి తమకు కేటాయించిన బ్లాక్ పరిధిలో ఇంటింటికి వెళ్లి పొరపాట్లకు తావు లేకుండా వివరాలు స్పష్టంగా నమోదు చేయాలని, గణన ప్రక్రియలో పొందుపరిచిన 33 ప్రశ్నలకు సంబంధించి ఇండ్ల యజమానుల నుండి వివరాలు సేకరించి ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టే సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలు జన గణన ఆధారపడి జరుగుతుందని తెలిపారు. జూన్ 9వ తేదీ వరకు కొనసాగనున్న ఇండ్ల గణన ప్రక్రియను సమర్థవంతంగా చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్ మధుకర్, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలి



**జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కాగజ్‌నగర్, మే 12 : రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్ అన్నారు. మంగళవారం జిల్లాలోని సాండ్ గాం, వీరవెల్లి, దుబ్బగూడ, కుంబరి గ్రామాలలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా మద్దతు ధర చెల్లించి రైతుల వద్ద నుండి నిబంధనల ప్రకారం ధాన్యం కొనుగోలు చేయాలని తెలిపారు. జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి రైతులకు నగదు చెల్లింపు త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సజావుగా కొనుగోలు ప్రక్రియ చేపట్టాలని, కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకొచ్చే వరి ధాన్యం తప్పనిసరిగా నిబంధనల ప్రకారం శుభ్రపరచి, నాణ్యత ప్రమాణాలు పాటించేలా రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు.



# ప్రజలకు పారదర్శక, స్నేహపూర్వక సేవలు అందించాలి

**- భూపాలపల్లి పోలీస్ స్టేషన్, సబ్‌డివిజన్ కార్యాలయాన్ని పరిశీలించిన జిల్లా ఎస్పీ**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్-భూపాలపల్లి, మే 12 : వార్షిక తనిఖీల్లో భాగంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ భూపాలపల్లి పోలీస్ స్టేషన్‌తో పాటు సబ్‌డివిజన్ పోలీస్ కార్యాలయాన్ని మంగళవారం సందర్శించి సమగ్ర తనిఖీ నిర్వహించారు. జిల్లాలో పోలీస్ వ్యవస్థ పనితీరు, ప్రజలకు అందుతున్న సేవలపై ప్రత్యక్ష అవగాహన పొందడమే ఈ తనిఖీల ప్రధాన ఉద్దేశమని ఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా "వన మహోత్సవం" కార్యక్రమంలో భాగంగా పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో మొక్క నాటి పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన బ్యాడ్మింటన్ కోర్టును ప్రారంభించారు. తనిఖీలలో భాగంగా స్టేషన్ పరిశుభ్రత, పరిసరాల నిర్వహణ, రికార్డుల నిర్వహణ విధానం, సిబ్బంది విధి నిర్వహణను ఎస్పీ పరిశీలించారు. స్టేషన్‌లో నమోదైన కేసుల దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసుల పరిష్కారంపై సమీక్ష నిర్వహించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజలకు స్నేహపూర్వక వాతావరణం కల్పిస్తూ, వారి సమస్యలను వేగవంతంగా, పారదర్శకంగా పరిష్కరించే విధంగా సేవలు అందించాలని సిబ్బందికి ఆదేశించారు. ప్రజల్లో పోలీస్ శాఖపై విశ్వాసం పెంపొందించడం ప్రధాన లక్ష్యమని ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ పేర్కొన్నారు.



# కుమ్మరి కులస్థుల సర్వసభ్య సమావేశాన్ని విజయవంతం చేయాలి

**- రాష్ట్ర స్థాయి సమావేశానికి పెద్దఎత్తున తరలిరావాలి**

**- కుమ్మరి సంఘం జిల్లా అధ్యక్షుడు కొండపర్తి ఇస్తారి**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్-భూపాలపల్లి, మే 12 : ఈ నెల 17న హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ వేదికగా నిర్వహించనున్న కుమ్మరి కులస్థుల సర్వసభ్య సమావేశాన్ని విజయవంతం చేయాలని జిల్లా కుమ్మరి సంఘం అధ్యక్షుడు కొండపర్తి ఇస్తారి పిలుపునిచ్చారు. మంగళవారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర కుమ్మరి సంఘం అధ్యక్షుడు నడిగూడ జయంత్‌రావు ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ఈ సమావేశానికి రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి కుమ్మరి కులస్థులు హాజరవుతున్నారని తెలిపారు. కుమ్మరి కులానికి రావాల్సిన అధికారిక వాటాల్లో అన్యాయం జరుగుతోందని ఆరోపించిన ఇస్తారి, తమ హక్కుల సాధన కోసం అందరూ ఏకతాటిపైకి రావాల్సిన అవసరం ఉందన్నారు. సమాజ అభ్యున్నతి, హక్కుల పరిరక్షణ కోసం నిర్వహిస్తున్న ఈ సమావేశానికి జయశంకర్-భూపాలపల్లి జిల్లా వ్యాప్తంగా ఉన్న కుమ్మరి కులస్థులు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు నాంపల్లి ఐలయ్య, ఆకారపు శంకర్, టౌన్ అధ్యక్షుడు కాసర్ల కృష్ణంరాజు, జిల్లా కోశాధికారి నాంపల్లి అశోక్, పైడిపాల రాములు, రాతిపల్లి ఓదెలు, పైడిపాల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు మ్యాపింగ్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలి

**జిల్లా కలెక్టర్ కె.హరిత**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



కాగజ్‌నగర్, మే 12: ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో ఓటరు మ్యాపింగ్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. మంగళవారం జిల్లాలోని సిర్పూర్ నియోజకవర్గానికి సంబంధించిన మండలాల తహసిల్దార్లు, ఎ పి ఎం లు, ఐ సి డి ఎస్ సూపర్వైజర్లు, బూత్ స్థాయి అధికారులు, సూపర్వైజర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా ఓటరు మ్యాపింగ్ సమర్థవంతంగా చేపట్టాలని, జిల్లాలో మ్యాపింగ్ శాతం తక్కువగా ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి పెంచేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. అధికారులు సమన్వయంతో పని చేసి మ్యాపింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలని, పంచాయతీ కార్యదర్శులు బూత్ స్థాయి అధికారులకు పూర్తి స్థాయిలో సహకారం అందించాలని తెలిపారు. అనంతరం వరి ధాన్యం కొనుగోలు, గోనె సంచుల లభ్యత, భూభారతి దరఖాస్తుల పరిశీలన, ధ్రువ పత్రాల జారీ, పెండింగ్ అంశాలపై తహసిల్దార్లతో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు చేపట్టాలని, రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోలు కేంద్రాలలో సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. అకాల వర్షాల నేపద్యంలో అవసరమైన గోనె సంచులు, టార్పాలిన్ కవర్లను అందుబాటులో ఉంచాలని సూచించారు. వివిధ భూ సమస్యలపై భూభారతి రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులను రికార్డులతో సరిచూసి క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వివిధ ధృవపత్రాల కొరకు వచ్చిన దరఖాస్తులను నిబంధ నలకు లోబడి పరిశీలించి నిర్ణీత గడువులోగా జారీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పెండింగ్ అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఐ.టి. ఐటిసిలలో ఆన్లైన్ దరఖాస్తులు ఆహ్వానం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



మహబూబాబాద్ టౌన్, మే 12 : తెలంగాణ ఉపాధి, శిక్షణ శాఖ, హైద్రాబాద్ ఆధ్వర్యంలో 2026-27 విద్యా సంవత్సరానికి ప్రభుత్వ ఐ.టి. ఐ,ఎ.టి.సి. లలో మొదటి దఫా ప్రవేశాల కొరకు నోటిఫికేషన్ జారీ చేసినారని ఆగస్ట్ 2026 సెషన్ కోసం ఎన్‌సివి టి క్రింద వివిధ ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్ ట్రేడ్స్ లలో శిక్షణ పొందేందుకు అర్హులైన విద్యార్థుల నుండి ఆన్లైన్లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రభుత్వ ఐటిఐ కళాశాల ప్రిన్సిపల్ బి. ఓంకార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు https://iti.telangana.gov.in వెబ్సైట్ ద్వారా ఆన్లైన్ దరఖాస్తులు స్వీకరించబడునని 14 సంవత్సరాలు నిండి పదవ తరగతి ఉత్తీర్ణత పొంది ఉండాలని ఆన్లైన్లో దరఖాస్తు తో పాటు 100 రూపాయల రుసుము చెల్లించవలసి ఉంటుందని దరఖాస్తు చేసేటప్పుడు సంబంధిత కాపీలన్నింటిని స్కాన్ చేసుకొని కావాల్సిన ఐటిఐ,ఏటీసీలలో ఉన్న కోర్సులను ఎంపిక చేసుకోవాలని కావున మహబూబాబాద్ జిల్లా ఐటిఐలలో ఉన్న ఎలక్ట్రిషియన్, ఫిట్టర్, డిజిల్ మెకానిక్, అదేవిధంగా ఎటిసిలో ఉన్న సిఎన్‌సి మెషినింగ్ టెక్నిషియన్, మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికిల్, ఇంజనీరింగ్ డిజైన్ టెక్నిషియన్,వర్చువల్ అనాలసిస్ డిజైన్ తదితర కోర్సులలో ప్రవేశాలకు జిల్లాలో ఉన్న విద్యార్థిని విద్యార్థులందరూ ఈ నెల 14వా తేదీ వరకు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. ఇట్టి అవకాశాన్ని అందరూ వినియోగించుకోవాలని ఈ సందర్భంగా ప్రిన్సిపల్ పేర్కొన్నారు.

Printed, Published and Owned by **KORUKANTI MANIDEEP PATEL,** Printed at SRI BALAJI PRINTING PRESS, H.No. 4-4-/85, Thilak Road, Karimnagar, Telangana - 505001 and Published at H.No.2-6-242, Ist Floor, Bus stand to Wesly Church Road, Mukarampura, Karimnagar, Karimnagar (Dist.), Telangana-505001, Editor: **GOLI SAMMI REDDY.** RNI.No.TELTEL/2010/35941. Cell: 9394322782, email: prajalakshyam@gmail.com